www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


లొంగిపోయిన నక్సల్స్ (వృత్తంలో అనంత్)


జనవరి 1న అందరమూ లొంగిపోతాం

- ఆయుధాలు కూడా అప్పగిస్తాం.. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి
- అరెస్టులు, ఎన్‌కౌంటర్లు వద్దు.. భరోసానిచ్చే రాష్ట్రంలో లొంగుబాటు
- 3 రాష్ట్రాల స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ పేరిట నక్సల్స్ లేఖ
- ఆపై గంటల వ్యవధిలోనే లొంగిపోయిన అనంత్ సహా 15 మంది

10

శనివారం | 29-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 241 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా.11.15 తదుపరి దశమి; నక్షత్రం: పూర్వాభాద్ర రా.2.22 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: ఉ.9.06-10.40; దుర్ముహూర్తం: ఉ.6.31-8.00; అమృతఘడియలు: రా.6.31-8.05; రాహుకాలం: ఉ.9.00-ఉ.10.30; సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం మల్లాపూర్‌లో నామినేషన్ కేంద్రం వద్ద క్యూలో అభ్యర్థులు

సర్పంచ్‌గిరి..
వేలం వెర్రి!
ఏకగ్రీవాల మాటున రూ.లక్షల్లో వేలం పాటలు

- గద్వాల జిల్లాలో రెండోరోజు 12 గ్రామాల్లో ఏకగ్రీవం
- మిట్టదొడ్డిలో 90 లక్షలు.. వీరాపురంలో 50 లక్షలు
- సద్దలోనిపల్లిలో శ్మశానవాటికకు రెండెకరాలిచ్చిన వ్యక్తికి దక్కిన పదవి
- నేటితో తొలివిడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పూర్తి
- 4,236 సర్పంచ్ పదవులకు 8,198 నామినేషన్లు
- బలవంతపు ఏకగ్రీవాలను హైకోర్టులో సవాలు చేస్తాం
- నిఘా వేదిక, స్థానిక ప్రభుత్వాల సాధికారిక వేదిక
- గిరిజన ఓటరు ఒక్కరూ లేరు.. ఐనా ఎస్టీలకు రిజర్వ్!
- అమ్రాబాద్ మండలంలోని 5 గ్రామాల పరిస్థితి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఏకగ్రీవాలు ఆగడం లేదు. సరికదా.. జోరందుకుంటున్నాయి! నామినేషన్ల హడావుడి, గ్రూపు రాజకీయాలు, విజయం కోసం ఎత్తులు పైఎత్తులతో కూడిన రాజకీయాలతో వేడెక్కే గ్రామాలు కూడా చిత్రంగా ఐక్యతా రాగం వినిపిస్తున్నాయ్. 'వీరో.. వారో ఎవరైతే నేమీ.. వేలంపాటలో పోటీపడండి.. సర్పంచ్ అవ్వండి' అంటున్నాయి. సర్పంచ్ పదవులకు వేలం నిర్వహించడంపై ఈసీ హెచ్చరించినా లెక్క చేయడం లేదు.. పోటీలో ఉండి

మిగతా 14వ పేజీలో...

ఎన్నికల ప్రక్రియను ఆపలేం



- బీసీల్లో క్యాటగిరీల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయకపోవడంపై పిటిషన్
- చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ
- రిజర్వేషన్ల జీవో 46పై స్టేకు హైకోర్టు నిరాకరణ
- ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ

14

TELANGANA RISING GLOBAL SUMMIT

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో

ఉజ్వల తెలంగాణలో మీరూ..

- 3 వేల మందిని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్న ప్రభుత్వం
- ప్రముఖులకు సీఎం రేవంత్ పేరిట లేఖలు
- సదస్సుకు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బెయిర్, ఆనంద్ మహీంద్ర తదితరులు
- ముగింపు ఘట్టానికి అతిథిగా మెస్సీ
- ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహణ

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'రండి.. ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి' అనే నినాదంతో ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది. డిసెంబరు 8, 9 తేదీల్లో నగర శివార్లలోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ సదస్సు నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. దేశ విదేశాలకు చెందిన

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రాల అధికారాలు హరించేలా విత్తన బిల్లు-2025: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


12

కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ
రాజీనామా!

- పీజీ వైద్య విద్య పరీక్ష ఫలితాల్లో అక్రమాలపై తీవ్ర దుమారం నేపథ్యంలో..
- వర్సిటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణలో వెల్లడి.. ప్రభుత్వానికి రాజీనామా లేఖ పంపిన వైస్ చాన్సలర్
- ఈ ఏడాది మార్చి 18న వీసీగా నియమితులైన డాక్టర్ నందకుమార్ రెడ్డి
- కాళోజీ వర్సిటీ వ్యవహారంపై సీఎం ఆగ్రహం.. బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాళోజీ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉప కులపతి(వైస్ చాన్సలర్) డాక్టర్ నందకుమార్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఇందుకు సంబంధించిన లేఖను ప్రభుత్వానికి పంపారు. ఇటీవల విడుదలైన పీజీ వైద్య విద్య పరీక్షా ఫలితాల్లో ఓ విద్యార్థి నిబంధనలకు విరుద్ధంగా పాసైన ఘటన తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ ఘటనపై ప్రభుత్వం ప్రాథమిక విచారణ జరిపించింది. హెల్త్ యూనివర్సిటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్టు ఆ విచారణలోనూ తేలింది. దీంతో మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే వీసీ డాక్టర్ నందకుమార్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. కాగా డాక్టర్ నందకుమార్ రెడ్డిని ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 18న హెల్త్ యూనివర్సిటీ వీసీగా నియమించింది. సరిగ్గా 8 నెలల 10 రోజులకు ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇక, డాక్టర్ నందకుమార్ రెడ్డి శుక్రవారం సాయంత్రం హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినాను కలిశారని, ఆ తర్వాత డాక్టర్ క్రిస్టినాతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిశారని వైద్యవర్గాలు పేర్కొన్నాయి.


నందకుమార్ రెడ్డి

పారదర్శకంగా పని చేయాలి: సీఎం

మరోవైపు కాళోజీ వర్సిటీ వ్యవహారాలపై పత్రికల్లో వస్తున్న కథనాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో అవకతవకలు, ఇష్టారీతిగా ఇన్‌చార్జిల నియామకం తదితర అంశాల్లో వస్తున్న ఆరోపణలపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి వివరణ కోరారు. ఉన్నతమైన వర్సిటీలో అస్తవ్యస్త పరిస్థితులకు కారణమైన వారిపై కఠిన చర్యలు

మిగతా 13వ పేజీలో...


లలిత అభిలాష్

సిరిసిల్లలో తల్లీ కొడుకు ఆత్మహత్య

- మానసిక స్థితి సరిగా లేక నదిలో పడి తల్లి మృతి
- ఆవేదనతో అదే నదిలో దూకి కొడుకు బలవన్మరణం
- మృతుడు పోలీస్ కానిస్టేబుల్

3

అమెరికాతో రూ. 7,995 కోట్ల రక్షణ ఒప్పందం

- భారత నౌకాదళంలోని సీహాక్ హెలికాప్టర్ల నిర్వహణ బాధ్యతలు అమెరికాకు..
- ఐదేళ్లపాటు అమలులో
- టారిఫ్‌ల మోత తర్వాత తొలి ఒప్పందం ఇదే

2

పక్కా ప్లాన్‌తో.. 'మత్తు'
వదిలించారు


పాదరక్ష సోల్‌లో డ్రగ్స్; పై నుంచి చూస్తే ఇలా..

- క్షేత్రస్థాయిలో నిఘా పెట్టి నైజీరియా డ్రగ్స్ రాకెట్‌ను చిత్తుచేసిన ఈగిల్ బృందం
- మల్నాడు రెస్టారెంట్ నుంచి ఢిల్లీ వరకు..
- 'మత్తు' నెట్‌వర్క్ గుట్టు విప్పిన కొరియర్ పార్సిల్
- వస్త్రాలు, పాదరక్షల పార్సిళ్లలో మత్తు మందులు
- దేశవ్యాప్తంగా 2 వేల మందికి డ్రగ్స్ సరఫరా
- సూత్రధారితో పాటు 50 మంది అరెస్ట్
- రూ.3.5 కోట్ల విలువైన మత్తుమందులు స్వాధీనం
- హైదరాబాద్‌కు చెందిన 11మందికి డ్రగ్స్ రవాణా
- మీడియాకు వివరాలు వెల్లడించిన ఢిల్లీ, తెలంగాణ పోలీసులు

హైదరాబాద్/ న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మల్నాడు రెస్టారెంట్‌లో డ్రగ్స్ తీగ దొరికింది.. అదేమిటని లాగుతూ వెళితే ఢిల్లీలో ఓ నైజీరియన్ వరకు వెళ్లింది. అదేదో పెద్ద వ్యవహారంలా ఉందని గట్టిగా ప్రయత్నిస్తే ఏకంగా భారీ నైజీరియన్ డ్రగ్స్ కార్టెల్ డొంక కదిలింది. వినూత్నంగా వస్త్రాలు, బూట్లు, సౌందర్య ఉత్పత్తుల పార్సిళ్లలో వాటితోపాటు డ్రగ్స్ పెట్టి సరఫరా చేస్తున్న నెట్‌వర్క్ గుట్టు బయటపడింది. మల్నాడు రెస్టారెంట్ కేసులో ఢిల్లీ నుంచి వచ్చిన పార్సిల్‌ను స్వాధీనం చేసుకున్న ఈగిల్ అధికారులు.. అందులోని చెప్పుల్లో డ్రగ్స్‌ను

మిగతా 12వ పేజీలో...



ఆర్థికం.. అబ్బురం!
చైనాను మించిన భారత వృద్ధి రేటు

- సెప్టెంబరు త్రైమాసికంలో 8.2%.. 6 త్రైమాసికాల గరిష్ఠం
- అమెరికా సుంకాల నేపథ్యంలోనూ రికార్డు స్థాయి ప్రగతి
- కలిసొచ్చిన తయారీ, సేవా రంగాల జోరు, జీఎస్టీ సంస్కరణలు
- శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అగ్రస్థానం
- మా ప్రభుత్వ విధానాలు, సంస్కరణల ఫలితం: ప్రధాని మోదీ

భారతదేశ ఆర్థిక ప్రగతి అంచనాలను మించి పరుగెడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జులై-సెప్టెంబరు త్రైమాసికం (క్యూ2)లో జీడీపీ వృద్ధి రేటు ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి చేరింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాలు విధించినా దేశీయంగా తయారీ, సేవా రంగాల పనితీరుతో ఈ ప్రగతి సాధ్యమైంది. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో వినియోగం పెరగవచ్చన్న అంచనాలు కూడా కలిసొచ్చాయి. దీంతో ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 2025-26 క్యూ2లో చైనా జీడీపీ వృద్ధి రేటు 4.8 శాతాన్ని మించిన వృద్ధి సాధించిన భారత్ ప్రపంచ ఆర్థిక వృద్ధికి చోదకంగా మారింది. తమ ప్రభుత్వం అమలు చేసిన విధానాలు, సంస్కరణల వల్లే ఈ ప్రగతి సాధ్యమైందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

భారత జీడీపీ డేటాకు సీ గ్రేడ్: ఐఎంఎఫ్

- గ్రేడింగ్‌లో ఇది రెండో అతి తక్కువ స్థాయి
- గణాంకాల్లో పారదర్శకత లేదని విమర్శ

విమానంలోకి ఇరుముడిని తీసుకెళ్లొచ్చు

- అయ్యప్ప భక్తులకు పౌర విమానాయన శాఖ శుభవార్త
- క్యాబిన్ బ్యాగేజీ కింద అనుమతి-చ్చేందుకు ఓకే
- జనవరి 20 వరకు మాత్రమే వెసులుబాటు
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఇప్పటిదాకా చెక్-ఇన్ లగేజీలోనే అనుమతి



న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విమానంలో శబరిమల వెళ్లాలనుకుంటున్న అయ్యప్ప స్వామి భక్తులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు శుభవార్త చెప్పారు. అయ్యప్ప స్వాములు అత్యంత పవిత్రంగా భావించే ఇరుముడిని (కొబ్బరికాయతో సహా) తమతోపాటే నేరుగా విమానంలో తీసుకెళ్లేందుకు (క్యాబిన్ బ్యాగేజీ కింద) అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రత్యేక సడలింపు

మిగతా 2వ పేజీలో...

కోకాపేటలో కోట్ల వర్షం

- ఎకరం ధర రూ.151.25 కోట్లు
- పోటీపడిన డెవలపర్లు
- 2 ప్లాట్ల విక్రయంతో హెచ్ఎండీఏకు రూ.1,353 కోట్ల ఆదాయం

10

నేడు సిద్దూ, శివకుమార్ భేటీ!

- గందరగోళ 'కర్ణాటకం'లో అనూహ్య పరిణామం
- హైకమాండ్ సూచనతో డిప్యూటీ సీఎంను అల్పాహార విందుకు ఆహ్వానించిన సిద్దరామయ్య

2




ఇది నవ భారతం.. ఎవరికీ తల వంచదు

- రామజన్మభూమి పోరాటంలో ఉడుపి మఠానిది కీలకపాత్ర: ప్రధాని మోదీ
- ఉడుపి శ్రీకృష్ణమఠంలో లక్ష కంఠ గీతా పారాయణానికి హాజరు

2

గోవాలో 77 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రధాని



4న భారత్‌కు పుతిన్

- 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో రెండు రోజుల పాటు చర్చలు
- ఎస్‌యూ-57 ఫైటర్లు, మరిన్ని ఎస్-400ల కొనుగోలుపై ఒప్పందాలు కుదిరే అవకాశం
- స్థానిక కరెన్సీల్లో లావాదేవీలు, పౌర అణుశక్తి రంగంలో సహకారంపై నిర్ణయాలు!

2

నేడు సిద్దూ, డీకే భేటీ!

» హైకమాండ్ సూచనతో డిప్యూటీ సీఎం శివకుమార్‌ను అల్పాహార విందుకు ఆహ్వానించిన సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం మార్పుపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ అనూహ్య పరిణామం చోటు చేసుకుంటోంది. అధిష్ఠానం సూచనతో డిప్యూటీ సీఎం శివకుమార్‌ను శనివారం ఉదయం అల్పాహార విందుకు ఆహ్వానించినట్లు సీఎం సిద్దరామయ్య శుక్రవారం వెల్లడించారు. తమ ఇద్దరికీ హైకమాండ్ నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయని, ఇద్దరూ సమావేశమై మాట్లాడుకోవాలని సూచించారని పేర్కొన్నారు. బ్రేక్‌ఫాస్ట్‌కు డీకే వచ్చినప్పుడు.. తామిద్దరం అక్కడ 'అన్ని విషయాలపై చర్చించుకుంటామని తెలిపారు. అధిష్ఠానం పిలిస్తే ఢిల్లీకి వెళ్తానని, హైకమాండ్ ఏం చెప్పినా పాటిస్తామనే విషయాన్ని తామిద్దరం ఇప్పటికే చెప్పామన్నారు. అయితే, శుక్రవారం ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న డీకే శివకుమార్.. సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరడం గమనార్హం. అంతకుముందు డీకే బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ తాను దేనికీ ఆత్రుత చూపనని, అన్నీ పార్టీ అధిష్ఠానమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రెండు రోజుల క్రిందట బెంగళూరు నుంచి ఢిల్లీకి చేరుకున్నా.. సోనియా గాంధీ విదేశాల్లో ఉండడంతో సీఎం మార్పు అంశంపై చర్చలు జరగలేదని తెలుస్తోంది. ఆమె ఢిల్లీ చేరుకున్న తర్వాత ఆదివారం ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్‌లతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత, సిద్దరామయ్య, శివకుమార్‌ను ఢిల్లీకి పిలిచి, వారికి దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. కాగా, సిద్దరామయ్యను పదవి నుంచి తొలగిస్తే కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేది లేదని కురుబ సామాజికవర్గం ప్రకటించింది.

బిహార్ ఓటమికి నేనూ బాధ్యుడినే: రాహుల్



న్యూఢిల్లీ, నవంబరు 28 : బిహార్‌లో కాంగ్రెస్ ఓటమికి స్థానిక నాయకులతో సమానంగా తాను కూడా బాధ్యుడినేనని ఆ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నట్టు సమాచారం. బిహార్ ఎన్నికల కోసం పనిచేసిన నాయకులు, పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులతో కాంగ్రెస్ అధిష్ఠానం శుక్రవారం అంతర్గత సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగానే రాహుల్ పై వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈసీ చేపట్టిన 'సర్' ప్రక్రియ వల్లే బిహార్‌లో ఓడిపోయామని నేతలు తేల్చినట్టు తెలిసింది. ఓటమినే తలుచుకుని బాధపడకుండా, ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించాలని రాహుల్ ఈ సమావేశంలో నేతలకు హితబోధ చేసినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. "వ్యవస్థాగత బలహీనతలే కాంగ్రెస్‌ను దెబ్బతీశాయనే వాదనను రాహుల్ సమావేశంలో అంగీకరించలేదు. అదే నిజమైతే గట్టి పార్టీ నిర్మాణాలు కలిగిన ఆర్జేడీ, వామపక్షాలు ఎందుకు ప్రభావం చూపలేకపోయాయని ఆయన ప్రశ్నించారు. ఏ అంశాలు బిహార్‌లో పార్టీని దెబ్బతీశాయనేది నిర్దిష్టంగా గుర్తించాలని, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలని ఆయన దిశానిర్దేశం చేశారు" అని ఓ నేత తెలిపారు. కాగా, ప్రాణాంతకంగా మారిన ఢిల్లీ వాయు కాలుష్య సమస్యపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరపాలని కేంద్రాన్ని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

రైళ్లలో ఆహార పదార్థాల అధిక ధరలకు చెక్

నూఢిల్లీ, నవంబరు 28: వందేభారత్, రాజధాని వంటి ప్రీమియర్ రైళ్లలో ఆహార పదార్థాల రేట్లు పెంచి విక్రయిస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ చర్యలు చేపట్టింది. సిబ్బందికి ఐడీ కార్డులు, యూనిఫాం ఇచ్చి అధిక వసూళ్లకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. మెనూ, అధికారిక రేట్లు తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్, ఫిర్యాదులు చేయడానికి హెల్ప్‌లైన్ నంబర్ యూనిఫాంపై ముద్రిస్తోంది. వందేభారత్, రాజధాని వంటి రైళ్ల సిబ్బందికి నేవీ బ్లూ జాకెట్లు, ఇతర రైళ్లలో సిబ్బందికి లైట్ బ్లూ టీషర్ట్‌లు ఇస్తుంది. ఈ యూనిఫాంలు క్రిస్మస్, కొత్త సంవత్సరం నుంచి మొదలవుతాయని అధికారులు తెలిపారు. ఈ ఐడీ కార్డులపై ఒకవైపు ఆహార పదార్థాల రేట్లతో మెనూ, మరోవైపు డిజిటల్ పేమెంట్స్ చేసేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. నగదు చెల్లింపుల వల్లే అధికధరలు వసూలు చేస్తున్నారనే ఉద్దేశంతో డిజిటల్ పేమెంట్లకు అవకాశం కల్పించారు.

భూమి కోసం మృతుల పేర్లతో ఫోర్జరీ పత్రాలు

» అల్ ఫలా వర్సిటీ చాన్స్‌లర్ సిద్ధిఖీ బాగోతం

న్యూఢిల్లీ, నవంబరు 28: హరియాణాలోని అల్ ఫలా యూనివర్సిటీ చాన్స్‌లర్ జావెద్ సిద్ధిఖీ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆయన ఎప్పుడో ఏళ్ల క్రితం చనిపోయిన హిందూ మతానికి చెందిన కొంత మంది పేర్లతో ఫోర్జరీ పత్రాలు సృష్టించి.. ఢిల్లీలోని మదన్‌పూర్ ఖాదర్‌లో భూమిని మోసపూరితంగా కొట్టేశాడని ఈడీ శుక్రవారం వెల్లడించింది. ఫోర్జరీ చేసిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) ద్వారా సర్వే నంబర్ 792లోని భూమిని సిద్ధిఖీకి సంబంధం ఉన్న తర్బియా ఎడ్యుకేషన్ ట్రస్టుకు బదిలీ చేయించుకున్నాడని పేర్కొంది. సిద్ధిఖీ సృష్టించిన ఫోర్జరీ పత్రాల్లో పేర్లు కనిపిస్తున్న కొంత మంది భూయజమానులు 1972, 1998 మధ్య చనిపోయారని, అయినా వారి పేర్లతో 2004 జనవరి 7వ తేదీతో జీపీఏ పుట్టించారని, ఆ తర్వాత దాన్ని భూమిని రిజిస్టర్ చేసుకొనేందుకు ఉపయోగించారని ఈడీ వివరించింది.

పేదలకు న్యాయం అందించేందుకు అర్ధరాత్రి వరకైనా కోర్టులో ఉంటా: సీజేఐ

న్యూఢిల్లీ, నవంబరు 28: పేద కక్షిదారులకు న్యాయం చేయడమే తన ప్రథమ ప్రాధాన్యమని, అవసరమైతే వారికోసం అర్ధరాత్రి వరకు కోర్టులో కూర్చుంటానని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. శుక్రవారం కేంద్రంతో పాటు ఇతరులపై తిలక్‌సింగ్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన అనంతరం జస్టిస్ జోయమాల్య బాగ్చితో కలిసి సీజేఐ మాట్లాడారు. 'నా కోర్టులో లగ్జరీ వ్యాజ్యాలు లేవు. అలాంటి కేసులను ధనవంతులైన కక్షిదారులు కొనసాగిస్తున్నారు. నేను మీకు ఒక విషయం చెబుతాను. చివరి వరుసలో ఉన్న అతి చిన్న, పేద కక్షిదారుడి కోసం నేను ఇక్కడ ఉన్నాను. అవసరమైతే వారికోసం అర్ధరాత్రి వరకు ఇక్కడే కూర్చుంటాను' అని సీజేఐ సూర్యకాంత్ చెప్పారు.

భారత జీడీపీ డేటాకు 'సీ' గ్రేడ్

» కేటాయించిన అంతర్జాతీయ ద్రవ్య నిధి

» గణాంకాల్లో పారదర్శకత లేదని విమర్శ

న్యూఢిల్లీ, నవంబరు 28: భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ), స్థూల విలువ జోడింపు (జీవీఏ) గణాంకాలకు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సీ గ్రేడును కేటాయించింది. తన నాలుగో వార్షిక నివేదికలో ఈ మేరకు ప్రకటించింది. జీడీపీ గ్రేడింగ్‌లో ఇది రెండో అతి తక్కువ స్థాయి. ఐఎంఎఫ్ మొత్తం ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు ఇస్తుంది. జీడీపీ, జీవీఏ మదింపు కోసం సేకరిస్తున్న గణాంకాల్లో పారదర్శకత లేదని ఆక్షేపించింది. గణాంకాల సేకరణ కోసం కేంద్ర గణాంక సంస్థ తీసుకున్న ఆధార సంవత్సరమే పెద్ద పొరపాటు అని పేర్కొంది. భారత జీడీపీ లెక్కల కోసం ప్రస్తుతం 2011-12ను ఆధార సంవత్సరంగా తీసుకుంటున్నారు. ఈ విధానం చాలా అసంబద్ధంగా ఉందని ఐఎంఎఫ్ విమర్శించింది. అంతేకాకుండా జీడీపీ మదింపు కోసం వ్యయ గణాంకాలను కాకుండా, ఆదాయ గణాంకాలను పరిగణనలోకి తీసుకోవటం కూడా సరిగా లేదని పేర్కొంది. కొత్తరకమైన గణాంక విధానాలను అనుసరించటం లేదని ఆక్షేపించింది. ధరల లెక్కింపులో టోకు ధరల సూచీనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు తప్పితే, ఉత్పత్తిదారుల ధరల సూచీని పట్టించుకోవటం లేదని విమర్శించింది. అయితే, టోకు ధరల సూచీ గణాంకాలకు మాత్రం బీ గ్రేడ్ కేటాయించింది. అన్నిరకాల గణాంకాలకు కలిపితే భారత్‌కు బీ గ్రేడ్ ఇస్తున్నట్లు ప్రకటించింది.

పేద దేశాల పౌరులకు నో ఎంట్రీ

19 దేశాల పౌరులకు అమెరికా గేట్లు మూత.. వారి ఇమిగ్రేషన్ దరఖాస్తులపై నిరవధిక నిషేధం



1.అఫ్గానిస్థాన్, 2. మయన్మార్, 3. బురుండి, 4. చాద్, 5. రిపబ్లిక్ ఆఫ్ కాంగో, 6. క్యూబా, 7. ఈక్వటోరియల్ గినియా, 8. ఎరిత్రియా, 9. హైతీ, 10. ఇరాన్, 11. లావోస్, 12. లిబియా, 13. సియెర్రాలియోన్, 14. సోమాలియా, 15. సూడాన్, 16. టోగో, 17. తుర్క్‌మెనిస్థాన్, 18. వెనుజువెలా, 19. యెమెన్

న్యూయార్క్/వాషింగ్టన్, నవంబరు 28: ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత వెనుకబడిన మూడో ప్రపంచ దేశాల పౌరులు అమెరికాలోకి అడుగుపెట్టకుండా శాశ్వతంగా నిషేధం విధిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆ దేశాల పౌరుల వల్లే అమెరికాలో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు జరుగుతున్నాయని ఆరోపించారు. గత అధ్యక్షుడు జో బైడెన్ నిద్ర మత్తులో ఒక్క సంతకం చేసి ఇలాంటివారిని వేలమందిని అమెరికాలోకి రానిచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారివల్ల అమెరికాలోని పశ్చిమదేశాల సంస్కృతి నాశనమవుతోందని నిందించారు. అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సమీపంలో నేషనల్ గార్డు దళ సిబ్బందిపై అఫ్గాన్ జాతీయుడు బుధవారం కాల్పులు జరిపిన నేపథ్యంలో ట్రంప్ గురువారం తన సొంత సోషల్‌మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు ఓ పోస్టు పెట్టారు. 'సాంకేతికంగా మనం ఎంత అభివృద్ధి చెందినా.. లోపభూయిష్టమైన వలస విధానాల వల్ల వాటి ఫలితాలను అనుభవించలేకపోతున్నాం. అందువల్ల మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపేస్తాను. అమెరికాకు ఏమాత్రం ఉపయోగపడని వారిని, అమెరికాను ప్రేమించని వారిని దేశం నుంచి తరిమేస్తా' అని ప్రకటించారు. అమెరికా సమాఖ్య ప్రభుత్వం అందించే ఏ సబ్సిడీలు కానీ, ప్రయోజనాలు కానీ అమెరికా పౌరులు కానివారికి ఇకపై లభించవని ట్రంప్ ప్రకటించారు. 'అమెరికాలోని ప్రస్తుత పరిస్థితిని సరిదిద్దాలంటే తిరోగమన వలసలే మార్గం' అని స్పష్టంచేశారు. 'దొంగలు, హంతకులు, అమెరికాలో ప్రతిదాన్నీ నాశనం చేస్తున్నవారికి తప్ప మిగతా అమెరికా పౌరులందరికీ థ్యాంక్స్ గివింగ్ డే శుభాకాంక్షలు' అని ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. అమెరికాలో ప్రస్తుతం 5.3 కోట్లమంది విదేశీయులు ఉన్నారని, వారిలో చాలామంది ప్రభుత్వ సహాయం పొందుతున్నారని తెలిపారు. గ్రీన్‌కార్డుపై అమెరికాలో ఉంటూ ఏటా 30 వేల డాలర్లు సంపాదించుకుంటున్న ఒక వ్యక్తి.. ఏటా 50 వేల డాలర్ల విలువైన ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నాడు అని చెప్పారు. సోమాలియా నుంచి వచ్చిన వేలమంది శరణార్థులతో అందమైన మిన్నెసోటా రాష్ట్రం నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా పార్లమెంటు సభ్యురాలు, డెమోక్రాటిక్ నాయకురాలు ఇల్హాన్ ఒమర్‌పై ట్రంప్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. సోమాలియాలో జన్మించిన ఆమె.. అమెరికాకు వలస రావటానికి సోదరుడిని వివాహం చేసుకుందని ఆరోపించారు. కాగా, ట్రంప్ ఆదేశాలతో ఇప్పటికే గ్రీన్‌కార్డు పొందినవారి దరఖాస్తులను కూడా మరోసారి లోతుగా విశ్లేషించనున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో తెలిపారు. ట్రంప్ ఆదేశాల మేరకు 19 దేశాల నుంచి వలసలను నిరవధికంగా నిలిపేస్తున్నట్లు ప్రకటిస్తూ.. ఆ దేశాల జాబితాలను విడుదల చేశారు. కాగా, అఫ్గాన్ జాతీయుడు లకన్‌వాల్ కాల్పుల్లో బుధవారం తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు నేషనల్ గార్డు సభ్యుల్లో సారా (20) అనే మహిళా గార్డు మరణించినట్లు ట్రంప్ ప్రకటించారు.

త్వరలో వెనుజువెలాలో సైనిక చర్య

వెనుజువెలాలోని మాదకద్రవ్యాల ముఠాలను అంతం చేసేందుకు అతి త్వరలో ఆ దేశంలో భూమార్గంలో దాడులు నిర్వహిస్తామని ట్రంప్ ప్రకటించారు. వెనుజువెలా నుంచి సముద్రమార్గంలో అమెరికాలోకి వస్తున్న డ్రగ్స్‌ను తమ సైనిక దళాలు విజయవంతంగా అడ్డుకుంటున్నాయని ప్రశంసించారు. భూమార్గంలో కూడా ఆ దేశంలో దాడులు చేసి డ్రగ్స్ ముఠాలను అంతం చేస్తామని తెలిపారు.

ట్రంప్‌నకు చేతకావటంలేదు

ట్రంప్ శారీరక, మానసిన సామర్థ్యంపై న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. 79 ఏళ్ల ట్రంప్‌నకు అధ్యక్ష విధులు నిర్వహించటం చేతకావటం లేదని, అధికారిక సమావేశాల్లో అలసటతో మాట్లాడలేకపోతున్నారని పేర్కొంది. ఈ కథనాన్ని ట్రంప్ ఖండించారు. తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. అందుకు ఇటీవల తాను వరుసగా నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ పర్యటనలే నిదర్శనమన్నారు.

ఇంటర్వ్యూలకు పిలిచి అరెస్టులు

అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న అమెరికా అధికారులు.. గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులను ఇంటర్వ్యూలకు పిలిచి మరీ అరెస్టు చేస్తున్నారు. శాన్‌డియాగోలోని యూఎస్‌సీఐఎస్ ఆఫీసులో గ్రీన్‌కార్డు ఇంటర్వ్యూ కోసం వచ్చిన ఓ వ్యక్తి చేతులకు పోలీసులు బేడీలు వేసి ఈడ్చుకువెళ్తున్న వీడియో వైరల్‌గా మారింది. అమెరికా పౌరురాలైన అతడి జీవిత భాగస్వామిని కూడా అరెస్టు చేసినట్లు బాధితుడి న్యాయవాది టెస్సా కబ్రెరా మీడియాకు తెలిపారు. గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూల కోసం ఎదురుచూస్తున్నవారిని ఆఫీసుకు పిలిచి మరీ అరెస్టు చేస్తున్నారని మరో లాయర్ చెప్పారు.

అమెరికాతో రూ.7,995 కోట్ల రక్షణ ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబరు 28: భారత నౌకాదళంలో ఉన్న అమెరికా తయారీ ఎంహెచ్-60ఆర్ సీహాక్ హెలికాప్టర్ల ఫ్లీట్ నిర్వహణ కోసం ఆ దేశంతో ఒప్పందంపై భారత్ సంతకం చేసింది. భారత్‌పై అమెరికా అడ్డగోలు టారిఫ్‌ల విధింపు తర్వాత ఇదే తొలి రక్షణ రంగ ఒప్పందం కావడం గమనార్హం. రూ.7,995 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో భాగంగా.. ఐదేళ్లపాటు ఎంహెచ్-60ఆర్ సీహాక్ హెలికాప్టర్ల నిర్వహణ, నిర్ణీత సమయాల్లో తనిఖీలు, మరమ్మతులు, విడిభాగాలు, ఇతర పరికరాల సరఫరా, శిక్షణ, సాంకేతిక సహకారాన్ని అమెరికా అందించనుంది. ఇందుకోసం భారత్‌లోనే పలు మౌలిక సదుపాయాలు కల్పించనుంది. దీనితో ఈ హెలికాప్టర్లు ఐదేళ్లపాటు నిరంతరం యుద్ధ సన్నద్ధతతో ఉండేందుకు వీలు కలుగుతుంది. అమెరికాతో ఈ ఒప్పందంపై రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ సంతకాలు చేశారు. అమెరికా నుంచి 2011లో భారత్ 24 ఎంహెచ్-60ఆర్ హెలికాప్టర్లను కొనుగోలు చేసింది. లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ ఎంహెచ్-60ఆర్ సీహాక్‌లు.. ప్రపంచంలోని అత్యాధునిక యుద్ధ హెలికాప్టర్లలో కీలకమైనవి. క్లిష్టమైన వాతావరణంలోనూ సమర్థవంతంగా పనిచేయగలవు. కాగా, ఈ ఏడాది చివరినాటికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఫిక్కీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంలో చాలా అంశాలపై భారత ప్రయోజనాలను కాపాడే దిశగా గట్టి ప్రయత్నాలు చేశామని, ఒప్పందంపై చర్చలు ఓ కొలిక్కి వస్తున్నాయని తెలిపారు.

లోకం తీరు

నా సహనం నశిస్తోంది – డీకే శివకుమార్



రాజ్యాంగ సవరణతో చట్టసభల కాలపరిమితిని మార్చవచ్చు!

» జమిలి బిల్లుపై లా కమిషన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, నవంబరు 28: చట్టసభలకున్న ఐదేళ్ల కాలపరిమితిని రాజ్యాంగ సవరణ ద్వారా మార్చే అవకాశముందని లా కమిషన్ స్పష్టంచేసింది. పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపేందుకు ఉద్దేశించిన బిల్లుపై పార్లమెంటరీ సంయుక్త సంఘం (జేపీసీ) విస్తృత సంప్రదింపులు జరుపుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా దానికి కమిషన్ సవివర మెమోరాండం సమర్పించింది. డిసెంబరు 4న పార్లమెంటరీ కమిటీని నేరుగా కలిసి చర్చించనుంది. 'చట్టసభల కాలపరిమితికి సంబంధించి రాజ్యాంగమే పార్లమెంటుకు వెసులుబాట్లు కల్పించింది. ఐదేళ్లకు ముందే సభను రద్దుచేయొచ్చని, అత్యవసర పరిస్థితి విధించినప్పుడు దాని కాలపరిమితిని పొడిగించవచ్చన్న నిబంధనలను పొందుపరచింది. ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడం లేదు' అని లా కమిషన్ తేల్చిచెప్పింది. జమిలి ఎన్నికల కోసం ప్రతిపాదించిన బిల్లు.. రాజ్యాంగంలోని 368(2) అధికరణ ప్రకారం.. రాజ్యాంగ సవరణను సగం రాష్ట్రాలు సమర్థించాలన్న కేటగిరీలోకి రాదని కూడా స్పష్టంచేసింది.

ఇంటి నుంచే ఆధార్ మొబైల్ అప్‌డేట్

న్యూఢిల్లీ, నవంబరు 28: ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌లో ఏమైనా మార్పులు చేయాలనుకుంటే ఇక మీదట సెల్‌ఫోన్ నుంచే చేసుకోవచ్చు. ఈ మేరకు ఆధార్ యాప్‌లో కొత్త ఫీచర్‌ను తీసుకురానున్నామని ఉడాయ్ తెలిపింది. ఆధార్‌లో నమోదైన ఫోన్ నెంబరును మార్చుకోవాలనుకుంటే.. ఆధార్ సెంటర్‌కు వెళ్లి సంబంధిత పత్రాలు సమర్పించాల్సి వస్తోంది. యాప్‌లోకే ఈ సదుపాయం వస్తే.. ఇంట్లో నుంచే అప్‌డేట్ చేయవచ్చు. ఓటీపీ, ఫేస్ రికగ్నిషన్ ఆధారంగా ఇది జరుగుతుందని యూఐడీఏఐ వెల్లడించింది.

విమానంలోకి ఇరుముడిని తీసుకెళ్లొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

జనవరి 20 వరకు దేశవ్యాప్తంగా వర్తిస్తుందని తెలిపారు. ఎయిర్ పోర్టు భద్రతా సిబ్బందికి అయ్యప్ప భక్తులు సహకరించాలని, ఇరుముడి స్క్రీనింగ్, తనిఖీల సందర్భంలో అధికారుల సూచనలను అనుసరించాలని సూచించారు. ఇప్పటి వరకూ అమలులో ఉన్న భద్రతా నియమావళి ప్రకారం ఇరుముడిని చెక్-ఇన్ లగేజీగా మాత్రమే విమానాల్లో అనుమతిస్తున్నారు. దీనిపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో భక్తుల విశ్వాసాలను పరిగణనలోకి తీసుకున్న పౌర విమానయాన శాఖ.. ఇరుముడిని చేతబట్టుకునే విమానంలో ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం ఓ వీడియోను విడుదల చేశారు. "శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల భావోద్వేగాలను గౌరవిస్తూ.. ఇరుముడిని తమతో పాటు నేరుగా విమానంలో తీసుకెళ్లేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నా. అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూనే భక్తుల సంప్రదాయలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నాం" అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

4న భారత్‌కు పుతిన్

న్యూఢిల్లీ, నవంబరు 28: సుదీర్ఘకాలం నుంచి మిత్రదేశాలుగా ఉన్న భారత్, రష్యా సంబంధాలు నూతన శిఖరాలకు చేరనున్నాయి. వచ్చే నెల 4, 5 తేదీల్లో భారత్‌లో పుతిన్ పర్యటించనున్న నేపథ్యంలో రక్షణ, దౌత్యపరమైన బంధాలతోపాటు పలు ఇతర అంశాల్లో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముంది. భారత్‌లో పుతిన్ పర్యటన వివరాలను విదేశాంగ శాఖ శుక్రవారం ప్రకటించింది. "ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటిస్తారు. 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారు" అని వెల్లడించింది. పుతిన్‌కు గౌరవార్థం రాష్ట్రపతి విందు ఇవ్వనున్నట్టు తెలిపింది. భారత్‌పై అమెరికా అడ్డగోలు టారిఫ్‌లు, రష్యాపై ఆంక్షలు, రష్యా చమురు కొనుగోలు చేయవద్దన్న ఒత్తిడుల నేపథ్యంలో.. పుతిన్ భారత పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్‌కు మరిన్ని ఎస్-400 క్షిపణి రక్షక వ్యవస్థలు, రెండు స్క్వాడ్రన్ల ఎస్‌యూ-57 ఫైటర్ల సరఫరా, ఇరు దేశాల మధ్య స్థానిక కరెన్సీలో లావాదేవీలు, పౌరఅణుశక్తి రంగంలో మరింత సహకారం, రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుకు సంబంధించి కీలక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది.

డిసెంబరులో ఎర్రకోట వద్ద యునెస్కో సదస్సు

న్యూఢిల్లీ, నవంబరు 28: అనిర్మితమైన(ఇన్‌టాంజిబుల్- నాట్యం, చిత్రలేఖనం, గానం లాంటివి) సాంస్కృతిక వారసత్వ అంశాల పరిరక్షణకు సంబంధించి భారతదేశంలో మొట్టమొదటిసారి డిసెంబరు 8 నుంచి 13 మధ్యలో ఎర్రకోట వద్ద సదస్సు నిర్వహించనున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా ఎర్రకోటను డిసెంబరు 5నుంచి 14వ తేదీ వరకు మూసివేయనున్నారు. కీలకమైన ఈ సదస్సు కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. ఎర్రకోట వద్ద ఇటీవల ఉగ్ర పేలుడు సంభవించిన నేపథ్యంలో ఈ కార్యక్రమానికి భద్రత అత్యంత కీలకంగా మారింది.

ఇది నవ భారతం

ఎవరికీ తల వంచదు

» రామజన్మభూమి పోరాటంలో ఉడుపి మఠం కీలకపాత్ర : మోదీ



బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడులు జరిగినప్పుడు గత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీ ఆరోపించారు. అయితే ప్రస్తుత నవ భారతం తన ప్రజలను రక్షించుకోవడంలో వెనకడుగు వేయదని, ఎవరికీ తల వంచదని స్పష్టం చేశారు. కర్ణాటకలో ఒకరోజు పర్యటనలో భాగంగా ఆయన ఉడుపికి వచ్చారు. పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్రతీర్థ స్వామీజీ మోదీకి ఘన స్వాగతం పలికారు. కనకన కిండి(కనకదాసు కిటికీ) ద్వారా శ్రీకృష్ణుడి మూలవిరాట్‌ను ప్రధాని దర్శించుకున్నారు. కనకదాసుకు పుష్పార్చన చేసి, కనకనకిండికి ఏర్పాటు చేసిన బంగారు కవచాన్ని, సువర్ణ తీర్థ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత శ్రీకృష్ణమఠం నిర్వహించిన లక్ష కంఠ భగవద్గీతా పఠనంలో పాల్గొని గీతా పారాయణం చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. అయోధ్య రామజన్మభూమి పోరాటంలో ఉడుపి మఠం కీలక పాత్ర పోషించిందని, ఈ విషయం దేశానికి తెలుసన్నారు.

ఇక్కడే కొత్త పాలనకు పునాది

పెజావర మఠాధిపతి విశ్వేశతీర్థ స్వామీజీ మార్గదర్శకంలోనే అయోధ్య రామమందిరంలో ధ్వజారోహణ జరిగిందని మోదీ గుర్తుచేశారు. రామమందిరంలో ఉడుపి మధ్వాచార్యులకు కేటాయించిన ప్రత్యేక ద్వారం ఉందని తెలిపారు. శాంతి, సత్యాన్ని పునస్థాపించడంతో పాటు దౌర్జన్యాన్ని అంతం చేయాలని భగవద్గీత మనకు నేర్పుతుందని, ఇదే మన జాతీయ భద్రతా విధానం సారాంశమని అన్నారు. ఎర్రకోట నుంచి శ్రీకృష్ణుడి కరుణ సందేశాన్ని వినిపించామని, ఆయన స్ఫూర్తితో 'మిషన్ సుదర్శన చక్ర'ను ప్రకటించామని తెలిపారు. దేశంలోని ప్రముఖ స్థలాలు, పారిశ్రామిక ప్రాంతాలు, జనం చేరే ప్రదేశాల చుట్టూ రక్షణ కవచాన్ని రూపొందించామని చెప్పారు. దీన్ని శత్రువులు ఛేదించలేరన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే దిశగా నీటి సంరక్షణ, మొక్కలు నాటడం, పరిశుభ్రత, స్వదేశీ, దేశ్ దర్శన్, ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలి, యోగా మరియు క్రీడలు, పేదలకు సహాయం చేయడం అనే తొమ్మిది సంకల్పాలు చేయాలని ప్రజలను మోదీ కోరారు.

'భారత భాగ్య విధాత' మోదీ

లక్ష కంఠ గీతా పారాయణలో భాగంగా భగవద్గీత 15వ అధ్యాయంలోని పలు శ్లోకాలను ప్రధాని పఠించారు. ఇదే వేదికపై శ్రీకృష్ణ మఠం మోదీని 'భారత భాగ్య విధాత' బిరుదుతో సత్కరించింది. మజ్జిగ చిలికే వెండి కవ్వాన్ని మఠాధిపతి ప్రధానికి బహూకరించారు. 2008లో గుజరాత్ సీఎం హోదాలో తొలిసారి ఉడుపికి వచ్చిన మోదీ, ప్రస్తుతం ప్రధాని హోదాలో వచ్చి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు.



గోవాలో 77 అడుగుల శ్రీరాముడి విగ్రహావిష్కరణ

శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ మఠం 550వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోవాలో 77అడుగుల ఎత్తయిన శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని పర్తగలి మఠంలో ఉన్న ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ.. ప్రజల్లో ఐక్యత ద్వారానే వికసిత్ భారత్ సాధ్యమని అన్నారు. నేడు భారత్ సాంస్కృతిక పునరుజ్జీవన దశలో ఉందన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం, కాశీ విశ్వనాథ్ ధామ్ పునరుద్ధరణ, ఉజ్జయినిలో మహాకాళ్ మహాలోక్ విస్తరణ వంటివన్నీ అందుకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. కాగా, ఇది ప్రపంచంలోనే ఎత్తయిన రాముడి విగ్రహమని గోవా మంత్రి దిగంబర్ కామత్ తెలిపారు.

మహాయుతిలో 'స్థానిక' చిచ్చు

షిండే, ఫడణవీస్ మాటల యుద్ధం

» బీజేపీ అహంకారాన్ని రావణ లంకలా దహనం చేస్తామన్న డిప్యూటీ సీఎం షిండే

» తాము లంకలో జీవించడం లేదన్న సీఎం



ముంబై, నవంబరు 28: మహారాష్ట్రలో పాలక మహాయుతి కూటమిలో చిచ్చురేగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని ప్రధాన పక్షాలైన బీజేపీ, షిండే శివసేన మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో కొన్ని మున్సిపాలిటీల్లో విడివిడిగా పోటీచేస్తున్నాయి. ముఖ్యంగా దహాను, పాల్ఘర్ పురపాలక సంఘాల్లో పరస్పరం ఢీకొంటున్నాయి. శివసేన అధిపతి, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే దహానులో తాజాగా స్థానిక బీజేపీ నేతలను టార్గెట్ చేశారు. ఈ ఎన్నికల్లో వారి గుత్తాధిపత్యాన్ని, అహంకారాన్ని రావణుడి లంకలా దహించివేస్తామని హెచ్చరించారు. 2వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆ పనిచేయాలని కోరారు. ఆయన వ్యాఖ్యలపై అదే ప్రాంతంలో బీజేపీ తరఫున ప్రచారం చేస్తున్న సీఎం దేవేంద్ర ఫడణవీస్ తీవ్రంగా స్పందించారు. 'లంకను కాల్చేయబోతున్నారా? ఇలాంటి మాటలు ఎవరు ఎంత గట్టిగా అన్నా పట్టించుకోవద్దు. ఎందుకంటే మనం లంకలో జీవించడం లేదు. మనం శ్రీరాముడి భక్తులం. రావణుడిని విశ్వసించడం లేదు' అని వ్యాఖ్యానించారు. ఇటీవల కొందరు శివసేన కార్పొరేటర్లు, పదాధికారులను బీజేపీ చేర్చుకుంది. దీనిపై షిండే కుమారుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే, ఆ పార్టీకి చెందిన మంత్రులు బహిరంగ విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై వారం కిందట షిండే కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిశారు కూడా. అయితే కార్పొరేటర్లు, పదాధికారులను కాపాడుకోవలసింది ఆయనేనని షా స్పష్టంచేశారు. దీంతో షిండే రగిలిపోతున్నారు. ఇప్పుడు ఫడణవీస్ తీవ్ర స్థాయిలో స్పందించడంతో కాస్త వెనక్కి తగ్గారు. తాను రావణుడు-అహంకారం అన్నది బీజేపీని ఉద్దేశించి కాదని.. ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేనను అన్నానని వివరణ ఇచ్చారు. మరోవైపు.. స్థానిక ఎన్నికల్లో ఓటర్లను బీజేపీ ప్రలోభాలకు గురిచేస్తోందని శివసేన ఎమ్మెల్యే నీలేశ్ రాణే ఆరోపించారు. సింధ్‌దుర్గ్‌లో ఓ కార్యకర్త ఇంట్లో డబ్బులు పట్టుబడ్డాయంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోను ఆయన శుక్రవారం పోస్టుచేశారు. ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యా చేపట్టలేదని, ఎఫ్ఐఆర్ కూడా నమోదుచేయలేదని ధ్వజమెత్తారు. ఈ ఆరోపణలను ఆయన సోదరుడైన బీజేపీ ఎమ్మెల్యే, మంత్రి నితేశ్ రాణా ఖండించారు. అందరికీ వ్యాపారాలున్నాయని.. సొంత వ్యాపారాల కోసం కార్యకర్తలు ఇంట్లో డబ్బులు పెట్టుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు.

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య

- యువతితో ఐదేళ్లుగా ప్రేమలో.. ఆమెకు పెళ్లి సంబంధాలు
- దీంతో లండన్ నుంచి వచ్చిన యువకుడు
- ఆమె మరొకరిని పెళ్లాడంతో బలవన్మరణం
- పోలీసు వాహనంపై మృతదేహంతో నిరసన

ఏర్గట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతికి ఆమె కుటుంబసభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలిసి, లండన్ నుంచి వచ్చిన ఆ యువకుడు.. తన ప్రేయసిని ఆమె తరఫువారు మరో వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేయడాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. నిజామాబాద్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏర్గట్ల మండలం దోంచంద గ్రామానికి చెందిన నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి (29)



శ్రీకాంత్ రెడ్డి(ఫైల్)

ఆరేళ్లుగా లండన్‌లో చదువుకుంటూ అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. తమ గ్రామానికి చెందిన ఓ యువతితో అతడు ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. తమ ఇంట్లో వాళ్లు తనకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారంటూ శ్రీకాంత్‌కు యువతి ఫోన్ చేసి చెప్పడంతో 8నెలల క్రితం అతడు లండన్ నుంచి సొంతూరుకు వచ్చాడు. అయితే యువతిని శ్రీకాంత్‌కు ఇచ్చి పెళ్లి చేసేందుకు ఆమె తరఫువారు నిరాకరించారు. మరో వ్యక్తితో ఆమె పెళ్లి జరిపించారు. ఈ పరిణామంతో తీవ్ర మనోవేదనకు గురైన శ్రీకాంత్ 20 రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. ప్రేమించిన అమ్మాయే తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేసిందని, అందుకే తాను పురుగుల మందు తాగినట్లు సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. శ్రీకాంత్ రెడ్డిని తొలుత స్థానిక ఆస్పత్రికి, తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీకాంత్ గురువారం మృతిచెందాడు. ఘటనపై ఫిర్యాదు చేసినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ మృతుడి తరఫువారు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహంతో పోలీస్ స్టేషన్‌ను ముట్టడించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు తాళ్లరాంపూర్ శివారులో వాహనాలు పెట్టి అడ్డుకున్నారు. అయితే బాధితులు, మృతదేహంతో ఉన్న ఫ్రీజర్‌ను పోలీసుల వాహనంపై పెట్టి.. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాలినడకన మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఘటనా స్థలానికి భీమ్‌గల్ సీఐ సత్యనారాయణతో పాటు భీమ్‌గల్ పరిధిలోని ఎస్సైలు చేరుకొని బాధితులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి రంగంలోకి దిగి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు నిరసన విరమించారు.

సిరిసిల్లలో తల్లీ కొడుకుల ఆత్మహత్య

- మానసిక స్థితి సరిగ్గా లేక తల్లి.. మనస్తాపంతో కుమారుడు..



లలిత, అభిలాష్ (ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేక తల్లి.. తన తల్లి ఇక లేదన్న మనస్థాపంతో కొడుకు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తంగళ్లపల్లి మండల కేంద్ర వాసి మంచికట్ల లలిత(56)కి పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కొడుకు అభిలాష్(34) ఉన్నాడు. ఆమె మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో అభిలాష్ ఆందోళన చెందుతున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికొచ్చేసరికి తల్లి కనిపించలేదు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం సిరిసిల్లలోని ఎల్లమ్మ దేవాలయ సమీపంలో మానేరు నదిలో బయట పడ్డ మహిళ మృతదేహం తల్లిదేనని గుర్తించాడు. మనస్థాపానికి గురైన అభిలాష్.. బంధు మిత్రులు చూస్తుండగానే తానూ నదిలో దూకేశాడు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం 2 గంటలు గాలించిన తర్వాత అభిలాష్ మృతదేహం బయట పడింది. అవివాహితుడైన అభిలాష్‌కు వివాహితులైన ఇద్దరు చెల్లెళ్లున్నారు. తండ్రి ఐదేళ్ల క్రితమే ప్రమాదవశాత్తు మరణించాడు.

ఉరేసుకొని బీటెక్ విద్యార్థిని బలవన్మరణం

- ఫ్యాకల్టీ వేధింపుల వల్లేనని జేఎన్‌టీయూలో విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్ సిటీ/కొత్తపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ బీటెక్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ పరిధిలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం జేఎన్‌టీయూలో విద్యార్థులు ఆందోళనకు దిగడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాలాజీనగర్‌లో ఉండే ఇంటి జ్యోతి, సుధాకర్‌ల పెద్ద కుమార్తె దివ్య(20) జేఎన్‌టీయూ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. కాలి నొప్పి ఉందని ఈనెల 26న దివ్య ఇంటికి వెళ్లింది. ఏం జరిగిందో తెలియదు కానీ.. మరుసటి రోజు ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తన మృతికి ఎవరూ కారణం కాదని మృతురాలు రాసిన సూసైడ్ నోట్ దొరికింది. కళాశాలలో అటెండెన్స్ పేరిట అధ్యాపకుల వేధింపుల వల్లే దివ్య ఆత్మహత్య చేసుకుందని పలు విద్యార్థి సంఘాలు జేఎన్‌టీయూలో ఆందోళనకు దిగాయి. కారకులపై చర్యలు తీసుకోవాలంటూ యూనివర్సిటీ పరిపాలనా భవనాన్ని ముట్టడించాయి. స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ పోర్టల్‌లో తన పేరును పొందుపర్చాలని దివ్య పలుమార్లు విభాగాధిపతికి మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని, ప్రొఫెసర్లను అడిగినా కనికరించలేదని తోటి విద్యార్థులు చెప్పారు. ఇటు ప్రాసెసింగ్ ఫీజుల పేరిట విద్యార్థులను దోపిడీ చేస్తున్న అధికారులను విధుల నుంచి తొలగించాలంటూ మరికొన్ని విద్యార్థి సంఘాల ప్రతినిధులు పరీక్షల విభాగం ముందు బైఠాయించారు. పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో ఆగ్రహించిన విద్యార్థులు పరిపాలనా భవనం గ్రిల్స్‌ను బద్దలు కొట్టారు.

ఐపీఓ పెట్టుబడుల పేరుతో 51.23 లక్షల మోసం

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్‌లో ప్రకటనను చూసి ఆకర్షితుడైన ఓ రిటైర్డ్ ఉద్యోగికి ఐపీఓలో పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి ఆయన నుంచి రూ.51.23 లక్షలు కొల్లగొట్టారు. మలక్‌పేటకు చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి(60) నవంబరు మొదటి వారంలో ఫేస్‌బుక్‌లో ఓ ప్రకటనకు ఆకర్షితులయ్యారు. అందులోని లింక్‌ను క్లిక్ చేయగా.. ఆయనకు వాట్సా‌ప్‌లో ఐఐఎఫ్‌ఎల్ క్యాపిటల్ పేరుతో ఓ సందేశం వచ్చింది. తర్వాత గోషన్ యాదవ్ అనే వ్యక్తి ఐఐఎఫ్‌ఎల్ క్యాపిటల్ ప్రతినిధిగా పరిచయం చేసుకుని, అధిక లాభాలు వచ్చే ఐపీఓల్లో పెట్టుబడులు పెట్టేందుకు సలహాలు ఇస్తామని చెప్పాడు. అనంతరం ఆయనను "ఐఐఎఫ్‌ఎల్ ప్రీ ఐపీఓ 67" అనే వాట్సప్ గ్రూపులో చేర్చాడు. గ్రూప్ అడ్మిన్‌ల సలహాల మేరకు ఆయన ముందుగా రూ.8వేలు, తర్వాత పలు దఫాలుగా రూ.51.23 లక్షల వరకు వివిధ ఖాతాలకు బదిలీ చేశారు. యాప్‌లో ఆయన పెట్టుబడికి రూ.1.30 కోట్లు లాభం వచ్చినట్లు చూపారు. లాభాన్ని ఉపసంహరించుకోవడానికి యత్నించగా సాధ్యంకాలేదు. యాప్ నిర్వాహకులను సంప్రదించగా.. మరో రూ.51 లక్షలు పెట్టుబడి పెడితేనే విత్‌డ్రాకు అవకాశం ఇస్తామని చెప్పారు. దాంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐటీ మినహాయింపు కోరుకునే.. సేవా సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను మినహాయింపు కోరుకునే చారిటబుల్ ట్రస్టులు, సొసైటీలు ఆదాయ పన్ను శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలంగాణ, ఏపీ, ఒడిసా రాష్ట్రాల ఆదాయ పన్ను కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. దాతృత్వ సేవల్లో ఉన్న విద్య, వైద్య చారిటబుల్ సంస్థలు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల నుంచి విరాళాలు, దానాలు స్వీకరించే ట్రస్టుల వార్షిక రాబడి రూ.5 కోట్ల లోపు ఉంటే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను పొందాల్సిన అవసరం లేదన్నారు. అయితే, ఆయా సంస్థలు ఐటీ రిటర్నులను దాఖలు చేయాలన్నారు. లాభాపేక్ష లేని సంస్థలు పన్ను మినహాయింపు కోసం ఏటా మే 31లోపు తమ వార్షిక స్టేట్‌మెంట్లను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

ఉడకని అన్నం, నీళ్ల చారుతో కడుపునిండా తినలేక పస్తులు ఉంటున్నామని కుమరం భీం జిల్లా కౌటాల మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్రధాన రహదారిపై బైఠాయించారు. తమకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, పలుమార్లు చెప్పినా తీరు మారడం లేదని విద్యార్థులు తెలిపారు. రోడ్డుపైనే అన్నం వడ్డించిన పేట్లతో బైఠాయించారు.

ప్రతి సిట్టింగ్‌కు 15లక్షలు ఇవ్వాల్సిందే

- లేకపోతే బ్రిజేశ్ ట్రిబ్యునల్ ముందు వాదించబోను
- సుప్రీం సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై రాష్ట్రాల వారీగా విచారణ జరుపుతున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్-2 ముందు తెలంగాణ తరఫున వాదనలు వినిపిస్తున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ రాష్ట్రానికి ఝలక్ ఇచ్చారు. తను వాదిస్తున్నందుకు సిట్టింగ్ ఫీజు పెంపుపై వారం రోజుల్లోగా సానుకూలంగా ఉత్తర్వులు వెలువడకపోతే డిసెంబరు నుంచి విచారణకు హాజరుకాబోనని స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జలవివాదాల బాధ్యతలు చూస్తున్న ఓ అధికారికి ఆయన ఈ మెసేజ్ చేయడం కలకలం రేపింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తర్వాత 2014 నుంచి తెలంగాణ తరఫున సుప్రీంకోర్టుతో పాటు ట్రిబ్యునల్‌లో వైద్యనాథన్ వాదనలు వినిపిస్తున్నారు.

అమరావతిలో 15బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు శంకుస్థాపన

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఒకేరోజు 15 ఆర్థిక సంస్థల ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేశారు. ఇలా జరగడం దేశంలో ఇదే ప్రథమమని ఆమె తెలిపారు. ఫైనాన్షియల్ (బ్యాంకింగ్) డిస్ట్రిక్ ఏర్పాటు చేయడంలో భాగంగానే ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీలు ఇక్కడ కొలువుతీరుతున్నాయని చెప్పారు. అమరావతి రాజధానిలోని ఏపీసీఆర్‌డీఏ కార్యాలయం వద్ద 15 బ్యాంకులు-బీమా సంస్థల ప్రాంతీయ కార్యాలయాలకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్మల ప్రసంగించారు. దేశంలో ప్రప్రథమంగా ఆర్థిక జిల్లాను హైదరాబాద్‌లో నిర్మించింది నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబేనని ఆమె గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శక్తి, సామర్థ్యాలను అర్థం చేసుకుని వాటికనుగుణంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు ఉండాలన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్నేహానికి హద్దులు

చైనాతో మరీ చెడిపోలేదని అనుకోగానే ఏదో ఒక చిచ్చుపెట్టడం ఆ దేశానికి అలవాటు. సంబంధాలు మళ్ళీ అతుకుపడుతున్నాయని అనిపించిన వెంటనే మంటలు రేగుతాయి. షాంఘై విమానాశ్రయంలో భారతమహిళకు ఎదురైన వేధింపులు, అవమానాలు అత్యంత హేయమైనవి. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన పేమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ లండన్‌నుంచి జపాన్ వెడుతూ మార్గమధ్యంలో షాంఘైలో ఆగారు తప్ప, భారత్ పాస్‌పోర్టుతో చైనాలో కాలూనేందుకు ఏమీ పోలేదు. గతంలో కూడా ఆమె షాంఘై ట్రాన్సిట్ ప్రయాణాలు చేశారు. ఇప్పటివరకూ ఎవరూ ఈ తరహా ప్రయాణాలు చేయలేదని అధికారులు కూడా అనలేరు. కొందరు అతిగా వ్యవహరించి, ఉద్దేశపూర్వకంగా ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించిన విషయం స్పష్టంగా అర్థమవుతోంది. మరో మూడుగంటల్లో జపాన్ విమానం ఎక్కి వెళ్ళిపోవాల్సిన ఆమెను నిర్బంధించి, అరుణాచల్ భారత్‌లో లేదు, మీ వీసా పనికిరాదు, పాస్‌పోర్టు చెల్లదు అంటూ చైనీస్ పాస్‌పోర్టుకోసం దరఖాస్తుచేసుకోమని కూడా ఎగతాళిగా మాట్లాడటం, మిగతా వారంతా నవ్వడం వంటివి అత్యంత అవమానకరమైన ఘట్టాలు. అనేకగంటలపాటు ఏమీ తేల్చకుండా, అన్నపానీయాలు లేకుండా తనను వేధించారని, చివరకు బీజింగ్‌లోని భారత రాయబారకార్యాలయం సహాయంతో బయటపడ్డానని ఆమె చెప్పుకొచ్చారు. చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇందుకు పూర్తిభిన్నమైన వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ చట్టాలు, పౌరవిమానయాన సంప్రదాయాలను ఉల్లంఘించిన ఘటన కనుక, జరిగింది పొరపాటని ఓ మాట అనివుంటే ఈ వివాదం వెంటనే సమసిపోయివుండేది. కానీ, అరుణాచల్ విషయంలో తమవాదన బలహీనపడుతుందన్న భయంతో తమ అధికారుల చర్యలను ఆమె సమర్థించుకురావడం మరింత చిరాకు కలిగిస్తోంది. బలవంతపు చర్యలు తీసుకోలేదు, నిర్బంధాలు, వేధింపులు లేనే లేవు అంటూనే, చైనా తన అరుణాచల్ వాదనను సమర్థించుకొనే పనిలో పడింది. రెండు దేశాల మధ్యా ప్రశాంతత, పరస్పర విశ్వాసం సమీపకాలంలో నెలకొనడం అసాధ్యమని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

అరుణాచల్ తమభూభాగమని చైనా ఎప్పటినుంచో వాదిస్తోంది. దక్షిణటిబెట్, జంగ్నాన్ అంటూ మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, గ్రామాలు, చివరకు కొండలకు కూడా తన మాండరిన్‌లో పేర్లు పెట్టుకుంటోంది. రెండుదేశాల మధ్యా ఉన్న మూడున్నరవేల కిలోమీటర్ల సరిహద్దులో అనేక ప్రాంతాలను వివాదంలోకి లాగి, ఉద్రిక్తతలను రేపడం చైనా ఒక విధానంగా పెట్టుకుంది. దాదాపు వందేళ్ళుగా సాగుతున్న వివాదాలను ఉభయదేశాలు పరిష్కరించుకోలేకపోవడం అటుంచి, సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతలను కాపాడుకొనేందుకు ఉద్దేశించిన 1993నాటి ఒప్పందాన్ని కూడా చైనా ఉల్లంఘించడం ఆరంభించింది. అమెరికాతో మన స్నేహం హెచ్చుగా ఉన్నప్పుడూ, ట్రంప్-మోదీ చేయీచేయీ కలిపి కదులుతున్నప్పుడూ చైనా చిచ్చుపెడుతుంది. ఇటీవల ట్రంప్ మోదీ మీద అలిగి, భారత్‌మీద సుంకాల భారం వేసినప్పుడు చైనా ఎక్కడలేని ఆప్యాయతనూ కనబరిచిన విషయం తెలిసిందే. పలురకాల దిగుమతులకు అనుమతించడమే కాక, మార్కెట్‌ను కూడా తెరిచింది. ఏడేళ్ళ తరువాత, ఈ ఏడాది సెప్టెంబర్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సివో) సమావేశానికి మోదీ వెళ్ళడంతో ఉభయదేశాల సంబంధాలు మెరుగుపడుతున్న ఆశ కలిగింది. రెండుదేశాల మధ్యా విమానాల రాకపోకలు నేరుగా మొదలవడంతో, వాణిజ్య వ్యాపారాలతో పాటు పర్యాటకమూ, ప్రజల మధ్య బంధాలూ బలపడతాయన్న భరోసా కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో, ఒక చిన్న ఉదంతం ఉభయదేశాల సంబంధాలను ప్రభావితం చేయడం సరికాదు. జరిగినఘటనతో పాటు, దానిమీద ఇచ్చిన వివరణలూ సమర్థనలూ మరింత దూరం పెంచేట్టుగా ఉండటం విచారకరం. పరిష్కరించుకోనంత వరకూ సరిహద్దువివాదాలు అలాగే ఉంటాయి. వాటిని పక్కనబెట్టి మిగతా విషయాల్లో కలిసిసాగుదామని ఓ పక్కన అంటూనే, ఇలా అమాయకపౌరుల మీద కక్ష సాధించడం సరికాదు. తియాంజెన్ సమావేశంలో మోదీ, జిన్‌పింగ్ కలిసికట్టుగా అద్భుతమైన సంకల్పాలు చెప్పుకున్నారు. సరిహద్దు సమస్య మనబంధానికి అడ్డురావద్దనీ, ప్రత్యర్థుల్లా కాక, భాగస్వాములుగా వాణిజ్యం పెంచుకొని బాగుపడదామనీ అనుకున్నారు. డ్రాగన్, ఏనుగు కలిసి డాన్స్ చేయాలన్నారు జిన్‌పింగ్. సమస్యలను సహేతుకంగా పరిష్కరించుకుంటూ, సరిహద్దుల్లేని స్నేహంతో సాగిపోదామని అంటూనే ఉన్నతంగా వ్యవహరించకపోవడం, చిన్నచిన్న ఉదంతాలను సైతం ఉద్రిక్తతలుగా మార్చడం బాగోలేదు.

గవర్నర్ల వ్యవస్థపై గందరగోళం..!

'ప్రతి రాష్ట్రానికీ గవర్నర్‌తో కూడిన శాసన వ్యవస్థ ఉండవలెను..' అని రాజ్యాంగ అధికరణ 168 ప్రారంభమవుతుంది. ఆ శాసన వ్యవస్థలో శాసనసభ, శాసన మండలి ఉండవచ్చు లేదా ఒకే శాసనసభ ఉండవచ్చు. అసలు రాష్ట్ర శాసన వ్యవస్థలో గవర్నర్ ఉనికి అనవసరమనేది నా సునిశ్చిత అభిప్రాయం. ప్రజలు ఎన్నుకోని రాజ్యాంగ అధికారి ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడిన శాసనసభలో ఎందుకు భాగంగా ఉండాలి? శాసనసభ లేదా ఉభయ సభల నుద్దేశించి ప్రసంగించడం తదితర లాంఛనప్రాయమైన విధులను రాష్ట్ర శాసనవ్యవస్థలో భాగంగా కాకుండానే నిర్వహించవచ్చు. శాసన వ్యవస్థ సంబంధిత తన విధులను ఇంగ్లాండ్ రాజు ఇలానే నిర్వర్తిస్తారు కదా.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

శాసన వ్యవస్థలో గవర్నర్ నిర్వర్తించే నిజమైన పాత్ర బిల్లులకు అనుమతి మంజూరు చేయడమే. ఒక బిల్లు చట్టంగా రూపొందే ప్రక్రియను పూర్తి చేయడంలో గవర్నర్ ఆమోదం పొందడమనేది చాలా ముఖ్యమైన విషయం. శాసన వ్యవస్థ రాజ్యాంగ పరిమితులను అతిక్రమించకుండా ఉండేందుకు బిల్లులకు అనుమతి నివ్వడం లేదా తిరస్కరించే అధికారాలను ఒక వ్యక్తికి అప్పగించడమనేది తప్పనిసరి.

అధికరణ 216 ఇలా పేర్కొన్నది: 'శాసనసభ, శాసన మండలి ఉన్నచో ఉభయ సభలచే ఆమోదింపబడిన బిల్లును గవర్నర్ సమ్మతి కొరకు పంపవలెను. గవర్నర్ సమ్మతించినచో తన సమ్మతిని, సమ్మతించక నిలుపు చేసినచో నిలుపుదలనూ, ఒకవేళ రాష్ట్రపతి సమ్మతికి నివేదించుచున్న యెడల ఆ విషయాన్ని గవర్నర్ ప్రకటించవలెను. సమ్మతిని నిలుపుచేసినచో ఆ బిల్లును శాసనసభకు పునర్విచారణ చేయమని కోరుతూ ఒక సందేశమును పంపవలెను'. ఈ అధికరణ ఇంకా ఇలా పేర్కొంది: 'గవర్నర్ సందేశానుసారం రాష్ట్ర శాసనసభ మరొకసారి చర్చను జరిపి గవర్నర్ సూచించిన మార్పులను అంగీకరిస్తే బిల్లులో వాటిని చేర్చి, గవర్నర్ సందేశాన్ని తిరస్కరించిన యెడల ఆ బిల్లును యథాతథంగా రాష్ట్ర శాసనసభ గవర్నర్‌కు తిరిగి బిల్లును పంపిన దానికి గవర్నర్ విధిగా సమ్మతిని ఇవ్వవలెను'. ఇది శాసన వ్యవస్థపై ఆరోగ్యకరమైన నియంత్రణ. అంతేగాని శాసననిర్మాణ ప్రక్రియలో ఉపద్రవాన్ని సృష్టించడానికి లైసెన్స్ ఎంతమాత్రం కాదు.

అయితే గవర్నర్లు చేస్తున్నదేమిటి? ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్లు అధికరణ 200 కింద తమకు లభించిన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. శాసనసభ తన ఆమోదానికి పంపిన బిల్లులను తమ ఇష్టానుసారం నిలిపివేసేందుకు లైసెన్స్‌గా పరిగణిస్తున్నారు. ఈ భావనతోనే వారు పాకెట్ వీటోను ప్రయోగిస్తున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే జవాబుదారీతనం లేకుండా శాసనప్రక్రియను అడ్డుకుంటున్నారు. బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. బిల్లులను ఆమోదించడం లేదు. అలా అని తిరస్కరించడం లేదు. శాసనసభ పునఃపరిశీలనకూ పంపడం లేదు. రాష్ట్రపతి పరిశీలనకు సత్వరమే నివేదించడం లేదు. పాకెట్ వీటో అనేది ఒక నికార్సయిన దురుద్దేశం. శాసనసభ ఆమోదించిన బిల్లు రూపేణా వ్యక్తమైన ప్రజా సంకల్పాన్ని అడ్డుకోవడమే పాకెట్ వీటో లక్ష్యంగా ఉన్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే పాకెట్ వీటోకు భారత రాజ్యాంగంలో అనుమతి లేదు.

ఒక బిల్లును గవర్నర్‌కు నివేదించినప్పుడు ఆయన దానిని ఆమోదించాలి లేదా తిరస్కరించాలి లేదా సాధ్యమైనంత త్వరగా శాసనసభ పునఃపరిశీలనకు పంపాలి లేదా రాష్ట్రపతి పరిశీలనకు నివేదించాలని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. 'పాకెట్ వీటో' రాజ్యాంగ విరుద్ధమని ఆ ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ నిర్ణయాలను ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆమోదించింది. అయితే కొన్ని అంశాలపై ఈ రెండు ధర్మాసనాలూ విభేదించాయి. అయితే సామాన్య పౌరులు ఆందోళన చెందవలసినవి కావు. వాటిపై చర్చను న్యాయశాస్త్ర పండితులకు వదిలేద్దాం.

శాసనసభ తనకు నివేదించిన బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్లకు నిర్దేశించిన కాలపరిమితి విషయమై సుప్రీంకోర్టు ధర్మాసనాల భిన్న దృక్కోణాలు సామాన్య పౌరులను కలవరపెడుతున్నాయి. ఇద్దరు సభ్యుల ధర్మాసనం కఠినమైన కాలపరిమితిని నిర్దేశించింది. ఆ గడువు తప్పనిసరి అని సూచించింది. విస్తృత ధర్మాసనం అందుకు అభ్యంతరం చెప్పింది. ఆ నిర్ణయాన్ని త్రోసిపుచ్చింది. 'రాజ్యాంగ అధికారులు తమ విధులను నిర్వర్తించడంలో సర్దుకుపోయే స్వభావాన్ని ప్రదర్శించాలని' సూచించింది. ఎటువంటి కాలపరిమితిని నిర్దేశించలేదు. ఇది రాజ్యాంగ చట్రంలో పొందుపరిచిన స్వాభావిక సరళత, విచక్షణను సూచిస్తుంది. సమాఖ్య ప్రజాస్వామ్య వ్యవస్థలో మారుతున్న విభిన్న సందర్భాలు, పరిస్థితులకు అనుగుణంగా శాసన నిర్మాణంలో సమతుల్యతను సాధించవలసిన అవసరమున్నదని ఐదుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. శాసన నిర్మాణంలో పాటించవలసిన ఈ సూత్రాలు సైద్ధాంతికంగా, రాజ్యాంగబద్ధంగా విమర్శాతీతమైనవి. అయితే డాక్టర్ అంబేడ్కర్ హెచ్చరికను కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తప్పక తీసుకోవాలి. భారత రాజ్యాంగ సభ ముగింపు సమావేశం (25 నవంబర్ 1949)లో అంబేడ్కర్ ప్రసంగిస్తూ భారత ప్రజాస్వామ్య గమనం విషయమై కొన్ని సూచనాత్మక హెచ్చరికలు చేశారు: 'మన రాజ్యాంగ చట్టంలోని సుగుణాల గురించి నేను ప్రస్తావించను. ఎందుకంటే, రాజ్యాంగం ఎంత చక్కటిదయినప్పటికీ, దాన్ని పనిచేయించే పెద్దమనుషులు సరైనవారు కాకపోతే అది చెడ్డదే అవుతుంది. రాజ్యాంగం ఎంత చెడ్డదయినప్పటికీ దాన్ని పనిచేయించే పెద్ద మనుషులు మంచివారయితే, అది మంచిదే అవుతుంది.



రాజ్యాంగ చట్ట స్వభావం మీదనే రాజ్యాంగం పని చేయడం ఆధారపడి లేదు. శాసనసభ, కార్యనిర్వాహక మండలి, న్యాయవ్యవస్థ లాంటి రాజ్యవ్యవస్థ విభాగాలను మాత్రమే రాజ్యాంగం అందించగలదు. ఆ రాజ్యవ్యవస్థ విభాగాలు పనిచేయటం ప్రజలు, వారి ఆకాంక్షలు, రాజకీయాల నిర్వహణా పరికరాలుగా వారు ఏర్పరచుకున్న రాజకీయ పక్షాలపై ఆధారపడి ఉంటుంది. భారత ప్రజలు, వారి పార్టీలు ఎలా ప్రవర్తిస్తాయో ఎవరు చెప్పగలరు? తమ ప్రయోజనాల సాధనకు వారు రాజ్యాంగ పద్ధతులు అనుసరిస్తారో, లేక వాటిని సాధించటానికి విప్లవ పద్ధతులను ఎంచుకుంటారో ఎవరికి తెలుసు?'

ఇప్పుడు గవర్నర్ పదవులలో ఉన్న 'పెద్ద మనుషులు' అందరూ సరైనవారు కాదని నిశ్చితంగా చెప్పవచ్చు. మరి వారు ఎలాంటివారు అన్న విషయమై ఒక నిర్ణయానికి రావడాన్ని పాఠకులకే వదిలివేస్తున్నాను. వారు ఏమి చేస్తున్నారు, ఏమి చేయడం లేదనేది భారత ప్రజలకు బాగా తెలుసు. ఒక శాసనసభ ఆమోదించిన బిల్లు చట్టం కాకుండా నెలల తరబడి నిలిపివేస్తున్న గవర్నర్లు చాలా మంది ఉన్నారు. ఫలితంగా రాజ్యాంగం పనిచేయడం లేదు. అది శిథిలమవుతోంది. ప్రజల సంకల్పం నెరవేరడం లేదు.

రాజ్యాంగ సమతౌల్యతను శాసన వ్యవస్థకు వ్యతిరేకంగా వినియోగించిన గవర్నర్ల ఉదంతాలు (ముఖ్యంగా ప్రతిపక్షాల పాలనలో ఉన్న జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్) సర్వోన్నత న్యాయస్థానం ఎదుట ఉన్నాయి. ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆ సమతౌల్యతను సాధికారంగా, విశ్వసనీయంగా పునరుద్ధరించగలదని ఆశించడం జరిగింది. ఆ ధర్మాసనం తన విచారణలో ఉన్న సంబంధిత కేసుల పూర్వాపరాలను ప్రశస్తంగా విశ్లేషించింది. అయితే దాని తీర్పు సైద్ధాంతిక భావనలపై ఆధారపడి వాస్తవ పరిణామాలతో సంబంధంలేని ఫలితాలకు దారితీసేలా ఉన్నది. సుప్రీంకోర్టు ముందున్న వాస్తవాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

చట్టాలు యథార్థాలకు ప్రతిస్పందించాలి. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి భంగం కలుగవచ్చని భావించినప్పుడు హైకోర్టు న్యాయమూర్తులను ఎంపిక చేసే అధికారాలు తనకే ఉండేలా రాజ్యాంగ అధికరణ 217కు సుప్రీంకోర్టు భాష్యం చెప్పింది. శాసనసభ ఆమోదించిన బిల్లులను సమ్మతించడం లేదా సమ్మతించకపోవడం లేదా నిలిపివేయడం లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపడంపై గవర్నర్ల అధికారాలకు సంబంధించిన అధికరణ 200 పాలనా వ్యవహారాలలో తీవ్ర సమస్యలకు దారితీస్తోంది. చట్టాల నిర్మాణంలో శాసనవ్యవస్థ సామర్థ్యమే ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన విశిష్టత. అయితే చట్టసభలు రూపొందించిన చట్టాలను నిర్హేతుకంగా, ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్న పరిస్థితులలో న్యాయ వివేకం సహాయాన్ని మాత్రమే కోరడం నిరర్థకమే అవుతుంది.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

> **గవర్నర్ పదవులలో ఉన్న 'పెద్ద మనుషులు' అందరూ సరైనవారు కాదు. వారు ఏమి చేస్తున్నారు, ఏమి చేయడం లేదనేది భారత ప్రజలకు బాగా తెలుసు. ఒక శాసనసభ ఆమోదించిన బిల్లు చట్టం కాకుండా నెలల తరబడి నిలిపివేస్తున్న గవర్నర్లు చాలామంది. ఫలితంగా రాజ్యాంగం పనిచేయడం లేదు. ప్రజల సంకల్పం నెరవేరడం లేదు.**

బయో ఎకానమీ-హిడ్మా

బ్రెజిల్‌లో దట్టమైన అమెజాన్ నదీ ప్రారంభంలో ఉండే బెలెమ్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్-30 పేరిట నవంబర్ 6-21 తేదీల్లో అంతర్జాతీయ వాతావరణ మార్పు సమావేశాన్ని నిర్వహించారు. అరణ్య ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల జీవన ఉపాధిని పెంచడానికీ, అమెజాన్ అరణ్యాన్ని మరింత వైవిధ్యంతో, ఉత్పాదకంగా మార్చడానికీ బ్రెజిల్ దేశం కృషి చేస్తోంది. వేడిని, కాలుష్యాన్ని పెంచే గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల చేసే మైనింగ్, ఇతర పరిశ్రమలపై ఎక్కువగా ఆధారపడకుండా, నూతన నమూనా బయో ఎకానమీ అభివృద్ధిని బ్రెజిల్ చేపడుతున్నది. చెట్ల నరికివేతను, మైనింగ్‌ను తగ్గించింది. అనేక హెర్బల్ మొక్కలను గుర్తించి, వాటి సాగును పెంచింది. ఆరోగ్య, సౌందర్య, సుగంధ ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్నది. ఫలితంగా మూలవాసుల వలసలు తగ్గిపోయాయి. అమెరికా ఖండానికి అమెజాన్ అడవులు ఊపిరితిత్తులు అనే ఎరుకతో బ్రెజిల్ బయో ఎకానమీని ప్రోత్సహిస్తున్నది.

మన దేశంలో 2024లోను, ఇప్పుడు 2025లోను కూడా తీవ్ర వాతావరణ పరిస్థితులు నమోదు అయ్యాయి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ ఇండియా క్లైమేట్-2025 నివేదిక ప్రకారం దేశంలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్న రోజులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఎండ, వడగాలుల వలన అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది కూలీల, వీధి వ్యాపారుల జీవనం ఇబ్బందులకు గురవుతున్నది. 60శాతం మంది ఆదాయాన్ని కోల్పోతున్నారు. వడదెబ్బ, గుండెపోటు, వాంతులు, వడలిపోవటం



వంటి అనారోగ్యాలకు లోనవుతున్నారు. పొలాల్లో పనిచేసేవారు సాధారణ సింథటిక్ దుస్తులు ధరించడం వలన చెమటతో బాక్టీరియల్, ఫంగల్ చర్మవ్యాధులకు లోనవుతున్నారు. ఫ్యాక్టరీలో పనిచేసేవారికి వెంటిలేషన్ లేక, యంత్రాలు విడుదల చేసే వేడికి రోగాలపాలవుతున్నారు. ఆదాయాలు తగ్గి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారు. వారు నివసించే చిన్న చిన్న షెడ్ల లాంటి ఇళ్లలో ఫ్యాన్లు పెట్టుకునే స్తోమత ఉండదు. కూలర్, ఏసీ ఊహకందని లగ్జరీ. అధిక వేడితోపాటు, అధిక వర్షాల వలన కోట్లాది ఎకరాలలో పంట నష్టం, వరదల వలన ఇండ్లు కూలిపోవడం ఎన్నడూ లేనంతగా పెరిగిపోయాయని నివేదిక పేర్కొంది.

లక్ష చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణలను ఆనుకుని ఉన్న దండకారణ్యం భారతదేశానికి అమెజాన్ లాంటిదంటే అతిశయోక్తి కాదు. ఇక్కడి అడవులు దేశ కార్బన్ ఉద్గారాలను స్వీకరించి ప్రకృతిని శుభ్రం చేస్తున్నాయి. కానీ ఇది ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఈ ప్రాంతంలో అదానీ, వేదాంత, లాయిడ్, ఆర్య, అభినవ్, జిందాల్ వంటి కార్పొరేట్స్ తవ్వకాలు ప్రారంభించాయి. ఈ ప్రాంతంలో గత రెండువందల సంవత్సరాల నుండి జల్ జంగల్ జమీన్ కోసం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. తమ అడవిని, తమ జీవితాన్ని, ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూ, నిలువ నీడ లేకుండా చేస్తున్న మైనింగ్‌ను స్థానికులు మొదటి నుండీ ప్రతిఘటిస్తున్నారు. గత మూడు దశాబ్దాలుగా మరింత తెగువతో నక్సలైట్ల నాయకత్వంలో సంఘటితమై సాయుధంగా పోరాడుతున్నారు.

ఆదివాసీ యోధుడు మడావి హిడ్మా మరణం తర్వాత దేశం అతని పోరాట లక్ష్యాన్ని అర్థం చేసుకుంటున్నది. ఇప్పుడు బ్రెజిల్ అనుసరిస్తున్న బయో ఎకానమిని గత 30 సంవత్సరాలుగా తమ ప్రాబల్యంలో ఉన్న దండకారణ్యంలో హిడ్మా నేతృత్వంలో మావోయిస్టు పార్టీ అమలుచేస్తున్నది. కానీ ఇప్పుడు జన జీవితాన్ని కాలుష్యం కోరల్లోకి నెట్టివేసే కార్పొరేట్ మైనింగ్ కోసం విప్లవకారులను ప్రభుత్వం అణచివేస్తున్నది. నవంబర్ 22న దక్షిణాఫ్రికా జోహన్నెస్‌బర్గ్‌లో నిర్వహించిన జి-20 సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ, "భవిష్యత్ తరాల కోసం సుస్థిర పర్యావరణ సమతుల్య జీవన మార్గం ఆచరణ కోసం ప్రపంచ సాంప్రదాయ జ్ఞాన నిధిని నెలకొల్పాలి" అని సూచించారు. కానీ ఆచరణలో ఈ జ్ఞానాన్ని పుష్కలంగా కలిగి ఉన్న భారత్‌ను కాపాడుతున్న ఆదివాసీ ఉద్యమాల నేతలపై అణచివేతకు పాల్పడుతున్నారు.

ప్రజలలో అసంతృప్తి మరింత రాజుకోక ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని, రాజ్యాంగం అందించిన జీవించే హక్కును విస్తృతార్థంలో అమలుచేయాలి. కార్పొరేట్లను నియంత్రించి ప్రభుత్వ పాలనలో వారి ప్రమేయం లేకుండా చేయాలి. పౌర సమాజం నిత్య అప్రమత్తతతో, ప్రజాస్వామిక పోరాట రూపాలతో పర్యావరణ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి. కాలుష్య నియంత్రణలో చైనా విధానం, జీవ ఆర్థిక వ్యవస్థలో బ్రెజిల్ విధానం మనకు ఆదర్శం కావాలి.

• అస్నాల శ్రీనివాస్
దొడ్డి కొమురయ్య ఫౌండేషన్

ఏసీబీకి చిక్కినా.. జారిపోతున్నారు!

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తరచూ అధిక సంఖ్యలో అవినీతి అధికారులను పట్టుకుని, వారిపై కేసులు నమోదుచేస్తున్నది. సగటున రోజుకు ఒకటి చొప్పున, కొన్ని సందర్భాలలో ఒక్కోరోజు ఇద్దరు లేక ముగ్గురు అధికారులను లంచం తీసుకుంటుండగా ఈ సంస్థ పట్టుకుంటోంది. ప్రజలు ఏసీబీ చర్యలను హర్షిస్తూ పాలనలో అవినీతి తగ్గుతుందని ఆశిస్తున్నారు. అయితే జరుగుతున్నది మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రోజు రోజుకు ప్రభుత్వ ఉద్యోగులలో అవినీతి పెరిగిపోతున్నది. ఏ కార్యాలయానికి వెళ్లినా డబ్బులు ఇవ్వందే పనికావడం లేదు.

గత అయిదేళ్లలో రాష్ట్రంలో ఏసీబీ నమోదు చేసిన వివరాలు, దానిలో ఎందరు అవినీతి అధికారులకు శిక్షలు పడ్డాయని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' విశ్లేషించగా ఆశ్చర్యకరమైన విషయాలు బయటకొచ్చాయి. ఏసీబీ సమాచారం ప్రకారం గత అయిదేళ్లలో 621 మంది అధికారులపై అవినీతి కేసులు నమోదయ్యాయి. ఈ 621 కేసుల్లో 519 కేసుల విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రాసిక్యూషన్ అనుమతి కోసం ఏసీబీ పంపింది (ప్రభుత్వ అనుమతి లేనిదే ఏసీబీ కోర్టులో చార్జీషీటు దాఖలు చేయలేదు). ఇక కోర్టులో కేసు కొలిక్కి వచ్చేసరికి మూడు నుంచి అయిదేళ్లు పట్టవచ్చు. అంటే ఒక అవినీతి అధికారిపై కేసు నమోదైనా, తుది తీర్పు రావడానికి పదేళ్లు పడుతుంది. కొన్ని సందర్భాల్లో 15 ఏళ్లు కూడా పట్టొచ్చు! ఆలోగా సదరు అధికారి రిటైర్ అయ్యే పరిస్థితి ఉంది. ఈ విషయంపై గతంలో గౌరవ ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు పంపినా పరిస్థితిలో మార్పులేదు. అవినీతికి పాల్పడే కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీని పెద్దగా పట్టించుకోవడం లేదు. 'ఒకవేళ అవినీతికి పాల్పడుతూ పట్టుబడ్డా రాష్ట్ర సచివాలయంలో పైరవీలు చేసి తప్పించుకోవచ్చు' అన్న భావన వారిలో ఉంది. సచివాలయంలో ఉన్నతాధికారులు ఏసీబీ రిపోర్టులపై పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడంతో కొందరు సెక్షన్ ఆఫీసర్లు అవినీతి అధికారులకు కొమ్ము కాస్తున్నారు. రాష్ట్ర పాలనలో భారీగా అవినీతి జరుగుతున్నది. తత్ఫలితంగా సామాన్యుడు చాలా ఇబ్బందులు పడుతున్నాడు. ప్రభుత్వం కూడా అపవాదు పాలవుతోంది. అవినీతి అధికారులపై నమోదైన కేసులు సత్వరమే పరిష్కరించి, సదరు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' కోరుతోంది.

— ఎం. పద్మనాభరెడ్డి, అధ్యక్షుడు, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్-76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు-70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కార్మిక చట్టాలు కోడ్స్‌లో వెతుక్కోవాలి!

కార్మిక చట్టాల స్థానంలో కార్మిక కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. వీటి ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధించి దేశం ముందుకు వెడుతుందని ఊదరగొట్టే ప్రయత్నం చేస్తోంది. కానీ అవి కార్మికుల హక్కులను హననం చేసి యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వారిని బలి చేస్తాయి. 100 సంవత్సరాలుగా కార్మికులకు రక్షణగా నిలిచిన చట్టాలను భూస్థాపితం చేసి, యాజమాన్యాలు తమ ఇష్టారీతిన కార్మికులను ఉపయోగించుకునేలా లేబర్ కోడ్‌లను తయారు చేయడం ఆక్షేపణీయం.

విపులంగా ఉన్న చట్టాలను కుదిస్తే వాటి పరిధి పెరుగుతుందా తగ్గుతుందా? 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా సంక్షిప్తీకరించి వాటిని కార్మికుల సంక్షేమం కోసమే అని ప్రకటించడం ఎవరూ ప్రశ్నించరు అన్న ధీమాతోనే. అంతేకాక కార్మికుల హక్కుల పట్ల నిర్లక్ష్యం, కార్మిక సంఘాల పట్ల లెక్కలేనితనం, పెట్టుబడిదారులకు దోపిడీ మార్గాలను సుగమం చేయాలన్న దృఢసంకల్పంతో మాత్రమే. కార్మిక సంఘానికి ఇచ్చిన నిర్వచనంలో యాజమాన్యాలు, యాజమాన్యాలూ కలిసి ఏర్పడిన సమూహం కూడా కార్మిక సంఘంగా పరిగణించబడుతుందని చెప్పడం వెనుక అర్థమేమిటో తెలియలేదు. ఇక నుంచి వర్కర్లు వేరు, ఎంప్లాయీస్ వేరు. రూ.18,000 వేతనం పొందే సూపర్‌వైజరీ ఉద్యోగి వర్కర్ కాదు! కోడ్ పరిధి మారుతుంది. అన్ని రకాల వివాదాంశాలపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదే అని ప్రకటించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏదైనా లేబర్ కోడ్‌ల అంశంలో వివాదం ఏర్పడితే కేంద్రానిదే తుదినిర్ణయం.

వేతనాల నిర్ణయంపై యాజమాన్యాలదే పూర్తి బాధ్యతట. మరి ఆ బాధ్యత నెరవేర్చకపోతే పరిష్కారమేమిటో చెప్పలేదు. సంఘటిత రంగాల్లో మాత్రమే వేతనాలు అమలు నియంత్రణ చేయగలరు గాని, అసంఘటిత రంగంలో వేతనాలను ఎలా మానిటర్ చేస్తారో తెలియలేదు. ప్రతి ఉద్యోగికి నియామక పత్రాలు ఇవ్వాలని ఓ కోడ్ తెలుపుతుంది. అలాంటప్పుడు దేశంలో 97శాతం అసంఘటితరంగ కార్మికులు ఉన్నప్పుడు వారికి నియామకపత్రాలు ఇవ్వడానికి అవకాశం ఉందా? సమాన పనికి సమాన వేతనం అమలు పరచాలన్నప్పుడు, స్త్రీ-పురుషులకు అసంఘటిత రంగంలో సమాన వేతనం ఏర్పాటుచేసే ప్రక్రియ ఏమిటో ప్రస్తావించలేదు. పైగా ఒక నిర్దేశించిన పనికి ఎవరినైనా నియమించుకున్నప్పుడు యజమాని నిర్ణయమే అంతిమం అని ఇండస్ట్రియల్ రిలేషన్స్ అనే కోడ్‌లో స్పష్టంగా పేర్కొంటూ, సదరు యజమాని నిర్ణయాన్ని కోర్టులో కూడా సవాలు చేయరాదన్న నిబంధన ఎందుకు ఉంచినట్లు? రాత్రి పగలు తేడా లేకుండా స్త్రీలను పనుల్లో నియమించుకోవడం, కావాల్సినన్ని గంటలు పనిచేయించుకోవడం వంటివన్నీ స్త్రీల ఉద్ధరణగా ఎలా భావించగలం?

అన్నిటికన్నా క్రూరమైన ప్రతిపాదన 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్'- 'యాజమాన్యం చెల్లించే గ్రాట్యూటీ పొందడానికి ఇప్పుడున్న ఐదు సంవత్సరాల అర్హత కాలాన్ని ఒక సంవత్సరానికి' కుదించామని చెప్పేది. ఈ ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రతిపాదన ద్వారా భవిష్యత్తులో ఏ ఒక్కరికీ 2 లేదా 3 సంవత్సరాలకు మించి అగ్నివీరుల్లా ఉపాధి ఉండదు! ఇంతటి క్రూరత్వాన్ని కప్పిపెట్టుకోవడానికి ఒక సంవత్సరం పనిచేసినా సరే గ్రాట్యూటీ పొందవచ్చు అనే మాయమాట చెబుతున్నారు. గ్రాట్యూటీ పేమెంట్ అనేది ఉద్యోగి పొందే వేతనాన్ని, చేసిన సర్వీస్ కాలాన్ని బట్టి ఉంటుంది. అలాంటప్పుడు ఒక సంవత్సరం పనిచేసిన ఉద్యోగి పొందే బేసిక్ ఎంత, దానికి సరిపడా ఒక సంవత్సరానికి లభించే గ్రాట్యూటీ ఎంత? నామమాత్రం! నియామక పత్రాలు పొందిన సంఘటిత రంగంలోని కొందరికి మాత్రమే గ్రాట్యుటీ చెల్లిస్తారు. 97శాతం అసంఘటితరంగ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలంటే ఏం చేయాలో ఈ కోడ్‌లలో ఎక్కడా లేదు.

> **విపులంగా ఉన్న చట్టాలను కుదిస్తే వాటి పరిధి పెరుగుతుందా తగ్గుతుందా? 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా సంక్షిప్తీకరించి వాటిని కార్మికుల సంక్షేమం కోసమే అని ప్రకటించడం ఎవరూ ప్రశ్నించరు అన్న ధీమాతోనే! అంతేకాక, కార్మికుల హక్కుల పట్ల నిర్లక్ష్యం, కార్మిక సంఘాల పట్ల లెక్కలేనితనం, పెట్టుబడిదారులకు దోపిడీ మార్గాలను సుగమం చేయాలన్న దృఢ సంకల్పంతో మాత్రమే.**



కనీసం 100 మంది వర్కర్లు పనిచేస్తున్న సంస్థలో లే ఆఫ్ లేదా రిట్రెంచ్‌మెంట్ ప్రకటించాలంటే ప్రభుత్వ అనుమతి అవసరం. ఇప్పుడు ఆ సంఖ్యను 300 చేశారు. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించే స్టాండింగ్ ఆర్డర్లు కూడా కనీసం 100 మంది వర్కర్లు ఉన్న సంస్థలకు వర్తిస్తాయి, ప్రస్తుతం దీనిని 300కి పెంచారు. మరి దీని ద్వారా యాజమాన్యాలకు లాభమా, వర్కర్లకు లాభమా? ఎవరైనా యజమాని నిర్దేశిత పనికోసం ఎవరినైనా నియామక పత్రం ఇచ్చి మరీ నియమించుకున్నప్పుడు వారిని తొలగించేటప్పుడు ఎలాంటి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు.

ఇక కార్మిక సంఘాల పరిధి నామమాత్రమై పోతుంది. కార్మిక సంఘాన్ని రిజిస్టర్ చేసుకోవాలంటే కనీసం 10శాతం సభ్యులు గానీ లేదా వందమంది గానీ ఉంటే తప్ప సాధ్యపడదు. వంద మందికి మించి వర్కర్లున్న చోట వర్కర్స్ కమిటీ ఏర్పడనున్నది. ఈ వర్కర్స్ కమిటీలో యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధులు సమాన సంఖ్యలో ఉంటారు. 20 మంది కన్నా ఎక్కువ కార్మికులు ఉన్న చోట 'గ్రీవెన్స్ రెడ్రెసల్ కమిటీ' ఏర్పాటు చేస్తారు. చైర్మన్ మాత్రం యజమాన్యం వైపు నుంచే ఉంటారు. దీన్ని బట్టి ఎవరి ప్రయోజనాల కోసం కార్మిక చట్టాల సవరణ జరిగింది? సమ్మెలను నివారించడమే లక్ష్యంగా ఈ కోడ్‌లు తయారయ్యాయి.

సాంఘిక భద్రత యాజమాన్యమే కల్పించాలని ఈ కోడ్స్‌లో ఉంది. వివాదాలు ఏర్పడితే కోర్టును కూడా ఆశ్రయించవచ్చట. అయితే దానికన్నా ముందు ఫెసిలిటేటర్‌ను కలిసి విన్నవించుకోవాలి. ఈ హక్కు కూడా కొన్ని పరిమితమైన షరతులతో ఉంటుంది. ముఖ్యంగా నియమింపబడే ఉద్యోగానికి సంబంధించి లభించబోయే బెనెఫిట్స్ అన్నీ ప్రభుత్వం ద్వారా నోటిపై కావాల్సి ఉంటుంది. లేకపోతే సాంఘిక భద్రత స్థానంలో సంక్షేమ పథకాలకు మాత్రమే అర్హులౌవుతారు.

ఇక మరో కోడ్ 'ఆర్గనైజేషనల్ సేఫ్టీ హెల్త్, వర్కింగ్ కండిషన్స్' కింద యాజమాన్యం విధిగా ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ సౌకర్యాలు ఎప్పుడైనా సరిగా జరగకుంటే ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడానికి వీలు లేదు. కేవలం కోఆపరేటివ్ ఫెడరలిజం ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలి. అసంఘటితరంగ కార్మిక సంఘాలకు నాయకత్వం వహించడానికి కనీసం 50శాతం ఆ సంస్థలో పని చేస్తున్నవారై ఉండాలి. సంఘటితరంగం గురించి స్పష్టత లేదు. ఇలా ఏ సంఘాలకు ఎవరు నాయకులు ఉండాలో కూడా అంతిమ నిర్ణయం ప్రభుత్వమే చేస్తే ఇక కార్మికుల, వారి సంఘాల ప్రజాస్వామ్యమెక్కడ! ఇలాంటి నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 స్ఫూర్తికి విరుద్ధం.

గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫాం వర్కర్లకు కూడా పర్మనెంట్ ఉద్యోగుల మాదిరిగా అన్నీ సమకూరుతాయని ప్రకటించారు. కానీ గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫాం వర్కర్లకు సంబంధించిన యజమాని - ఉద్యోగి అనే అంశంపై స్పష్టత లేదు. వారికి ఇవ్వాల్సిన నియామక పత్రాల గురించి కూడా స్పష్టత లేదు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలి అని ఒక వైపు ప్రకటిస్తూనే 14 సంవత్సరాలు నిండిన వారందరూ కార్మిక సంఘంలో చేరవచ్చు అని కూడా ప్రస్తుతించారు. వెరసి ఈ కోడ్‌ల ద్వారా ప్రశ్నించకుండా స్వీయ ధృవీకరణ ద్వారా పరిష్కరించుకోవాలి. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ మాదిరిగా కన్సిలియేటరీ, ట్రిబ్యునల్, గ్రీవెన్స్ రిడ్రెస్సల్, ఆర్బిట్రేటర్ వ్యవస్థలన్నీ దాటితే తప్ప కోర్టు పరిధి అందుబాటులోకి రాదు. కార్మిక సంక్షేమానికి నీళ్ళొదిలితే సమాజంలోని అని వ్యవస్థలూ తిరోగమనంలో పయనిస్తాయి.

▪ జి. తిరుపతయ్య


దీప్తికి భారత్ గౌరవ్ అవార్డు

- గవర్నర్ చేతుల మీదుగా స్వీకరణ
- గతంలోనే అర్జున అవార్డు

6


అవార్డు అందుకుంటున్న దీప్తి

ఫండ్ గండం



అటు ఇష్టం.. ఇటు కష్టం..

అవకాశం కలిసి వచ్చినా..

ఊరికి ఒక్కసారైనా సర్పంచ్ కావాలనే కల చాలామందికి ఉంటుంది. ప్రథమ పౌరుడిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనే ఆశతో ఎన్నికల్లో పోటీకి ఏళ్లతరబడి అవకాశం ఎదురుచూస్తున్న వాళ్లు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,708 గ్రామపంచాయతీలు ఉండగా, 15,006 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటిలో 50శాతం వివిధ వర్గాలకు రిజర్వేషన్లు చేశారు. అయితే వీటిలో 803 సర్పంచ్ స్థానాలు, 6,645వార్డుస్థానాలు మహిళలకు రిజర్వుడు చేశారు. పాత రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో మారుస్తూ రిజర్వేషన్లను ఖరారు చేశారు. చాలామందికి రిజర్వేషన్లు కలిసి వచ్చాయి. రిజర్వేషన్లు అనుకూలించని వారు తమ భార్య, తల్లి, కూతురును బరిలో దించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మొదటి విడతల ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలైంది. సర్పంచ్ కావాలనే కల కళ్ల ముందు ఉన్నా.. ఖర్చులను చూస్తే అభ్యర్థులకు దడ మొదలవుతుంది.

పదవిపైన మోజుతో బరిలోకి పలువురు

- ఎన్నికల ఖర్చుకు సరిపడ డబ్బుల్లేక వెతలు
- పోటీదారులకు అప్పు ఇచ్చేందుకు ఆసక్తిచూపని వడ్డీవ్యాపారులు
- మాజీ సర్పంచ్‌లకే చేసిన పనులకు బిల్లుల పెండింగ్
- గెలిచినా.. ఖర్చు పెట్టింది సంపాదించేదెప్పుడో అనే అనుమానం
- డబ్బుల సర్దుబాటుకు అభ్యర్థుల పాట్లు
- చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. పోటీకి సై

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సర్పంచ్‌గా పోటీ చేయాలని ఆశ.. కానీ, ఖర్చులను భరించేందుకు పైసలు ఎట్లా అనే మీమాంస.. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కలిసి వచ్చి పోటీకి ఉత్సాహం ఉన్నా.. చేతిలో చిల్లిగవ్వలేక ఆశావహుల్లో నిరాశ. తాజా మాజీ సర్పంచ్‌లకు చేసిన పనులకు బిల్లులే రాక ఇంకా అవస్థలు పడుతున్న తీరు.. పోటీదారులకు అప్పు పుట్టకుండా చేస్తోంది. ప్రధాన పార్టీల మద్దతు కావాలన్నా.. నీ చేతిలో ఎంత ఉందో ముందు చెప్పు.. అంటూ ఎదురు ప్రశ్నలు. దీనికి తోడు రియల్ బూమ్ లేకపోవటం.. పంటల ఆదాయం అంతంతే ఉండటంతో అభ్యర్థులను కాసుల కష్టాలు వెంటాడుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావటంతో తెలిసినోళ్లందరినీ కలిసి నీ దగ్గర ఏమైనా ఉంటే సర్దుబాటు చేయమంటూ పడరాని పాట్లు పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లిన పోటీదారులు పైసల వెతలు ఇవి.

పోటీ సరే.. కాసులెట్లా..?

అసెంబ్లీ, పార్లమెంట్, సర్పంచ్.. ఏ ఎన్నికైన కాసులతో ముడిపడి పోయింది. ప్రచారంలో ప్రత్యర్థులకు దీటుగా రంగంలో ఉండాల్సిందే. ఖర్చులో తగ్గేదేలే అంటేనే క్యాడర్ అభ్యర్థి వెనుక నిలబడుతుంది. లేదంటే వారి దారి వారిదే అనే భయం. దీంతో పోటీకి సిద్ధమైన అభ్యర్థులకు ఖర్చుల టెన్షన్ పట్టుకుంది. ఎన్నికల్లో బ్యానర్లు, వాల్ పోస్టర్లు, ప్రచార వాహనాలు, రోజువారి క్యాడర్ ఖర్చు, పోల్‌మేనేజ్‌మెంట్. వీటన్నింటికి తోడు మందు, మాంసం లెక్కలు వేరే అనే టాక్ ఉంది. ఇలా ఎన్నికల వ్యయం తడిసిమోపెడు అవుతుందనే టెన్షన్‌లో అభ్యర్థులు ఉన్నారు. వెయ్యి ఓట్ల లోపు గ్రామమైతే తక్కువలో తక్కువగా రూ.8లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందనే అంచనాల్లో ఉన్నారు. రెండువేల లోపు జీపీల్లో

(మిగతా 7లో..)

ఊపందుకున్న నామినేషన్లు

- రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 84, వార్డు స్థానాలకు 230
- తొలివిడత ఎన్నికలకు నేటితో దాఖలు ముగింపు

హనుమకొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో మొదటి విడత సర్పంచ్, వార్డుమెంబర్ల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం రెండో రోజు నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు నామినేషన్లు స్వీకరించినట్టు వెల్లడించారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లోని శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 84 దాఖలు కాగా, వార్డు స్థానాలకు 230 దాఖలైనట్లు కలెక్టర్ తెలిపారు. రెండో రోజు భీమదేవరపల్లి మండలం 25 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు 37 నామినేషన్లు వచ్చాయన్నారు. ఎల్కతుర్తి 20 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు శుక్రవారం 22 నామినేషన్లు దాఖలయ్యాయి. కమలాపూర్ 24 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు 25 నామినేషన్లు

(మిగతా 8లో..)

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — రెండో రోజు 28-11-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
భీమదేవరపల్లి	25	37 (67)	232	100 (122)
ఎల్కతుర్తి	20	22 (42)	180	53 (58)
కమలాపూర్	24	25 (61)	246	77 (111)

నోట్: (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య


కమలాపూర్‌లో బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా పబ్బు సతీశ్‌కు ధృవీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఈటల

నేడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాక

- అయోధ్యపురంలో కోచ్‌ఫ్యాక్టరీ సందర్శన



కాజీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట అయోధ్యపురం సమీపంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సందర్శించనున్నారు. ఉదయం 11:45 నిమిషాలకు కోచ్ ఫ్యాక్టరీకి చేరుకుని అక్కడ జరుగుతున్న పనులు రైల్వే ఉన్నతాధికారులను అడిగి తెలుసుకుంటారు. జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, డీఆర్ఎం గోపాలకృష్ణన్‌లతో కేంద్ర మంత్రి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. సమావేశంలో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం, ప్రారంభించే తేదీలను ఖరారు చేయడమే కాకుండా, ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

5న నర్సంపేటకు సీఎం రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే దొంతి



నర్సంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వచ్చే నెల 5న వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేర్కొన్నారు. సీఎం బహిరంగ సభ కోసం నర్సంపేట శివారు మెడికల్ కళాశాల సమీపంలోని స్థలంతోపాటు మరో రెండు చోట్ల స్థలాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సీఎం తన పర్యటన సందర్భంగా సుమారు రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. వరంగల్ నుంచి నర్సంపేట వరకు రూ.150 కోట్లతో నిర్మించ తలపెట్టిన ఫోర్‌లైన్ రోడ్డు, నర్సంపేటలో రూ.28కోట్లతో నిర్మించతలపెట్టిన సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు, నర్సంపేట నుంచి పాకాల సరస్సు వరకు రూ.100 ఫీట్ల రోడ్డు నిర్మాణం, నర్సంపేట నుంచి నెక్కొండకు వెళ్లే రోడ్డును 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం, నర్సంపేట డిగ్రీకళాశాల నూతన భవనం, రూ.150 కోట్లతో నిర్మించనున్న మెడికల్ కళాశాల నూతన భవనం, రూ.25 కోట్లతో నిర్మించే నర్సింగ్ కళాశాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అలాగే రూ.140 కోట్లతో ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు కింది కాల్వల ఆధునీకరణ పనులకు, ఇదే మండలంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, నెక్కొండ నుంచి గూడూరు. నెక్కొండ నుంచి కేసముద్రం, నెక్కొండ నుంచి పర్వతగిరి వెళ్లే రోడ్లను 100 ఫీట్ల రోడ్లుగా నిర్మించనున్న పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. సభాస్థలి స్థల పరిశీలన కార్యక్రమంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి ఏసీపీ రవీందర్ రెడ్డి, ఆర్డీవో ఉమారాణి, మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యం వైపు స్థిరంగా దూసుకెళ్లాలి

- శరవేగంగా రూపుదిద్దుకుంటున్న ఏఐ
- దానిని ప్రయోగవాహక వేదికగా భావించాలి
- తదనుగుణంగా బోధనలో మార్పులు అవసరం
- మైక్రాన్ ఇండియా వైస్‌చైర్మన్ ఆనంద్ రామమూర్తి పిలుపు
- ఘనంగా వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- 1,913 మందికి పట్టాల ప్రదానం

7



పాలకుర్తుల శ్రీ సత్య నవీన్‌కు పట్టా ప్రదానం చేస్తున్న రామమూర్తి



స్నాతకోత్సవానికి హాజరైన పట్టభద్రులతో కిటకిటలాడుతున్న అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్

కేసీఆర్ పోరాట ఫలితమే 'తెలంగాణ'

- నేడు నక్కలగుట్టలో దీక్షా దివస్
- మాజీ చీఫ్‌విప్ వినయభాస్కర్


దీక్షా దివస్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వినయభాస్కర్

7

ముడుపులివ్వనిదే మ్యుటేషన్ చేయనన్నాడు..

- గిరిజన రైతుకు పెద్దవంగర తహసీల్దార్ వేధింపులు
- తన డ్రైవర్‌కు డబ్బులివ్వాలని హుకుం
- రూ.15వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ
- ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న అధికారులు

6


పట్టుబడిన తహసీల్దార్ వీరగంటి మహేందర్, డ్రైవర్ గౌతమ్

గద్దెల విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

- డిసెంబరు 4లోగా పూర్తి చేయాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మంత్రులు సీతక్క, సురేఖతో కలిసి మేడారం పర్యటన

ములుగు/తాడ్వాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా మేడారంలో చేపడుతున్న వనదేవతల గద్దెల విస్తరణ పనులను డిసెంబరు 4లోగా పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించి అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దేవస్థానంలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన నిర్మాణాల బేస్‌మెంట్, రాతి కట్టడాలను పరిశీలించారు. వందలాది ఏళ్ల చెక్కుచెదరకుండా నిర్మాణాలను చేపడుతున్న దృష్ట్యా నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. అనంతరం దేవస్థానం చుట్టూ తిరుగుతూ గద్దెల పనులు

(మిగతా 6లో..)


మేడారంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రులు

ఏళ్లుగా తిష్ఠ..

జీడబ్ల్యూఎంసీకి అప్రతిష్ఠ...

- పాతుకుపోయిన ఉద్యోగుల ప్రక్షాళనకు కమిషనర్ శ్రీకారం
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టారాజ్యం
- దీర్ఘకాలికంగా ఒకే చోట విధులు
- మూడు వింగ్‌లలో కొనసాగుతున్న హవా
- వివరాలు సేకరించిన అదనపు కమిషనర్
- స్థానచలనంపై ముమ్మరంగా కసరత్తు

7



జీడబ్ల్యూఎంసీలో ఏళ్ల తరబడి అక్రమంగా పాతుకుపోయిన ఉద్యోగులకు స్థానచలనం తప్పేలా లేదు. 12 వింగ్‌లలో ఇలా ఎవరెంత మంది ఉన్నారో అధికారులు లెక్క తేల్చారు. అదనపు కమిషనర్ జాబితా సైతం సిద్ధం చేశారు. కొద్దిరోజుల్లో వీరిలో అనేక మంది బదిలీ బాట పట్టక తప్పదని అంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ కార్పొరేషన్

గద్దెల విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

(5వ పేజీ తరువాయి)

పరిశీలించారు. ఉపమండపం నిర్మాణాలను వెంటవెంటనే చేపట్టాలని ఆదేశించారు.

వనదేవతల దర్శనం

అభివృద్ధి పనులను పరిశీలించేందుకు హెలీకాప్టర్ ద్వారా మేడారం చేరుకున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ ముందుగా వనదేవతలను దర్శించుకున్నారు. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రహదారుల విస్తరణ, జంపన్నవాగు స్నానగట్టాలు, ఆర్టీసీ బస్టాండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 4న గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల పునఃప్రతిష్ఠాపన ఉంటుందని, ఈ లోపే పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేస్తామని అన్నారు. డిసెంబరు చివరి నాటికి రోడ్ల విస్తరణ, దేవస్థానం అభివృద్ధి పనులు తుది దశకు చేరుకుంటాయన్నారు. మంత్రుల వెంట పలు శాఖల ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, దేవస్థానం అధికారులు, ఆర్కిటెక్ అధికారులు, పోలీసులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

పవన్‌కుమార్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చిన్నాల పవన్‌కుమార్ కు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ పవన్‌కుమార్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేసింది. పవన్ పవర్ డిజైన్ ఆఫ్ డిజిటల్ సర్క్యూట్ ఉపయోగించి డ్యూయల్ గేట్ టన్నెల్ యఫ్ఈటీఎస్ అనే సాంకేతిక పీహెచ్‌డీ థీసిస్‌ను జేఎన్‌టీయూ హైదరాబాద్ పరీక్షల విభాగానికి సమర్పించారు. దీంతో జేఎన్‌టీయూ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కిట్స్ ప్రిన్సిపాల్ అశోకొరెడ్డితో పాటు కిట్స్ యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.

వైబ్రాంట్ అకాడమీలో రేపు టాలెంట్ పరీక్షలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైబ్రాంట్ అకాడమీ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అగ్రగామి విద్యాసంస్థ అయిన వైబ్రాంట్ అకాడమీలో టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ వైబ్రాంట్ అకాడమీ డైరెక్టర్ చిట్టేటి రాజేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్ట లోని వైబ్రాంట్ అకాడమీ (కోట రాజస్థాన్) కళాశాలలో అకాడమీ డైరెక్టర్ చిట్టేటి రాజేందర్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్ ఎర్లీ అడ్మిషన్ కోసం ఆదివారం టాలెంట్ టెస్టు పరీక్షలు నిర్వహిస్తున్నామని 10వ తరగతి విద్యార్థులు తమ నైపుణ్యాన్ని నిరూపించుకోవడానికి పరీక్షల్లో ఉత్తీర్ణత కనబర్చాలని కోరారు. మొదటి ఐదుగురి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు పూర్తి ఉచితమని, మిగతా విద్యార్థులకు మార్కుల ఆధారంగా ట్యూషన్ ఫీజులో కొంత రాయితీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపాల్ శేషుకుమార్, అకడమిక్ హెడ్ రామకృష్ణ, ఏజీఎంఎస్ గుండాల రాజు, మాలోతు నారాయణ సింగ్, దండు రాజు, కో ఆర్డినేటర్ రాము, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు : 9963017799 / 9908983399 లలో సంప్రదించాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత మార్కెట్‌గా తీర్చిదిద్దాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

బాలసముద్రం మార్కెట్‌లో అవగాహన కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని (ఎల్‌బీసీ) కూరగాయల మార్కెట్‌లో పర్యావరణం పెంపొందించి ప్లాస్టిక్ రహిత మార్కెట్‌గా తీర్చిదిద్దాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం బాలసముద్రంలో కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడి వ్యాపారులతో సింగ్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనేక అనర్థాలకు కారణం అవుతుందని అన్నారు. ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలిసి పోకుండా రసాయనాలను విడుదల చేయడంవల్ల వాతావరణం కలుషితం అవుతుందని అన్నారు. వ్యాపారులు వినియోగదారులకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించాలని, బయోడిగ్రేబుల్, బట్ట, కాగితపు, జూట్ బ్యాగులను వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతగా గుర్తించి జీవనం సాగించాలన్నారు. అనంతరం వ్యాపారులకు ప్లాస్టిక్ నిషేధ అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఈఈ రవికుమార్, డీఈ శ్రీకాంత్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ పాల్గొన్నారు.



ఎల్‌బీసీ మార్కెట్‌లో ప్లాస్టిక్ అవగాహన కలిగిస్తున్న మేయర్

విద్యుత్ తీగ తెగిపడి యువకుడి మృతి

కాజీపేటలో ఘటన



సుహాస్ మృతదేహం

కాజీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడిని విధి వెంటాడింది. ఇంట్లోంచి పాలప్యాకెట్ తేవడానికి వెళ్లిన యువకుడిని క్షణాల్లోనే మృత్యువు కాటేసింది.. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కాజీపేట సిద్ధార్థనగర్ దివ్య రెసిడెన్సీలో ఉండే ప్రభుత్వ ఉద్యో గి జాజుల ప్రవీణ్‌కు ఇద్దరు కుమారుడు. పెద్ద కుమారుడు జాజుల సుహాస్ (17) ఇంటర్‌పూర్తి చేసి నీట్ కోచింగ్‌కు వెళ్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లోంచి పాలప్యాకెట్ తీసుకువచ్చేందుకు సుహాస్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో అకస్మాత్తుగా విద్యుత్ తీగ తెగి అతడి తలపై పడింది. ఈ ఘటనలో సుహాస్‌తల పగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది సుహాస్‌కు ప్రథమ చికిత్స చేశారు. అప్పటికే అతడు మృతి చెందడతో మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. కుమారుడు మృత్యువాతతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి ప్రవీణ్ సమాచారంతో పోలీసులు విచారిస్తున్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

● పోలీసుల విధులకు అటంకం కలిగించిన 8మందిపై కేసు

పర్వతగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వీరంగం సృష్టించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన 8మంది యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అందులో ఒక ఓ యువకుడికి 14 రోజుల రిమాండ్‌కు తరలించాలని కోర్టు తీర్పునిచ్చింది. పర్వతగిరి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని సీత్యాతండాలో ఈ నెల 26వ తేదీన రాత్రి 8మంది యువకులు రోడ్డుపై మద్యం సేవిస్తూ, మద్యం సీసాలను పగుల గొట్టి, నృత్యాలు చేశారు. ఈ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీస్ సిబ్బంది ఎ.రమేష్, బాబురావు యువకులను నియంత్రించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా యువకులు ఘర్షణకు దిగారు. వీరిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా ఏడుగురు పారిపోగా వెంకన్నను అదుపులోకి తీసుకున్నారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించారని 8మందిపై కేసు నమోదు చేశారు. వెంకన్నను కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. వెంకన్నను పరకాల జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతీ బ్యాంకు శాఖ పనితీరు మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలు, మహిళల స్వయం సహాయక సంఘాలు తదితర సెక్టార్‌లలో బ్యాంకు రుణాల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు సమయానికి రుణాలు అందించాలని, ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు కొనసాగుతున్నందున నామినేషన్లు వేసే అభ్యర్థులకు ప్రత్యేక బ్యాంకు ఖాతాలను తెరిచేందుకు సహకరించాలని సూచించారు. ఈ ప్రక్రియ ఎన్నికల్లో పారదర్శకతకు, ఆర్థిక లావాదేవీల రికార్డింగ్‌కు దోహదపడుతుందని వెల్లడించారు. అయితే బ్యాంకు అధికారుల లక్ష్యసాధన నివేదికలు సరిగా సమర్పించనందున కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తి వివరాలతో కూడిన నివేదికలతో హాజరుకావాలని ఆదేశిస్తూ సమావేశాన్ని డిసెంబరు 9 కి వాయిదా వేశారు.

అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు అవసరమైన బ్యాంకు గ్యారంటీలు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. రైస్ మిల్లింగ్ కార్యకలాపాలను సులభతరం చేసి, రైతులు ధాన్యాన్ని సకాలంలో విక్రయించుకోవడానికి తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఇండస్ట్రీయల్ జీఎం నరసింహమూర్తి, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్‌రావు, డీపీవో కల్పన, డీటీసీడీవో పుష్పలత, డీటీడీవో సౌజన్య, మెప్మా డీఏవో రేణుక, డీపీఆర్వో అయూబ్ అలీ, ఏడీపీఆర్వో ప్రేమలత, లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలీ రాజు, యూనియన్ బ్యాంక్ డీజీఎం కమలాకర్, ఆర్‌బీఐ అధికారి చేతన్, 35 బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ కవిత

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పోలీస్ స్టేషన్ తనిఖీలో డీసీపీ కవిత

కమలాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సెంట్రల్ జోన్ డీసీపీ కవిత అన్నారు. కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్‌హెచ్‌వో హరికృష్ణకు సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీ లు ఎలాంటి సమావేశాలు నిర్వహించ రాదన్నారు. వాల్ రైటింగ్, పార్టీ గుర్తులు ఉండరాదన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో వాహనాలను నిలుపరాదన్నారు. ఆమె వెంట కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, సీఐ హరికృష్ణ, ఎస్సై అనంతరగిరి మధుయాదవ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దీప్తికి భారత్ గౌరవ్ అవార్డు

పర్వతగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ క్రీడాకారిణి జీవాంజి దీప్తికి మరో అరుదైన గౌరవం దక్కింది. భారత్ గౌరవ్ అవార్డు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్, చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా భారత్ యూత్ అవార్డును అందుకున్నారు. పర్వతగిరి మండలంలోని కల్లెడకు చెందిన ప్రపంచ పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి ఓరుగల్లు కీర్తిని చాటిన విషయం విదితమే. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ అవార్డు అందజేస్తారు. దీప్తి గతంలోనే అర్జున అవార్డును కూడా అందుకున్నారు. దీప్తికి అవార్డు రావడంపై క్రీడాభిమానుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కో-ఆర్డినేటర్‌గా శ్రీధర్ రాజు

హనుమకొండ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా బిరుదురాజు శ్రీధర్ రాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా బొచ్చు చందర్, పశ్చిమ సేవాదళ్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి ఇమ్మాన్యూయేల్‌లు నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం శ్రీధర్ రాజు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని తీసుకున్నారు. నూతనంగా నియామకం జరిగిన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో పార్టీ పదవులు ఇచ్చినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

సందడిగా జిల్లా స్థాయి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతతోపాటు శరీరం దృఢత్వం పెంపొందుతుం దని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఆదేశాల మేరకు హనుమకొండ జేఎన్‌ఎస్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల క్రీడా పోటీలను వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు విద్యాభివృద్ధి పెంపొందుతుందన్నారు. ప్రతీ పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడా మైదానాలను అభివృద్ధి చేయ డంలో పీఈటీలు కీలకంగా వ్యవహరించాలని వెంకట్‌రెడ్డి సూచించారు.

రెండు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీల్లో హనుమకొండ జిల్లాలోని 16 పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల నుంచి 900మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. తొలి రోజు ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పీఎం శ్రీ పాఠశాలల క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్, సమగ్ర శిక్ష ప్లానింగ్ కో-ఆర్డినేటర్ బి.మహేష్, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ప్రశాంత్, పీఎంశ్రీ పాఠశాలల అధ్యాపలకు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

డిసెంబరులో నోబుల్ ప్రైజ్ డే సంబురాలు

కేయూ క్యాంపస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేయూ స్వర్ణోత్సవ సంబురాలను పురస్కరించుకుని డిసెంబరు 9, 10 తేదీల్లో స్టూడెంట్స్ అఫైర్స్ నేతృత్వంలో నోబుల్ ప్రైజ్ డే ఉత్సవాల బ్రోచర్‌ను శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ, రిజిస్ట్రార్‌లు ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, వల్లూరి రామచంద్రంలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేయూ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ మాట్లాడుతూ.. డిసెంబరు 9న కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇంగ్లీష్, ఎకనమిక్స్, బాటనీ, జువాలజీ, మైక్రోబయోలజీ, బయో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఫార్మసీ విభాగాల్లో విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్, వ్యక్తృత్వ పోటీలు జరుగుతాయని తెలిపారు. డిసెంబరు 5వరకు పోటీల్లో పాల్గొనే విద్యార్థుల తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అధికారి రాధిక, డాక్టర్ నిరంజన్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌రెడ్డి, రామచంద్రం తదితరులు

రెండు రోజుల సదస్సు..

ఫిబ్రవరి 19, 20 తేదీల్లో సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగం నేతృత్వంలో నిర్వహించే రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను శుక్రవారం కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్, అధ్యాపకులు కె.రాజేందర్, అమరవేణి, వరలక్ష్మి, నరసింహచారి, రహమాన్, స్వామి, సురేశ్, రమేశ్, సోమశేఖర్, గిరిప్రసాద్, బక్కి శ్రీనివాస్, సునిత, మయూరి, శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో సత్తా

రన్నరప్‌గా నిలిచిన గడ్డం, బొద్దిరెడ్డి జోడి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 23 వరకు థాయిలాండ్ దేశంలో పట్టాయా మహానగరంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి సవాస్ ది కప్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో హనుమకొండకు చెందిన గడ్డం కేశవమూర్తి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల జోడీ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రన్నరప్‌గా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాల నుంచి మాస్టర్స్ షట్లర్లు పాల్గొనగా ఇందులో 60 ప్లస్ డబుల్స్ విభాగంలో గడ్డం కేశవమూర్తి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడి జోడి పాల్గొని గెలుపే లక్ష్యంగా ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టించింది. ద్వితీయ స్థానంలో రాణించి రజత పతకాన్ని కొల్లగొట్టి ఓరుగల్లు కీర్తి, ప్రతిష్ఠను విశ్వవ్యాప్తం చేశారు. ఈ మేరకు రన్నరప్‌గా నిలిచిన కేశవమూర్తి, ప్రభాకర్‌రెడ్డి జోడిని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్(టీబీఏ) సభ్యులు శుక్రవారం వరంగల్‌లోని జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో శాలువాలు కప్పి పూలబొకే అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు సుధాకర్, మార్త శ్రీధర్, పూతాటి రవి, కొత్తగట్టు శివ, పూసల సంతోష్, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, ప్రభాకర్, రాజిరెడ్డి, రమణారెడ్డి, విజయ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



కేశవమూర్తి, ప్రభాకర్‌రెడ్డిలను అభినందిస్తున్న టీబీఏ సభ్యులు

ముడుపులివ్వనిదే మ్యుటేషన్ చేయనన్నాడు

● గిరిజన రైతుకు పెద్దవంగర తహసీల్దార్ వేధింపులు ● తన డ్రైవర్‌కు డబ్బులివ్వాలని హుకుం

● రూ.15వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ ● ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న అధికారులు

పెద్దవంగర, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): మరణించిన తన తండ్రి పేరు మీద ఉన్న ఆస్తిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని కోరిన గిరిజన రైతును తహసీల్దార్ వేధించాడు. డబ్బులు ఇస్తేనే భూమి మారుస్తానని చెప్పాడు. ఇందుకోసం ఫైల్‌ను చాలా రోజులుగా ఆపాడు. దీంతో చేసేదేమీలేక డబ్బులు ఇస్తామని ఒప్పుకున్న బాధిత కుటుంబం.. అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. డబ్బులు ఇస్తుండగా పట్టించి ఆట కట్టించారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర తహసీల్దార్ వీరంగటి మహేందర్ సూచనలతో ఆయన డ్రైవర్ లంచం తీసుకుటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

పెద్దవంగర మండలంలోని పడమటితండాకు చెందిన భూక్య స్వామి ఇటీవల మరణించాడు. అతడి పేరు మీద గంట్లకుంట గ్రామశివారులో సర్వే నెంబర్ 212/2, 226/5, 227/5లో 3.09 ఎకరాలు భూమి ఉంది. తన తండ్రి వారసత్వ భూమిని మ్యుటేషన్ చేయించుకోవడానికి స్వామి కుమారుడు భూక్య బాలు సెప్టెంబర్ 25న మీసేవలో బాలు దరఖాస్తు చేసుకున్నాడు. క్షేత్రస్థాయి అధికారులు భూమిని పరిశీలించారు. అయినా ఫైల్ మాత్రం కదలలేదు. పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. తహసీల్దార్‌ను కలిస్తే మ్యుటేషన్ చేయాలంటే రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసేదేమీ లేక రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఈ క్రమంలో బాధిత రైతు బాలు భార్య సాధ్వి, సమీప బంధువు దారావత్ మురళి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచనల మేరకు రూ.15వేలు తీసుకుని రైతు కుటుంబం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆయన డ్రైవర్ గౌతమ్ కార్యాలయం ఎదుట రైతు నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ వీరంగటి మహేందర్, డ్రైవర్ గౌతమ్‌ను ఆదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ సాంబయ్య పేర్కొన్నారు. ఈ దాడుల్లో సీఐలు ఎల్.రాజు, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

కాగా, తన తండ్రి పేరుమీద ఉన్న భూమిని మ్యు టేషన్ చేయించుకోవడానికి తహసీల్దార్ డబ్బుల కోసం వేధించాడని బాధిత రైతు బాలు, ఆయన భార్య తెలిపారు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించామన్నారు.



బాధిత రైతులు భూక్య సాధ్వి, దారావత్ మురళి

లక్ష్యం వైపు దూసుకెళ్లాలి

- ఏఐతో బోధనలో మార్పులు అవసరం
- మైక్రాన్ ఇండియా వైస్ చైర్మన్ రామమూర్తి
- ఘనంగా వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- 1,913 మందికి పట్టాల ప్రదానం

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయం అనేది నిచ్చెన మెట్ల వంటిదని, కష్టపడి చదవడం, కష్టించి పని చేయడం, లక్ష్యం వైపు స్థిరంగా దూసుకువెళ్లడం ద్వారానే అది సాధ్యమవుతుందని మైక్రాన్ ఇండియా, మైక్రాన్ టెక్నాలజీ ఆపరేషన్ ఇండియా ఎల్ఎల్‌పీ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ రామమూర్తి అన్నారు. వరంగల్ ఎన్ఐటీలో శుక్రవారం 23వ స్నాతకోత్సవం కనులపండువగా జరిగింది. క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆనంద్ రామమూర్తి ముఖ్య అతిథి, 'డిఫెన్స్ ఆర్ అండ్ డీ విభాగం సెక్రటరీ, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ స్నాతకోత్సవంలో 1913 మందికి పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 953 మంది బీటెక్, 556 మంది ఎంటెక్, 149 మంది ఎంఎస్‌సీ, 38 మంది ఎంబీఏ, 56 మంది ఎంసీఏ విద్యార్థులు, 142 మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 19 మంది బీఎస్‌సీ, బీఎస్‌సీ (హానర్స్), ఇంజనీరింగ్‌లో పీజీ డిప్లొమా విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరితో పాటు ప్రతీ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో బీటెక్‌లో టాపర్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. ముగ్గురు విద్యార్థులు డైరెక్టర్స్ గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఓవర్ ఆల్ టాపర్‌గా పాలచర్ల శ్రీసత్య నవీన్, కొండ సౌమ్య, రోహన్ గుప్తా ఉన్నారు. బీటెక్ ప్రాజెక్టు అవార్డును మీర్ రహమాన్, ఎంటెక్ డిసెర్టేషన్ అవార్డు ఆయోషా దాంగే, పీహెచ్‌డీ థీసిస్ అవార్డు డాక్టర్ నిఖిల్ భరత్ అందుకున్నారు.





స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రామమూర్తి, సమీర్ వి కామత్

ఈ సందర్భంగా ఆనంద్ రామమూర్తి మాట్లాడుతూ.. మనం సాఫీగా ముందుకు వెళ్లడానికి జీవితం జీపీఎస్ (గ్లోబల్ నావిగేషన్ వ్యవస్థ) కాదని, మన వెళ్లేదారిలో డొంకలు, ఎత్తుపల్లాలు, సుదీర్ఘ నిశ్శబ్ద పయనాలు ఉంటాయన్నారు. వీటిని మనం ఎట్లా దాటుకుంటూ వెళతామో అదే మనమేమిటనేది నిర్ణయిస్తుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ని ఆవిష్కరణలకు వేదికగా చూడాలన్నారు. ప్రతిభ ఒక్కటే ముఖ్యంకాదని, నైపుణ్యాల కన్నా ముందు మానవ సంబంధాలను నిర్మించుకోవాలని ఉద్బోధించారు. ఏఐ ఒక కొత్త బేస్‌లైన్, ఈ విశాలమైన సాంకేతిక మైదానంలో దానిని అందిపుచ్చుకోవడానికి మరింత కృషి చేయాలన్నారు. ఏఐని ఒక ముప్పుగా చూడరాదని, దీనిని ఒక ప్రయోగవేదికగా భావించాలని సూచించారు. ఏఐ నేపథ్యంలో పట్టభద్రుల బోధనలో తదనుగుణంగా మార్పులు చేయాలన్నారు.

డిఫెన్స్ ఆర్‌అండ్‌డీ సెక్రటరీ, డీఆర్‌డీవో చైర్మన్ మాట్లాడుతూ.. రక్షణ రంగంలో దేశం స్వావలంబన సాధించిందని, ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే సత్తాను సాధించిందన్నారు. ఇటీవలి ఆపరేషన్ సింధూర్‌ను ప్రస్తావిస్తూ శత్రువులపై విజయం సాధించడం వెనుక డీఆర్‌డీఏ భూమిక కీలకంగా ఉందన్నారు. ప్రస్తుతం డీఆర్‌డీవోలో సేవలందిస్తున్న డైరెక్టర్ జనరల్స్ ఇద్దరు ఎన్ఐటీ పూర్వ విద్యార్థులేనని గుర్తు చేశారు.

కాగా, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి నిట్ ప్రగతిపై నివేదికను సమర్పించారు. అత్యున్నత విద్యా ప్రమాణాలతో వరంగల్ నిట్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. 2025-26 సంవత్సరంలో రికార్డు స్థాయిలో ప్లేస్‌మెంట్లు, రూ.45.65కోట్ల విలువైన 118 రిసెర్చ్ ప్రాజెక్టులు, 51 కొత్త పేటెంట్లు సీఐఈ ద్వారా పెరుగుతున్న స్టార్టప్‌లు నిట్ ఔన్నత్యానికి నిలువెత్తు ప్రతీకలన్నారు.



నిట్ అధ్యాపకులతో ముఖ్య అతిథులు

ఇద్దరికి అత్యున్నత పురస్కారాలు

వరంగల్ నిట్ చరిత్రలో మొదటిసారిగా ఇద్దరికి అత్యున్నత పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు నిట్ డైరెక్టర్ తెలిపారు. సాయుధ దళాల కోసం దేశవాళి రక్షణ వ్యవస్థలను, అధునాతన సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో విశేషంగా కృషి చేసినందుకు గాను డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ వి.సమీర్ కామత్ కు గౌరవ డాక్టరేట్‌ను, అలాగే దేశానికి భద్రత, సస్టేనబుల్ ఎనర్జీ ట్రాన్స్‌ఫా ర్మేషన్‌లో కీలక భూమిక పోషించినందుకుగాను గుర్తింపుగా ఎన్.వేణుకు డక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (హానరీస్ కాసా) ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు.



నిట్ క్యాంపస్‌లో పట్టభద్రుల సందడి

సంబురంగా స్నాతకోత్సవం

- పండుగ వాతావరణం తలపించిన నిట్ క్యాంపస్

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో స్నాతకోత్సవం సరిగ్గా ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైంది. అంతకన్నా ముందు పట్టభద్రులు, గోల్డ్‌మెడలిస్టులు ఒక క్యాపద్ధతిలో సెంటర్‌కు చేరుకున్నారు. ఉదయం 10.32 గంటలకు జాతీయ గీతాలాపన జరిగింది. 10.33గంటలకు చైర్మన్, సెనెట్ 23వ స్నాతకోత్సవం ప్రారంభమైనట్టు ప్రకటించారు. 10.34 గంటలకు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి నివేదిక చదివారు. 10.49 గంటలకు ముఖ్య అతిథి ఆనంద్ రామమూర్తి స్నాతకోపన్యాసం చేశారు. 11.19 గంటలకు గౌరవ డాక్టరేట్, పీహెచ్‌డీ డిగ్రీల ప్రదానం జరిగింది. 11.21 గంటలకు డీఆర్‌డీవో చైర్మెన్ డాక్టర్ సమీర్ వి కామత్ ప్రసంగించారు. 11.31 నుంచి మధ్యాహ్నం 1.12 గంటల వరకు పట్టాల ప్రదానం జరిగింది. 1.15 గంటలకు పట్టభద్రులతో ప్రతిజ్ఞ చేయించారు. 1.20 గంటలకు అతిధులకు సత్కారం జరిగింది. 1.23 గంటలకు స్నాతకోత్సవం ముగిసింది.

కళకళలాడిన క్యాంపస్

స్నాతకోత్సవానికి హాజరైన పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో నిట్ క్యాంపస్ కిటకిటలాడింది. స్నాతకోత్సవం నిర్వహించిన ఎఎల్‌సీ హాల్ పూర్తిగా పట్టభద్రులతో నిండిపోయింది. దీనితో స్థలం చాలక మీడియాతో సహా ఇతరులెవరినీ లోపలికి అనుమతించలేదు. దీంతో తమ పిల్లలు పట్టాలు స్వీకరిస్తుండగా ప్రత్యక్షంగా చూడాలని వచ్చిన తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులు బయటనే వేచిచూడాల్సి వచ్చింది. అయితే వీరికోసం కాంప్లెక్సు సెమినార్ హాల్‌లో, ఇతరచోట్ల నాలుగు చోట్ల డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. హాళ్లలో స్థలం సరిపోకపోవడంతో చాలామంది నిలబడే వీక్షించాల్సి వచ్చింది.

సమీర్ కామత్‌కు డాక్టరేట్



- వేణుకు డాక్టర్ ఆఫ్ పిలాసఫీ
- నిట్ చరిత్రలో మొదటిసారి ప్రదానం

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం సందర్భంగా డిఫెన్స్ ఆర్‌అండ్‌డీ విభాగం సెక్రెటరీ, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్‌కు డాక్టర్ ఆఫ్ సైన్స్‌ను, హిటాచి సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వేణుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీని ప్రదానం చేశారు. ఆయా రంగాల్లో చేసిన విశిష్టసేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలను ప్రదానం చేయడం వరంగల్ నిట్ చరిత్రలో ఇదే మొదటి సారి. రక్షణ రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా డాక్టర్ కామత్‌కు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. డాక్టర్ సమీర్ వి కామత్ డీఆర్‌డీవోలో అపార అనుభవం ఉన్న ప్రతిభావంతులైన శాస్త్రవేత్త ఆయన మెటీరియల్ సైన్స్, నావల్ సిస్టమ్స్‌లో మార్గదర్శక కృషికి నాయకత్వం వహించారు. ముఖ్యంగా 2009లో స్వదేశీ స్టెల్త్ టెక్నాలజీల అభివృద్ధికి, నావికావేదికల కోసం ఆధునాతన మిశ్రమాలకు రూపకల్పన చేశారు. నావల్ సిస్టమ్స్, మెటీరియల్ డైరెక్టర్ జనరల్‌గా, భారతదేశ సముద్ర రక్షణను బలోపేతం చేసే కీలకమైన ఆవిష్కరణలను ఆయన పర్యవేక్షించారు. ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియాలో ఫెలో అయిన కామత్ దార్శనిక నాయకత్వంలో డీఆర్‌డీవో స్వావలంబనను సాధించి రక్షణ పరిశోధనలో ప్రపంచ స్థాయి కీర్తిని గడించింది. కాగా, ఎస్.వేణు భారత సుస్థిర ఇంధనరంగానికి చేసిన విశిష్టమైన సేవలకు గుర్తింపుగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ప్రదానం చేశారు.

'పంచాయతీ'

అభ్యర్థుల గుర్తులు ఇవే..

రఘునాథపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఎన్నికల సంఘం సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు సభ్యులకు 20గుర్తులు కేటాయించింది. సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఎన్నికల గుర్తులు కేటాయించారు. సర్పంచ్ బ్యాలెట్‌తోపాటు వార్డు సభ్యుల బ్యాలెట్‌లో నోటా గుర్తు ఉంటుంది. సర్పంచ్ బ్యాలెట్ పేపర్ గులాబీ రంగులో వార్డు సభ్యుల బ్యాలెట్ పేపర్ తెలుపు రంగులో ఉండనుంది.

సర్పంచ్ గుర్తులు..

ఉంగరం (రింగు), కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, స్పానర్(పానా), చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, కొబ్బరితోట, బెండకాయ, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్‌జాలీ, చేతి కర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, స్టంప్స్ గుర్తులు కేటాయించారు.

- వార్డు సభ్యులకు..

గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్(ఈల), కుండ, డిష్ యాంటినా, గరాట (గౌర), మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాసు, పోస్టు డబ్బా, కవర్, హాకీ స్టిక్ బాల్, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్తు స్తంభం, టీ కెటిల్ గుర్తులు కేటాయించారు.

ఎన్నికల ఖర్చు పరిమితి దాటొద్దు..

పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికల ఖర్చు పరిమితి విధించారు. 5వేల జనాభా పైబడిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50 లక్షలు, వార్డు సభ్యులకు రూ.50 వేలు, 5 వేల జనాభా లోపు ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50 లక్షలు, వార్డు సభ్యులు రూ.30 వేలకు మించి ఖర్చు చేయరాదు. సర్పంచ్, వార్డు సభ్యులు తప్పనిసరిగా బ్యాంకు లేక పోస్ట్ ఆఫీసులో ఖాతా తీసుకోవాలి. ఎన్నికల ఖర్చును బ్యాంకు ఖాతా ద్వారానే చూపించాలి. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అధికారుల నిఘా ఉంటుంది.

సర్పంచ్ పదవి కోసం

కొలువులకు రాజీనామా

మహబూబాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం సోమ్లతండా అంగన్‌వాడీ టీచర్, లక్ష్మాతండా శివారు వెంక్యతండా అంగన్‌వాడీ ఆయా తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తూ శుక్రవారం సీడీపీవో శిరీషకు పత్రాలను అందజేశారు. సోమ్లాతండా అంగన్‌వాడీ టీచర్ భూక్య కౌసల్య సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. లక్ష్మాతండా శివారు వెంక్యతండాలో అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తున్న బోడ నీలా లక్ష్మాతండా సర్పంచ్‌గా పోటీచేసేందుకు ఉద్యోగానికి రాజీనామా చేశారు.

అటు ఇష్టం.. ఇటు కష్టం..

(5వ పేజీ తరువాయి)

ఒక్కొక్క అభ్యర్థికి రూ.20 లక్షల పైమాటే అనే టాక్ ఉంది. ఇక రెండు వేలకు పైగా ఓటర్లు ఉంటే రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు.. ఆపైన కూ డా ఖర్చు పెరుగుతుందనే చర్చ ఉంది. ఖర్చులే కాకుండా సొంత పార్టీ నుంచి పోటీకి దిగుతున్నవారిని తప్పించేందుకు లక్షల్లో చేతిలో పెట్టాల్సిందే.

అయితే మరోవైపు ఏకగ్రీవం ఆశావహులను ఊరిస్తోంది. ఎవరితో పోటీ లేకుండా ప్రచార లొల్లి, ఖర్చుల బాధ లేకుండా సర్పంచ్ సీటులో కూర్చోవచ్చునని ఉవ్విళ్లురుతున్నవారు కూడా ఉన్నారు. అయితే ఏకగ్రీవం పేరుతో ఊరి అభివృద్ధికి, పోటీ నుంచి తప్పుకునేవారికి, చివరికి ఓటర్లకు దావత్.. ఇలా ఖర్చుల మీద ఖర్చులు తప్పవనే ప్రచారం ఉంది. ప్రతీ పనికి పైస కావాల్సిందే. పంచాయతీ ఎన్నికల్లో పైసా లేనిది ప్రచారం లేదని.. క్యాడర్ ఉండరనే ఆందోళనలో అభ్యర్థులు ఉన్నారు. దీంతో చేతిలో చిల్లీ గవ్వ లేకున్నా.. మద్దతుదారుల ప్రోత్సాహంలో సర్పంచ్ బరిలో దిగుతున్న అభ్యర్థులను కాసుల కష్టాలు కలవరపెడుతున్నాయి. జనరల్‌స్థానాల్లో ఖర్చు ఎక్కువ ఉండే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ప్రత్యర్థులకు దీటుగా వ్యూహరచనలు చేస్తున్నారు.

సర్దుబాటుకు తంటాలు

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాననే ఆనందం ఒకవైపు.. ఎన్నికల ఖర్చులకు అప్పు ఎట్లా అనే ఆందోళన మరోవైపు అభ్యర్థులను కలవర పరుస్తోంది. తెలిసినోళ్లందరికీ ఫోన్ చేసి అప్పు కోసం బతిమిలాడాల్సి వస్తోంది. 'అన్నా.. సర్పంచ్ ఎన్నికల్లో ఎమ్మెల్యే సపోర్టు చేస్తుండు.. నా కాడ ఐదారు లక్షలున్నాయి.. నీ దగ్గర ఐదో ఆరో లక్షలు ఉంటే సర్దు అన్నా.. ఎన్నికలయ్యాక ఏట్లనో తేర్చుతా' అంటూ రిక్వెస్ట్‌లు చేస్తున్నారు. అభ్యర్థులు వడ్డీ వ్యాపారులను కూడా ఆశ్రయిస్తున్నారు.

అయితే తాజా మాజీ సర్పంచుల అనుభవాలను చూసిన వ్యాపారులు, పెట్టుబడిదారులు కూడా ఎన్నికల కోసం అప్పు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సర్పంచ్‌లు వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, నర్సరీలు, రైతు వేదికలు తదితర వాటిని నిర్మించారు. వీరి పదవీకాలం పూర్తయ్యే వరకు సుమారు రూ.330కోట్ల వరకు నిధులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రతీ సర్పంచ్ సుమారుగా రూ.2లక్షల నుంచి రూ.50లక్షల వరకు పెట్టుబడి పెట్టి పనులు చేసి, బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం కొంత కొంత చెల్లిస్తూ వస్తోంది. మాజీ సర్పంచుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అప్పులు ఇచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపటం లేదనే చర్చ జరుగుతోంది. దీంతో ఎన్నికల ఖర్చులు సర్దుబాటు కోసం అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. కొందరు తమ భూములను తాకట్టే పనిలో ఉండగా, మరికొందరు భార్య, పిల్లలు, తల్లికి సంబంధించిన బంగారు అభరణాలను తాకట్టు పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది రైతులే ఉండటంతో వారి ఆదాయం కూడా పంటలపైనే. అయితే ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి, గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఆర్థికంగా చితికిపోయింది. ఈ క్రమంలో అప్పులు తప్ప వేరేదారి కనిపించటం లేదని కొందరు ఆశావహులు వాపోతున్నారు. అయితే లక్షలాది రుపాయలు ఖర్చు చేసి పోటీ చేస్తే మిగిలేది ఏమిటనే ఆలోచనలో మరి కొందరు ఉన్నారు. తాజా మాజీ సర్పంచ్‌లు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని, వృథా ఖర్చులు లేకుండా పోటీ చేయాలని అభ్యర్థుల కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఒత్తిడి తెస్తున్నారు.

కేసీఆర్ పోరాట ఫలితమే 'తెలంగాణ'

- మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పోరాట ఫలితంగానే తెలంగాణ స్వరాష్ట్రం సాధ్యమైందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దీక్షా దివస్ పోస్టర్ ఆవిష్కరించారు. శనివారం దీక్ష దివస్‌ను పురస్కరించుకొని హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పోరాట స్ఫూర్తితో 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్రం సాకరమైందన్నారు. సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల నాయకత్వంలో దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లారని అన్నారు. శనివారం నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగరావు, బోయినపల్లి రంజిత్‌రావు,ఇమ్మడి లోహితరాజు, బీఆర్ఎస్ నాయకులు జోరిక రమేష్, కంజర్ల మనోజ్‌కుమార్, పోలెపల్లి రాంమూర్తి, తక్కళ్లపెల్లి వినిల్‌రావు, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ

సమగ్రాభివృద్ధి ఎప్పుడో ?

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టి పెట్టాలంటున్న భక్తులు



వరంగల్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ శక్తిపీఠాల్లో ఒకటిగా భద్రకాళి దేవాలయం ప్రసిద్ధి గాంచింది. ఏడాదిలో నాలుగు బ్రహ్మోత్సవాలు జరిగే ఏకైక దేవాలయం ఇదే కావడం విశేషం. చైత్ర మాసంలో వసంత నవరాత్రులు, వైశాఖ మాసంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు, ఆషాఢ మాసంలో శాకంబరీ నవరాత్రులతో పాటు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు, వాహన సేవలు వైభవంగా కొనసాగుతాయి. కాళీమాత, భద్రకాళి మాత తేజో లింగంగా విరాజిల్లుతున్న భద్రేశ్వరుడి సమేతంగా నిత్యం వేలాది మందితో కిటకిటలాడే భద్రకాళి ఆలయానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పర్చాలని భక్తులు కోరుతున్నారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేశంలోని వివిధ ధార్మిక సంస్థలు, పీఠాధిపతులు, స్వామిజీలు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, అధికారులు సైతం అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణకే తలమానికంగా నిలిచిన భద్రకాళి అమ్మవారికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం అప్పటి ప్రభుత్వం బంగారు కిరీటం సమర్పించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 30 కోట్లు నిధులు కేటాయించి మాడవీధుల నిర్మాణం చేపట్టింది. పనులు కొనసాగుతున్నాయి.

ప్రత్యేక కారిడార్

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిరుపతి వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి నాలుగు మాడవీధులు ఉన్నాయి. తమిళనాడులోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అరుణాచలంలో అతి పెద్ద రాజగోపురాలు నిర్మాణమై ఉన్నాయి. దేశంలోని ఈ రెండు క్షేత్రాల నమూనాలో వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి దేవస్థానానికి నాలుగు మాడవీధుల నిర్మాణం కొనసాగుతోంది. రాజగోపురాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారే కాని పనులు ముందుకు సాగడం లేదు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి కారిడార్‌గా గుర్తించాలని భక్తులు కోరుతున్నారు. శనివారం కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి నగరానికి వస్తున్న సందర్భంగా భద్రకాళి ఆలయ సమగ్ర అభివృద్ధికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. రాజగోపురాలతో పాటు ప్రత్యేక అతిథి గృహం, భక్తుల కోసం విశ్రాంతి గృహాలు, కాటేజీల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏళ్లుగా తిష్ట.. జీడబ్ల్యూఎంసీకి అప్రతిష్ట

- పాతుకుపోయిన ఉద్యోగుల ప్రక్షాళనకు కమిషనర్ శ్రీకారం
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టారాజ్యం
- దీర్ఘకాలికంగా ఒకేచోట విధులు
- స్థానచలనంపై ముమ్మరంగా కసరత్తు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీడబ్ల్యూఎంసీని అంటిపెట్టుకుని కాలం వెళ్లదీస్తున్న ఉద్యోగులు ఇకపై బదిలీపై వెళ్లాల్సిందే. దీనిపై కొంత కాలంగా జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో కమిషనర్ ప్రక్షాళన ప్రారంభించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 12 వింగ్‌లలో చాలాకాలంగా పాతుకుపోయిన 4వ తరగతి ప్రభుత్వ, ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను గుర్తించే పనిలో పడ్డారు. కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ యుద్ధ ప్రాతిపదికన సిబ్బందిని గుర్తించి జాబితా సిద్ధం చేశారు. కొద్దిరోజుల్లో కొందరికి స్థానచలనం కలగవచ్చనే భావిస్తున్నారు.

బల్దియాను అడ్డాగా చాలామంది సిబ్బంది తూతూ మంత్రంగా పని చేసి నెలకు ఠంచన్‌గా జీతం తీసుకునేవారు కొందరైతే అసలు కార్యాలయానికి రాకుండా అడ్డదారిలో బయోమెట్రిక్, ఫేస్ ఐడెంటిఫికేషన్ హాజరు వేసుకుని జీతం తీసుకుంటున్నట్టు కమిషనర్‌కు పక్కా సమాచారం అందింది. దీంతో వారం రోజుల నుంచి బల్దియా అడ్డదారి ఉద్యోగుల గుర్తింపుపై ప్రక్షాళన చేశారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ప్రభుత్వ, ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ (పీహెచ్) పబ్లిక్ హెల్త్ వర్కర్లను తన కార్యాలయానికి ఒక్కొక్కరిని పిలుచుకుని పూర్తి వివరాలను సేకరించారు. మరో రెండు రోజులు పాటు కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలకు వెళ్లి అక్కడ కూడా లాంగ్ స్టాండింగ్ ఉద్యోగుల డాటా సేకరించినట్టు ఉద్యోగులు తెలిపారు.

ఎప్పటి నుంచి పని చేస్తున్నారు? ఏ హోదాలో పని చేస్తున్నారు? ఎంత వరకు చదువుకున్నారు? చదువుతో పాటు టెక్నికల్ కోర్సులు ఏమైనా చేశారా? కుటుంబ నేపథ్యంపై వివరాలు సేకరించినట్టు తెలిసింది. పీహెచ్ వర్కర్లుగా విధుల్లో చేరిన వారు కార్యాలయాల్లో ఎందుకు తిష్ట వేశారు? అని ప్రశ్నించి శానిటేషన్ పనులు చేయాల్సి వస్తే వెళ్లాల్సి ఉంటుందని ఏసీ చెప్పినట్టు ఉద్యోగులు తెలిపారు. తాము ఇంత కాలం ఉద్యోగం చేసినా చేయకపోయినా జీతం తీసుకునేది ఇప్పుడు కొత్త పద్ధతి ఏమిటని కొందరు అధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు. కానీ మరి కొందరు బల్దియాలో పాతుకుపోయిన వారిని బయటకు పంపించి వారిని నియమించిన పనిలో విధులు నిర్వర్తించేలా చేస్తే మిగతా సిబ్బందికి పని భారం తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.

పని తక్కువ.. సిబ్బంది ఎక్కువ

జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో పని చేస్తున్న నాలుగో తరగతి ప్రభుత్వ, పీహెచ్ వర్కర్ల హోదాలో పని చేస్తున్న సిబ్బంది ఎక్కడ చూసినా పుట్లకొద్ది కనిపిస్తారు. కొందరు ఏ సెక్షన్‌లో ఏం పని చేస్తారో కూడా అక్కడి అధికారులకు తెలియకపోవడం గమనార్హం. పీహెచ్ వర్కర్లుగా అడ్డదారిలో నియామకమైనవారితో పాటు 452 మందిలో చాలా మంది ఇక్కడే విధులు నిర్వర్తిస్తారని తెలిసింది. నగరంలో శానిటేషన్ పనుల కోసం ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తే ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల అండదండలతో కొందరు ఇక్కడే అడ్డా పెట్టి ప్రతీ నెల జీతం పుచ్చుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.



ఇక పబ్లిక్‌హెల్త్ విభాగంలో 20మందికి పైగా పని చేయడం చూసి అదనపు కమిషనర్ సైతం అవాక్కయ్యారు. ఎవరు ఏం పని చేస్తున్నారు? అని అడిగితే స్పష్టమైన సమాధానం రాకపోవడంతో ఇంత కాలం బల్దియా ఎంత నష్టపోయింది అని ఓ అంచనాకు వచ్చినట్టు తెలిసింది. ఇంకా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, హార్టికల్చర్, డెత్, బర్త్ సెక్షన్, ఐటీ, ఎల్‌వో కార్యాలయం, ఇన్‌వార్డు, ఔట్‌వార్డు, పౌరసేవా కేంద్రం, అటెండర్లు, స్వీపర్లు, వాచ్‌మెన్‌లతో పాటు ఆర్ఐలు, ఆర్‌వోలు, వార్డ్ ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్ల వద్ద పనిచేసే అసిస్టెంట్లుగా పని చేస్తున్నారు.

అంతేకాకుండా కలెక్టర్ బంగ్లా, కమిషనర్ క్యాంపు ఆఫీస్, కొందరు కార్పొరేటర్ల ఇళ్లలో పనివాళ్లుగా ఉన్నారు. ఇంకా ఇంజనీర్లు, బల్దియా అధికారుల ఇండ్లలో పని మనుషులు, కారు డ్రైవర్లు, తోటమాలీలుగా పని చేయడంతో శానిటేషన్ విభాగంలో తక్కువ కావడంతో పని ముందుకు సాగడం లేదు. మొత్తంగా 500 మందికి పైగా పీహెచ్ వర్కర్ పనులను ఇతర పనులు చేస్తున్నట్టు గుర్తించినట్టు అధికారులు వెల్లడించారు. 70మంది జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం, 55 మంది కాశిబుగ్గ సర్కిల్, 52 మంది కాజీపేట సర్కిల్ కార్యాలయంలో (పీహెచ్) వర్కర్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దర్జాగా పని చేస్తున్నట్టు తెలిసింది. వీరిని త్వరలో మాతృస్థానానికి తరలిం

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హవా..

చాలా కాలంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలో పని చేస్తూ చక్రం తిప్పుతున్నట్టు కమిషనర్ దృష్టికి రావడంతో అందరినీ అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఓ కంప్యూటర్ ఆపరేటర్ సంబంధిత ఉన్నత స్థాయి అధికారికి ఆదాయమార్గంగా ఏర్పడి పర్మినెంట్ ఉద్యోగులను సైతం చీవాట్లు పెట్టిస్తున్నాడు. అంతే కాకుండా అందిన కాడికి దండుకుని ఇళ్ల అనుమతులు జారీ చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

అలాగే టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులకు సైతం డబ్బు ఆశ చూపిస్తూ అక్రమ ఇళ్ల నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నట్టు తెలిసింది. ఇంకా ఐటీ సెక్షన్‌లో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి పూర్తి బాధ్యతలు అప్పగించి బల్దియా డాటా మొత్తం అప్పగించడం వివాదాస్పదంగా మారింది. ఇంకా ఎల్‌వో కార్యాలయంలో ఓ వ్యక్తి మంచి భూములను కాస్త వివాదాస్పదం చేసి అందినకాడికి దండుకుంటున్నట్టు తెలిసింది.

సామాజిక న్యాయ పితామహుడు ఫూలే

వరంగల్ లీగల్: అణగారిన వర్గాల కోసం సమానత్వాన్ని కోరుకున్న సామాజిక న్యాయ పితామహుడు ఫూలే అని హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ అన్నారు. ఫూలే 135వ వర్ధం తి సందర్భంగా హనుమకొండ బార్ అసోసియేషన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ.. జ్యోతిరావుపూ లే స్ఫూర్తితో సంఘ పరివర్తన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అంబేద్కర్, వెంకటేష్, న్యాయవాదులు గుడిమళ్ల రవికుమార్, గంధం శివ, సాయిని నరేందర్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, వేముల రమేష్, ప్రభాకర్, సుందర్‌రాం, కృష్ణస్వామి, దండు మోహన్ పాల్గొన్నారు.



హనుమకొండలో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

పంచాయతీ ఎన్నికలకు 6 క్లస్టర్లు

» రెండో దశ నవంబరు 30 నుంచి నామినేషన్ల స్వీకరణ
» వివరాలు వెల్లడించిన ఎంపీడీవో సుమనవాణి

హసన్‌పర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ 2వ దశ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్టు ఎంపీడీవో సుమనవాణి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వివరాలను ఆమె వెల్లడించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ల స్వీకరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి 6 క్లస్టర్లుగా విభజించి ఆయా క్లస్టర్ పంచాయతీ గ్రామాలలో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. అనంతసాగర్ క్లస్టర్ గ్రామ పంచాయతీలో అనంతసాగర్, జయగిరి, మడిపల్లి గ్రామాల పంచాయతీ అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. అలాగే సీతంపేట క్లస్టర్ గ్రామ పంచాయతీలో సీతంపేట, గంటూర్‌పల్లి, పెంబర్తి, నాగారం క్లస్టర్ గ్రామ పంచాయతీలో నాగారం, సీతనాగారం, సూదన్‌పల్లి, సిద్దాపూర్ క్లస్టర్ గ్రామ పంచాయతీలో సిద్దాపూర్, హెచ్‌సీఎన్ తండా, భైరాన్‌పల్లి, మల్లారెడ్డిపల్లి క్లస్టర్ గ్రామ పంచాయతీలో మల్లారెడ్డిపల్లి, కొత్తపల్లి, అర్వపల్లి గ్రామాలకు సంబంధించిన పంచాయతీ ఎన్నికల నామినేషన్లు స్వీకరిస్తారని ఎంపీడీవో సుమనవాణి వెల్లడించారు.

తుఫాన్ బాధితులకు సర్కారు బాసట

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


వరద బాధితులకు రేషన్ బియ్యాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వడ్డేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన 272 వరద బాధితులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్‌తో కలిసి రేషన్ బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఎంఆర్ఐ దశరథరామిరెడ్డి, హనుమకొండ మాజీ జడ్పీటీసీ గంటా నరేందర్ రెడ్డి, 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు, కాంగ్రెస్ శ్రేణులు కందుకూరి పూర్ణచందర్, వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, దూలం పెద్ద రాజు గౌడ్, రుద్రోజు మణీంద్రనాథ్ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి : వరద బాధితులను ఆదుకుంటామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ 57వ డివిజన్ వాజ్‌పాయ్ కాలనీలో తుఫాన్ వరదల ప్రభావంతో దెబ్బతిన్న 55 కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌బియ్యాన్ని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం అందజేశారు ఈ కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఎంఆర్ఐ దశరథరామిరెడ్డి, టీపీసీసీ నేత ఈవీ శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

'గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలివ్వాలి'

కరీమాబాద్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): గుడిసెవాసులకు వెంటనే ఇళ్ల పట్టాలివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఉర్సు గుట్ట వద్ద గల రామసురేందర్ భవనంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా ఇండ్లు నిర్మించి గుడిసెలు లేని నగరంగా చేస్తానని హామీ ఇచ్చి పది సంవత్సరాలు అధికారంలో ఉండి మోసం చేసిందని అన్నారు. 2023 ఎన్నికలకు ముందు ఇదే హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర్ఎస్ బాటలో నడుస్తోందని విమర్శించారు. నగరంలో అనేక ప్రభుత్వ భూములను ధనవంతులు ఆక్రమించుకొని దర్జాగా బిల్డింగులు కట్టుకుంటే చూస్తూ ఊరుకున్న ప్రభుత్వాలు పేద ప్రజల గుడిసెలకు మాత్రం పట్టాలు ఇవ్వట్లేదని అన్నారు. వరంగల్, హన్మకొండ, వర్ధన్నపేట ప్రాంతాలలో ఉంటున్న గుడిసెవాసులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

వడ్డేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 60వ డివిజన్ టీచర్స్‌కాలనీ ఫేస్-1 కమ్యూనిటీ హాల్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పింగిళి రామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హోమియో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వడ్డేపల్లి హోమియో డిస్పెన్సరీ డాక్టర్ రజిత, ఆయుష్ జిల్లా కన్వీనర్ డాక్టర్ భానుకుమార్ రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ ఫేస్-1 అభివృద్ధి కమిటీ ప్రతినిధులు డాక్టర్ ఇమ్మడి పుల్లయ్య, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, పింగిళి స్వరూపరాణిరెడ్డి, కనకదుర్గా కాలనీ కార్యదర్శి దేశెట్టి నారాయణరావు, డాక్టర్ మల్లిక, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఫూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

» పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
» మహాత్మా జ్యోతిరావుకు ఘన నివాళి


డీసీసీ భవన్‌లో ఫూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

హనుమకొండ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు ఫూలే ఆశయాల సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఫూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి రాజేందర్‌రెడ్డి తదితర నేతలు ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళతో పాటు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, తాడిశెట్టి విద్యాసాగర్, టి.మనోహర్, తోట కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఫూలే

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్ : అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా ఫూలే అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా ఫూలే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపేది చదువేనని చాటిచెప్పి, చదువులు చెప్పిన వ్యక్తి మహాత్మా జ్యోతిబా ఫూలే అని అన్నారు. వారి ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వినయ్ భాస్కర్ తదితరులు



కాజీపేటలో ఫూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- **కాజీపేట:** కాజీపేట డీజిల్‌కాలనీ చౌరస్తాలో, బాపూజీనగర్ చౌరస్తాలో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతి నిర్వహించారు. జ్యోతిరావుఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, నాయకులు పసునూరి మనోహర్, సిరిల్ లారెన్స్, గబ్బెట ఎల్లేశ్, శ్రీనివాస్, బాదావత్ రాము, కె. రమేశ్, దొంగల కుమార్, అజ్గర్, సిలువేరు విజయ భాస్కర్ పాల్గొన్నారు.
- **కేయూ క్యాంపస్:** మహాత్మాజ్యోతిరావు ఫూలే 135వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేయూ దూరవిద్య కేంద్రం వద్ద ఫూలే దంపతులు విగ్రహాలను పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ సురేశ్‌లాల్, చిర్రా రాజు, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, స్వర్ణలత, రాజేశ్, సతీష్, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.
- **వడ్డేపల్లి:** మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతిని శుక్రవారం హనుమకొండలోని వివిధ డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండ వడ్డేపల్లిలోని జైభీం జిల్లా కార్యాలయంలో జ్యోతిరావుఫూలే చిత్రపటానికి జైభీం యూత్ రాష్ట్ర కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైభీం యూత్ జిల్లా ప్రతినిధులు తాళ్లపెల్లి ప్రసన్న, భాస్కర్, రాజ్‌కుమార్, దుప్పటి కోటి, ప్రశాంత్, పవన్, మధు, తదితరులు పాల్గొన్నారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో జ్యోతిబాఫూలే వర్ధంతిని హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఫూలే చిత్రపటానికి బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అమరవాది సారంగపాణి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు అలుగునూరి కృష్ణంరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బహుజన్ సమాజ్‌పార్టీ (బీఎస్పీ) వడ్డేపల్లి ప్రశాంత్‌నగర్‌లోని జిల్లా కార్యాలయంలో ఫూలే వర్ధంతి నిర్వహించారు. మహాత్మాజ్యోతిరావుఫూలే చిత్రపటానికి బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్, వరంగల్ జోనల్ ఇన్‌చార్జి పైనాల కార్తీక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బస్కే నాగరాజు, నాయకులు బొట్ల భరత్, మరుపట్ల నవీన్, పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కేయూలో నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు


వడ్డేపల్లిలో ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జైభీం నేతలు

కమ్యూనిస్టులను ఎన్నుకోండి

ఖిలావరంగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ చేసి గెలవాలనుకునే వారిని ఓడించి కమ్యూనిస్టులను ఎన్నుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం శివనగర్ తమ్మెరభవన్‌లో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతూ ప్రజల గొంతుకగా నిలిచిన కమ్యూనిస్టులకు అవకాశం ఇవ్వాలని కోరారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్న పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఎస్కే బాషుమియా, అక్కపల్లి రమేష్, మేకల రవి, దండు లక్ష్మణ్, గుండే బద్రి, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, వీరగోని శంకరయ్య, సంగి ఏలేందర్, ఐతే యాకయ్య, ఓర్సు రాజు, ల్యాదళ్ల శరత్, పార్థసారథి, తాళ్లపెల్లి రహేలా, జనున్న రవి, పరికరాల రమేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు


ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య సభ్యులు

సమస్యలు పరిష్కరించాలి

- **మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగసుధ**

గిర్మాజిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.రాగసుధ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె ఆధ్వర్యంలో సమాఖ్య మహిళలు కె.సంధ్య, యమున, పి.లలిత, బి.భారతి, పి.మంజుల, జె.కోమలతో కూడిన బృందం ఆస్పత్రిని సందర్శించారు. బాలింతలు, గర్భిణులు, అధికారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రిని 60 నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఆమేరకు వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆస్పత్రి సిబ్బంది రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, అధికారులు వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో తగిన సిబ్బంది, వైద్య పరికరాల కొరత ఉందని, ఈ విషయంలో ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఊపందుకున్న నామినేషన్లు

(5వ పేజీ తరువాయి)

దాఖలయ్యాయి. మొత్తం 69 సర్పంచ్ స్థానాలకు శుక్రవారం వరకు 170, 61వార్డు స్థానాలకు 291 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

కమలాపూర్ అభ్యర్థిగా పబ్బు సతీశ్

కమలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీకి బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా పబ్బు సతీష్‌ను ఏకగ్రీవంగా ప్రతిపాదించినట్లు బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కమలాపూర్‌లోని తన నివాసంలో శుక్రవారం సర్పంచ్, వార్డు సభ్యుల పోటీదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాపూర్‌లో పలువురు పోటీదారులకు నచ్చజెప్పి విరమింపజేసి, సతీశ్‌ను అభ్యర్థిగా నిర్ణయించారు.

డీసీసీ అధ్యక్షుడికి అభినందనల వెల్లువ

మడికొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన ఇనగాల వెంకట్రాంరెడ్డిని టీచర్స్ కాలనీలోని నివాసంలో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేఆర్. దిలీప్ రాజ్ , జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గుర్రం జ్యోతి అమర్‌నాథ్, రుగ్వేద్ తదితరు లు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ఇనుగాలను కలిసిన మార్నేని

హనుమకొండ సిటీ : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన ఇనుగాల వెంకట్రాంరెడ్డిని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు.


వెంకట్రాంరెడ్డికి బొకే ఇస్తున్న రవీందర్‌రావు

అమ్మవారి సన్నిధిలో బీసీ వెల్ఫేర్ కమిషనర్

వరంగల్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి అమ్మవారిని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమిషనర్, ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఐఏఎస్ అధికారిణి బి.బాల మాయాదేవి శుక్రవారం దర్శించుకున్నారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆమెకు ఆలయ స్తపన మండపంలో ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోతుక్కారి మయూరితో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని పంచాయతీలలో బీజేపీ అభ్యర్థుల పోటీ

హసన్‌పర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 15 పంచాయతీ గ్రామాలలో సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు పోటీలో ఉంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమన్వయ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. 15 పంచాయతీ గ్రామాల్లో అన్ని స్థానాల్లో బీజేపీ నుంచి అభ్యర్థులు పోటీ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోటీ చేయదలచిన ఆశావహ అభ్యర్థులకు ఎన్నికల వ్యూహం, ప్రజలతో అనుసంధానం, ప్రచారం వంటి అంశాల్లో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అన్ని గ్రామాలలో ప్రత్యేకంగా గ్రామ ఇన్‌చార్జులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ రేణికుంట్ల సునీతరాజు, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, రైల్వే బోర్డు మెంబర్ దాసరి రాజు, పింగిళి ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శివకుమార్

ఉపాధ్యాయ వృత్తికే మచ్చ తెచ్చాడు..

» తండ్రి పేరును వేర్వేరుగా చూపుతూ ప్రభుత్వ ఖజానాకు గండి
» విభావిని విద్యా సమితి కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

బాలసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వివిధ సందర్భాల్లో వేర్వేరుగా తండ్రిపేర్లను చూపుతూ ప్రభుత్వం, న్యాయస్థానం, సమాజాన్ని మోసం చేస్తున్నాడని, అతడిపై కలెక్టర్, విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని విభావిని విద్యా సమితి కార్యదర్శి కటంగూరి సత్యనారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు.

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వ్యక్తి విద్యాశాఖ రికార్డులో తండ్రి పేరు వెంకట్‌రెడ్డి గా, ఎడ్యుకేషనల్ సొసైటీలో తన తండ్రి పేరు సంజీవరెడ్డిగా పేర్కొన్నారని తెలిపారు. టీచర్‌గా తన తండ్రి పేరు వెంకటరెడ్డిగా పేర్కొని స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తన వ్యవసాయ భూములకు తండ్రి పేరు సంజీవరెడ్డితో ప్రభుత్వం నుంచి రైతు బంధు నిధులను పొందుతున్నాడని వివరించారు. 30 ఏళ్లుగా కోర్టులో తప్పుడు అఫిడవిట్లతో ఎడ్యుకేషనల్ ట్రస్టులో భాగస్థులమైన తమను ఆర్థికంగా, మానసికంగా కుంగదీస్తూ నష్టం కలిగిస్తున్నాడని విచారం వ్యక్తం చేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

తమ ఫిర్యాదులను పట్టించుకోకుండా సదరు ఉపాధ్యాయుడికి జీతభత్యాలు చెల్లించడంతో పాటు ప్రమోషన్ కూడా ఇచ్చారని తెలిపారు. అతడు గత అక్టోబరు 31న ఉద్యోగ విరమణ పొందగా 3 నెలల ముందుగానే, తనపై ఎలాం టి పెండింగ్ కేసులు లేవని లిటిగేషన్ సర్టిఫికెట్‌ను, నోడ్యూ సర్టిఫికెట్‌ను పొంది హైదరాబాద్‌లోని అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి పింఛన్ మంజూరు చేయించుకున్నాడని వివరించారు. జఫర్‌గడ్ ఎంఈవో, క్లస్టర్ హెచ్ఎం సర్వీస్ నిబంధనలను పాటించకుండా అతడికి సహకరించారని తెలిపారు. అతడి జీత భత్యా లు, రైతు బంధు తదితర రాయితీల రూపంలో రూ.లక్షలాది నిధులను దుర్వినియోగం చేసినందున సమగ్ర విచారణ జరిపి నిజనిర్ధారణచేసి తక్షణం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సత్యనారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు.

మేకప్



వినోదాల్లో వెలిగిపోవాలంటే

విందులు, వినోదాలు మన జీవితంలో భాగాలు. అలాంటి వేడుకలకు హాజరయ్యేటప్పుడు సహజసిద్ధ అందం ఉట్టిపడే మేకప్‌ను ఎంచుకోవాలి. అందుకోసం ఇదిగో ఇలాంటి చిట్కాలు అనుసరించాలి.

మిరుమిట్లు గొలిపే లైట్లకు తగ్గట్టు...

మేకప్ ముందు మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్‌లను అప్లై చేసుకోవాలి. ఈ రెండింటితో చర్మం పొడిబారకుండా ఉండడంతో పాటు, వేడుకల్లో లైట్ల వెలుగుకు కమిలిపోకుండా చర్మానికి రక్షణ దక్కుతుంది.

ఫ్లాష్ వెలుగుల్లో...

వేడుకల్లో తీసే ఫ్లాష్ ఫొటోల్లో ముఖం అవసరానికి మించి వెలిగిపోకుండా ఉండాలంటే, రెండు భిన్నమైన ఫౌండేషన్లు...మ్యాట్, సాఫ్ట్ గ్లోయీ ఫౌండేషన్లను కలిపి అప్లై చేసుకోవాలి. జిడ్డు చర్మమైతే, నుదురు, ముక్కు, చుబుకం మీద మ్యాట్ ఫౌండేషన్, మిగతా ముఖం మొత్తం డ్యూయీ ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి. తర్వాత లూజ్ పౌడర్ అద్దుకోవాలి.

బ్లష్ కీలకం

పగటి వేళ వేడుకలకు హాజరయ్యేటప్పుడు ముదురు రంగు బ్లష్‌లకు బదులుగా, సహజసిద్ధంగా కనిపించే న్యాచురల్ లేదా రోజీ బ్లష్ ఎంచుకోవాలి. బుగ్గలతో పాటు, కొద్దిగా ముక్కు, చుబుకం మీద కూడా లైట్‌గా బ్లష్‌ను అద్దుకోవాలి.

ఐ షాడో ఇలా...

ముఖం మొత్తంలో కళ్లు, పెదవులే ఎక్కువగా ఆకట్టుకుంటాయి. కాబట్టి వాటి మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. పగలైనా, రాత్రైనా ముదురు రంగు షాడోలకు దూరంగా ఉండాలి. పేస్టెల్, సాఫ్ట్ మెటాలిక్ ఐ షాడోలనే ఎంచుకోవాలి. ముడతలు పడకుండా ఉండడం కోసం క్రీమీ షాడోలకు బదులుగా పౌడర్ ఐ షాడోలనే ఎంచుకోవాలి. పౌడర్ ఐ షాడోలు మేకప్‌లో చక్కగా కలిసి పోయి, ఎక్కువ సమయం పాటు నిలిచి ఉంటాయి.

లవ్లీ లిప్‌స్టిక్

ఎరుపు, ప్లమ్, మెరూన్ మొదలైన రంగు లిప్‌స్టిక్స్ వేడుకలకు బాగుంటాయి. అలాగే ఐ షాడోకు మ్యాచ్ అయ్యే లిప్‌స్టిక్ ఎంచుకోవడం మర్చిపోకూడదు. గ్లిట్టర్, పేస్టెల్, మోనోటోన్ రంగు లిప్‌స్టిక్స్ పగటి వేడుకలకు సూటవుతాయి. మెటాలిక్, ముదురు రంగు షేడ్స్ రాత్రి వేడుకలకు మ్యాచ్ అవుతాయి.

ఆకలి బాధలు తట్టుకుంది. అవమానాలను భరించింది. అంధురాలనే వెక్కిరింతలు.. హేళనలకు భయపడి ఆగిపోకుండా ముందడుగు వేసింది. కష్టాలను అధిగమించి, కన్నీళ్లను దిగమింగి తనకు ఆసక్తి ఉన్న క్రికెట్‌ను కెరీర్‌గా మార్చుకుంది. 'అంధురాలివి నీకెందుకు ఆటలు ఒక మూలన కూర్చోక' అని వెక్కిరించిన వాళ్లకు తానేంటో నిరూపించింది. దేశానికి తొలి మహిళల అంధుల వరల్డ్‌కప్‌ను అందించి సామాన్యుల నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు అందరి ప్రసంశలను అందుకుంటున్న భారత జట్టు కెప్టెన్, రాయలసీమ అమ్మాయి దీపిక 'నవ్య'తో పంచుకున్న విశేషాలు.

విజయ దీపిక



"మాది సత్యసాయి జిల్లా, మడకశిరలోని తంబలహట్టి అనే చిన్న గ్రామం. అమ్మ చిట్టమ్మ, నాన్న తిమ్మప్ప వ్యవసాయ కూలీలు. ముగ్గురు సంతానంలో నేను పెద్దమ్మాయిని. నాకు ఇద్దరు తమ్ముళ్లు. మాకు రెండెకరాల భూమి ఉంది కానీ, నీళ్ల సదుపాయం లేక పోవడంతో సాగు చేసే అవకాశం లేక అమ్మనాన్న కూలీలుగా మారారు. నాకు ఐదు నెలలప్పుడు కంటిలో నా చేతి వేలితో పొడుచుకోవడంతో బొబ్బ వచ్చింది. అది తగ్గకపోవడంతో నాన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చూసి ఇప్పుడు సర్జరీ చేయడం కుదరదు. పదేళ్ల నిండాక శస్త్రచికిత్స చేద్దామని చెప్పారు. నా వయసుతో పాటు కుడి కంటిలో ఆ బొబ్బ కూడా పెరిగి చూపు పోయింది.

బడిలో కలవనిచ్చేవారు కాదు..

బడిలో నన్ను అందరితో పాటు కలవనిచ్చేవారు కాదు. ఆటలు ఆడనిచ్చే వారు కాదు. "గుడ్డిదానివి. పోయి ఒక పక్కన కూర్చో" అనేవారు. ఇంటికి వచ్చి అమ్మకు చెప్పేదాన్ని. "బాధ పడకు. బాగా చదువుకో. దేవుడే నీకు దారి చూపిస్తాడు" అని అమ్మ ఓదార్చేది, ధైర్యం చెప్పేది. మా పొలంలో బోర్లు వేసేందుకు, కూలీ పనులు లేకపోవడంతో కుటుంబాన్ని పోషించేందుకు నాన్న అప్పులు చేశారు. అవి తిరిగి చెల్లించలేకపోవడంతో అప్పు ఇచ్చిన వారు మా ఇంటిపైకి వచ్చి గొడవ చేసేవారు. వారి మాటలు భరించలేక నాన్న పక్క ఊరిలో పగలంతా పని చేసేవారు. రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చి, మాకు తినడానికి రాగులు, బియ్యం ఇచ్చేవారు. మళ్లీ ఆ చీకట్లోనే వెళ్లిపోయే వారు. నాన్న ఇంటికి రాని రోజు మేము పస్తులు ఉండాల్సి వచ్చేది. మా ఊర్లో పండ్ల చెట్లు వెతుక్కొనే వాళ్లం. ఆకలి భరించలేక సగం కుళ్లిన పండ్లు కూడా తినేవాళ్లం. అన్నం వండిన రోజు కూడా సరిపోక నేను, తమ్ముడు కొట్టుకొనేవాళ్లం. సరైన దుస్తులు లేక చిరిగినవి, పాడైనవి వేసుకొనేవాళ్లం. పదేళ్ల నిండాక నాకు ఆపరేషన్ చేయించేందుకు నాన్న రూ.2 లక్షలు అప్పు చేశారు. వైద్యులు సర్జరీ చేసినా చూపు వస్తుందని హామీ ఇవ్వలేమన్నారు. అప్పుడు "ఆపరేషన్ చేయించి డబ్బులు వృధా చేయొద్దు నాన్నా.. నాకు ఇలా బతకడం అలవాటు అయిపోయింది" చెప్పా. ఆ మాటలకు నాన్న గుండెలు పగిలేలా రోధించారు. అంత దయనీయమైన జీవితం గడిపిన నాకు క్రికెట్ కొత్త బతుకును ఇచ్చింది.

క్రికెట్ మలుపు తిప్పింది..

కర్ణాటకలోని తుమ్ముకూర్‌లో ఉన్న శివకుమార్ స్వామిజీ స్కూల్‌లో అంధులకు ఉచితంగా చదువు చెబుతారని తెలిసి.. అమ్మా నాన్నా నన్ను అక్కడ చేర్పించారు. స్కూల్‌లో మంచి భోజనం పెట్టి, బాగా చూసుకొనే వారు. అయితే, అన్నం తింటున్నప్పుడల్లా తమ్ముళ్లు ఏం తింటున్నారోనని గుర్తొచ్చి బాగా ఏడ్చేదాన్ని.. స్కూల్‌లో టీచర్ల ప్రోత్సాహంతో పదో తరగతి నుంచి క్రికెట్ ఆడడం ప్రారంభించా. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌కు అంధ మహిళల జట్టు ఉండేది కాదు. దాంతో కర్ణాటక జట్టు తరఫున ఆడడం ప్రారంభించా.

ప్రధాని తండ్రిలా మాట్లాడారు

ప్రధాని నరేంద్ర మోదీతో గత గురువారం జరిగిన 45 నిమిషాల ఇష్టాగోష్ఠిలో ఆయన ఒక కుటుంబ పెద్దలా, తండ్రిలా మాట్లాడారు. మా వ్యక్తిగత నేపథ్యాలను, జీవిత విశేషాలను అడిగి తెలుసుకున్నారు. నేను పాటలు బాగా పాడతానని తెలిసి, నన్ను పాడమని అడిగారు. నేను శివుడి భక్తి గీతం ఒకటి పాడి వినిపిస్తే. బాగా పాడావని అభినందించారు. వరల్డ్‌కప్‌లో ఎదురైన సవాళ్ల గురించి, పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో మా ఆట గురించి అడిగి తెలుసుకున్నారు. మా అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



2019లో జాతీయ అంధుల క్రికెట్ బోర్డు ఏర్పడిన తర్వాత మాకు ఆడేందుకు ఒక వేదిక దొరికింది. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటడంతో 2023లో జాతీయ జట్టులో స్థానం లభించింది. అదే ఏడాది బర్మింగ్‌హామ్‌లో జరిగిన అంధుల వరల్డ్ గేమ్స్‌లో క్రికెట్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో నేను సభ్యురాలిని. సమర్థానం ట్రస్టు వారి డిగ్రీ కళాశాలలో పరిచయమైన సీనియర్ అన్న మోహన్ నన్ను బాగా ప్రోత్సహించారు. రెండేళ్ల తిరిగేసరికి నా ప్రతిభను గుర్తించి టీమిండియాకు కెప్టెన్ చేశారు. నా సారథ్యంలో భారత జట్టుకు తొలి మహిళల టీ-20 వరల్డ్‌కప్ అందించడం చాలా గర్వంగా ఉంది. ఒక మారుమూల గ్రామంలో మొదలైన నా ప్రయాణం, ఈ స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉంది.

ప్రభుత్వం చేయూత ఇవ్వాలి..

నేను ప్రస్తుతం ముంబైలో ఇన్‌కమ్‌టాక్స్ విభాగంలో రూ.25 వేలకు ఉద్యోగం చేస్తున్నా. నా ఖర్చులకు కూడా ఆ డబ్బు సరిపోవడం లేదు. ఇప్పటికీ మా కుటుంబం కోసం చేసిన అప్పులను నాన్న తీరుస్తూనే ఉన్నారు. ఇన్ని కష్టాల్లో కూడా క్రికెట్ పైన ఉన్న మక్కువ, దేశంపై ఉన్న ప్రేమతో కష్టాలను దిగమింగి వరల్డ్‌కప్ సాధించా. నాలాంటి అంధ క్రికెటర్లను ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు ప్రోత్సహిస్తే మాకు జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల మరింత పెరుగుతుంది."

• ఎస్.ఎస్.బి.సంజయ్

భోజన కుతూహలం

అవిసెపూలతో అన్నీ అద్భుతాలే

అవిసె చెట్లు మనకు అరుదుగా కనిపిస్తూ ఉంటాయి. కానీ అవిసె పూలు ఆరోగ్యాన్ని మేలు చేసేవని చాలా మందికి తెలియదు. అవిసెకు ఉన్న మరో పేరు 'అగస్త్య'. అగత్యం అంటే తప్పనిసరి అని అర్థం. అందుకే అవిసె పూలను ఏదో ఒక రూపంలో తీసుకోవటం అగత్యమనే చెప్పాలి. శరీర ధాతువుల్ని పోషించి, వృద్ధాప్యం కలగకుండా ఆయుష్షుని పెంచే రసాయన చికిత్సా విధానానికి పితామహుడు అగస్త్యుడు. ఆయన పేరుతో పిలిచిన మొక్కే అవిసె. ఈ పూలు పెద్దవిగా, మృదువుగా, చిలక ముక్కు ఆకారంలో ఉంటాయి. కొద్దిగా వగరుగా తియ్యగా ఉంటాయి. అవిసె మొక్కలు వేగంగా పెరిగి పూతకొస్తాయి. ఇంట్లో పూలకుండీల్లో కూడా పెంచుకోవచ్చు. ఇంటి ముందు అవిసెమొక్క నాటితే చెడు దృష్టి పోతుందని చాలామంది నమ్ముతారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ ఏకాదశి వ్రతం చేసి ద్వాదశి నాడు అవిసె పూలతో వంటలు చేసుకుంటారు.



- బాగా వికసించిన అవిసె పూలు మైగ్రేన్ తలనొప్పిని తగ్గించటంలో కీలకపాత్ర పోషిస్తాయి.
- కఫంవల్ల వచ్చే జ్వరాలు.. ఒకసారి పట్టుకుంటే వదలని పడిసెభారాలను వదిలిస్తాయి.
- కడుపు నొప్పిని, పేగుపూతను తగ్గిస్తాయి. కాలేయ సమస్యలకు అవిసె పూలు మంచి మందు. కడుపులో పెరిగే నులి పురుగులను వెళ్లగొడతాయి.
- రక్తహీనతను పోగొట్టడంలో ఇవి మేలు చేస్తాయి. విషదోషాలను తరిమేస్తాయి.
- అవిసె పూలకు వేడిని తగ్గించే గుణం ఉంది.
- అవిసెపూలని ఏదైనా కూరగాయతో కలిపి కలగూరగా వండుకోవచ్చు. పప్పుగా వండుకోవచ్చు. రోటి పచ్చడిగా కూడా చేయవచ్చు.
- ఉడికించిన అవిసెపూలని నానిన మినపప్పు లేదా పెసరపప్పుతో కలిపి కలిపి రుబ్బి దోసెలు, మసాలా వడల్లాంటివి వేసుకోవచ్చు. పకోడీలు కూడా చేసుకోవచ్చు. వీటిని కొబ్బరితో కలిపి వండితే చాలా రుచికరంగా ఉంటాయి.
- థాయ్‌లాండ్‌లో వీటితో సూప్ కూడా చేసుకుంటారు.

• గంగరాజు అరుణాదేవి

పాలు పొంగకుండా ఇలా

పాలను వేడిచేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ ఒక్కోసారి అవి పొంగిపోతుంటాయి. దీంతో పాలు వృథా కావడమే కాదు స్టవ్, ప్లాట్‌ఫామ్ శుభ్రం చేయాల్సి వస్తుంది. అలాకాకుండా ఉండాలంటే.. పాలు కాచేటప్పుడు కొన్ని టిప్స్ పాటిస్తే సరి.

- పాలు కాచడానికి వెడల్పాటి గిన్నె లేదా లోతు ఎక్కువగా ఉన్న గిన్నెను తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది.
- చాలామంది గిన్నెలో పాలు పోసిన తరువాత అందులో నీళ్ల కలుపుతూ ఉంటారు. అలా కాకుండా స్టవ్ మీద గిన్నె పెట్టి కొన్ని నీళ్ల పోసి అవి వేడెక్కిన తరువాత అందులో పాలు పోయాలి. దీనివల్ల పాలు పొంగకుండా చక్కగా మరుగుతాయి.
- స్టవ్ మీద పాల గిన్నె పెట్టిన తరువాత దాని అంచులకు కొద్దిగా వెన్న లేదా నెయ్యి రాస్తే పాల పొంగు కిందికి జారదు.
- పాలు కాస్తున్నప్పుడు నురగ వేగంగా పైకి వస్తూ ఉంటే దాని మీద కొన్ని నీళ్ల చిలకరిస్తే సరిపోతుంది.



- పాలను మరిగించేటప్పుడు.. గిన్నె మీద అడ్డంగా చెక్క గరిటె పెట్టినా, అందులో ఒక పెద్ద స్టీల్ చెంచా లేదా గరిటె పెట్టినా పాలు పొంగవు.
- పాలు మరుగుతున్నప్పుడు పైన మందపాటి పొర ఏర్పడుతూ గిన్నె అంచుల వరకూ వచ్చేస్తూ ఉంటుంది. అలాంటప్పుడు ఒక చెంచాతో పాలను కలిపితే అవి పొంగకుండా ఉంటాయి. ఈ పొర మీద ఒక చుక్క నెయ్యి వేసినా కూడా ప్రయోజనం కనిపిస్తుంది.
- పాలు మరుగుతున్నప్పుడు అందులో చిటికెడు వంటసోడా కలిపితే అవి పొంగవు. ఎక్కువ సేపు తాజాగా ఉంటాయి కూడా.
- పాలను కాచేటప్పుడు పెద్ద మంట కాకుండా మధ్యస్థాయి లేదా చిన్న మంట ఉండేలా చూసుకుంటే ఈ సమస్య రాదు.

వంటిల్లు



బాగా చలిగా ఉన్నప్పుడు వేడివేడిగా ఓ కప్పు సూప్ తాగితే హాయిగా అనిపిస్తుంది. శరీరాన్ని వెచ్చగా ఉంచడంతోపాటు చలికాలంలో ఏర్పడే ఎన్నో ఆరోగ్య సమస్యలను నివారించడలో సూప్‌లు ప్రధాన పాత్ర పోషిస్తాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే విభిన్నమైన సూప్‌ల తయారీ మీకోసం.

చలికాలంలో వేడి వేడిగా

బ్రోకలీ ఆల్మండ్ సూప్

కావాల్సిన పదార్థాలు: ఆలివ్ ఆయిల్- రెండు చెంచాలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, కొత్తిమీర కాడలు- నాలుగు, వేడినీళ్లు- ఆరు కప్పులు, ఉప్పు- తగినంత, బాదం పలుకులు- 20, బ్రోకలీ ముక్కలు- రెండు కప్పులు, మిరియాల పొడి- ఒక చెంచా, ఫ్రెష్ క్రీమ్- రెండు చెంచాలు

తయారీ విధానం : స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి ఆలివ్ ఆయిల్ వేసి వేడిచేయాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి తరుగు వేసి కలపాలి. ఆపైన కొత్తిమీర కాడలను సన్నగా తరిగి వేయాలి. వీటిని పెద్దమంట మీద రెండు నిమిషాల పాటు వేయించాలి. తరువాత వేడి నీళ్ల పోసి, ఉప్పు వేసి మరిగించాలి. అందులో బాదం పలుకులు, బ్రోకలీ ముక్కలు వేసి గిన్నె మీద మూత పెట్టి అయిదు నిమిషాలు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. గిన్నెలో మిశ్రమం చల్లారిన తరువాత మిక్సీలో వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని స్ట్రెయినర్‌తో మరో గిన్నెలోకి వడబోయాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టి అందులోని మిశ్రమం వేడయ్యేవరకూ గరిటెతో తిప్పుతూ ఉండాలి. చివరగా మిరియాల పొడి వేసి కలిపి ఉప్పు సరిచూసుకుని స్టవ్ మీద నుంచి దించాలి. ఈ బ్రోకలీ ఆల్మండ్ సూప్‌ను ఫ్రెష్ క్రీమ్‌తో వేడిగా సర్వ్ చేసుకోవాలి.



గాజర్ జీరా సూప్

కావాల్సిన పదార్థాలు: జీలకర్ర- ఒక చెంచా, అల్లం తరుగు- ఒక చెంచా, ధనియాల పొడి- అర చెంచా, గాజర్ తరుగు- రెండు కప్పులు, క్యాలీఫ్లవర్ తరుగు- ఒక కప్పు, మంచి నీళ్లు- నాలుగు కప్పులు, ఉప్పు- రెండు చెంచాలు, మిరియాల పొడి- అర చెంచా, బిర్యానీ ఆకు- ఒకటి, కొబ్బరి పాలు- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- కొద్దిగా, పుదీనా తరుగు- కొద్దిగా

తయారీ విధానం : స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో జీలకర్ర, అల్లం తరుగు, ధనియాల పొడి వేసి వేయించాలి. తరువాత గాజర్ తరుగు, క్యాలీఫ్లవర్ తరుగు, బిర్యానీ ఆకు వేసి అయిదు నిమిషాలపాటు కలుపుతూ ఉండాలి. ఆపైన నీళ్ల పోసి అరగంటసేపు ఉడికించాలి. తరువాత గిన్నెలోని మిశ్రమాన్ని మెత్తగా బ్లెండ్ చేయాలి. తరువాత ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. చివరగా కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి. తరువాత కొబ్బరిపాలు కలిపి వేడిగా సర్వ్ చేసుకోవాలి.

చికెన్ మాంచౌ సూప్

కావాల్సిన పదార్థాలు: నూనె- చెంచా, అల్లం తరుగు- ఒక చెంచా, వెల్లుల్లి తరుగు- రెండు చెంచాలు, సన్నగా తరిగిన చికెన్ ముక్కలు- పావు కేజీ, టమాటా తరుగు- పావు కప్పు, కేరట్ తరుగు- పావు కప్పు, క్యాబేజీ తరుగు- పావు కప్పు, క్యాప్సికమ్ తరుగు- పావు కేజీ, వేడినీళ్లు- అయిదు కప్పులు, సోయా సాస్- రెండు చెంచాలు, వెనిగర్- చెంచా, పంచదార- చిటికెడు, పచ్చిమిర్చి పేస్టు- ఒక చెంచా, మిరియాల పొడి- పావు చెంచా, ఉప్పు- తగినంత, కార్న్‌ఫ్లోర్- రెండు చెంచాలు, కోడి గుడ్డు- ఒకటి, కొత్తిమీర తరుగు- కొద్దిగా, ఉల్లికాడల తరుగు- కొద్దిగా, ఉడికించి వేయించిన నూడుల్స్- ఒక కప్పు.

తయారీ విధానం : ఒక గిన్నెలో కార్న్‌ఫ్లోర్‌ను తీసుకుని అందులో కొన్ని నీళ్ల పోస్తూ ఉండలు రాకుండా జారుగా కలపాలి. చిన్న గిన్నెలో కోడిగుడ్డును పగులగొట్టి సొనలను నురుగు వచ్చేలా బీట్ చేయాలి. స్టవ్ మీద వెడల్పాటి పాన్ పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. తరువాత చికెన్ ముక్కలు వేసి మెల్లగా కలుపుతూ పొడిపొడిగా అయ్యేవరకూ వేయించాలి. ఆపైన టమాటా, కేరట్, క్యాబేజీ, క్యాప్సీకమ్ తరుగు వేసి కలపాలి. తరువాత అందులో వేడినీళ్ల పోసి అయిదు నిమిషాలపాటు మరిగించాలి. వెంటనే సోయాసాస్, వెనిగర్, పంచదార, మిరియాల పొడి, పచ్చిమిర్చి పేస్టు, ఉప్పు, కార్న్‌ఫ్లోర్ మిశ్రమం వేసి కలపాలి. తరువాత కోడిగుడ్డు సొనల మిశ్రమాన్ని పైపైన పోస్తూ మెల్లగా కలపాలి. రెండు నిమిషాల తరువాత కొత్తిమీర తరుగు, ఉల్లికాడల తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ సూప్ పైన క్రిస్పీ నూడుల్స్ వేసి వేడివేడిగా సర్వ్ చేసుకోవాలి.





శిరోజాలు రాలుతుంటే...

చలికాలంలో శిరోజాలు ఎక్కువగా రాలిపోతూ ఉంటాయి. అలాంటప్పుడు శిరోజాలను శ్రద్ధగా సంరక్షించుకోవాలని అంటున్నారు నిపుణులు.

- వారానికి మూడుసార్లు తలకు కొబ్బరి నూనె లేదా బాదం నూనె రాసుకుని సున్నితంగా మర్దన చేసుకోవాలి.దీనివల్ల కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం ఆగుతుంది.
- రోజూ కాకుండా వారానికి మూడుసార్లు మాత్రమే తలస్నానం చేయాలి. తలస్నానానికి గంట ముందు తలకు కొద్దిగా నూనె పట్టించడం మంచిది. వేడి వేడి నీళ్లను లేదంటే చల్లటి నీళ్లను తలమీద పోసుకోకూడదు. గోరువెచ్చని నీళ్లను మాత్రమే తలస్నానానికి ఉపయోగించాలి. సల్ఫేట్ లేని తేలికపాటి షాంపూను, జుట్టుకు బలాన్నిచ్చే కండిషనర్‌ను వాడాలి. అప్పుడే మాడు మీద చర్మం పొడిబారకుండా ఉంటుంది. శిరోజాలు కూడా బలంగా పెరుగుతాయి.
- తలస్నానం చేసిన తరువాత తలకు మెత్తని పలుచని తువాలుని చుట్టి ఉంచాలి. నీళ్లన్నీ ఇంకిన తరువాత తువాలును తీసివేసి శిరోజాలను గాలికి ఆరనివ్వాలి. తడి జుట్టును దువ్వకూడదు. హెయిర్ స్ట్రెయిట్‌నర్లు, బ్లో డ్రైయర్లు, హీట్ స్టయిలింగ్ సాధనాలను వాడకూడదు.
- శిరోజాలకు పోషణను అందించే కోడిగుడ్లు, చేపలు, వాల్‌నట్‌లు, బాదాం, జీడిపప్పు, గుమ్మడి గింజలు, పాలకూర, కేరట్, బీట్‌రూట్, అవిశె గింజలను విధిగా ఆహారంలో చేర్చుకోవాలి.
- రోజూ ఉదయాన్నే పావుగంటసేపు శరీరానికి సూర్యకాంతి అందేలా చూసుకోవాలి. దీనివల్ల చర్మం పొరల్లో డి విటమిన్ ఉత్పత్తి పెరిగి మాడు మీద జుట్టు కుదుళ్లు బలపడతాయి. డి విటమిన్ సహాయంతో శరీరంలో కాల్షియం శోషణ కూడా పెరగడంతో శిరోజాలు రాలడం తగ్గుతుంది.
- చలికాలంలో ఎక్కువగా దాహం వేయదు. అయినా కానీ తరచూ మంచినీళ్లు తాగడం మంచిది. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పలుచని మజ్జిగ, వేడి వేడి సూప్‌లు తాగుతూ ఉంటే తగినంత తేమ, పోషణ అంది జుట్టు రాలడం ఆగుతుంది.
- ఇంటి నుంచి బయటికి వెళ్లేటప్పుడు శిరోజాలకు చల్లటి గాలి తగులకుండా తలకు స్కార్ఫ్ చుట్టుకోవాలి.



హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ కుమారుడు నిఖిల్-వాసంతి వివాహ రెసెప్షన్ వేడుక హోటల్ తాజ్ కృష్ణలో వైభవంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

కోకాపేటలో కోట్లవర్షం!

- అత్యధికంగా ఎకరం ధర 151.25 కోట్లు
- పోటీపడిన డెవలపర్లు
- పది గంటల పాటు సాగిన వేలం
- రెండు ప్లాట్ల విక్రయంతో హెచ్ఎండీఏకు రూ. 1,353 కోట్ల ఆదాయం

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భూముల వేలంతో కోకాపేట కోట్లపేటగా మారింది. మూడేళ్ల క్రితం ఇక్కడ ఎకరం ధర రూ.100 కోట్లు పలుకగా.. మూడు రోజుల క్రితం ఎకరం రూ.135 కోట్లు పలికింది. తాజాగా ఎకరం రూ.151.25 కోట్లు పలకడం విశేషం. శుక్రవారం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపోలీస్ లేఔట్‌లో గల 15, 16 నెంబర్ల ప్లాట్లను ఆన్‌లైన్‌లో వేలం వేశారు. నియో పోలీసు లేఅవుట్‌కు ముఖద్వారంగా ఉన్న 15వ నెంబరు ప్లాటు 4.03 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. ఈ ప్లాటుకు ఉత్తరం, తూర్పు భాగాల్లో 150 అడుగుల రోడ్డు ఉండడంతో పలువురు డెవలపర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు కొనుగోలు చేయడానికి పోటీపడ్డాయి. ఉదయం 11 గంటలకు ప్లాట్ల వేలం ప్రారంభమవగా రాత్రి 7 గంటల వరకు హోరాహోరీగా సాగింది. ఎకరాకు కనీస ధర రూ. 99 కోట్లుగా హెచ్ఎండీఏ అధికారులు నిర్ణయించారు. అయితే 4.03 ఎకరాల విస్తీర్ణంలోని 15వ నెంబరు ప్లాట్‌ను ఎకరం రూ.151.25 కోట్ల చొప్పున లక్ష్మీనారాయణ గుమ్మడి, కార్తీష్ రెడ్డి మాడుగుల, శరత్ వెంట్రప్రగడ, శ్యామ్ సుందర్ రెడ్డి వంగాల కలిసి కొనుగోలు చేశారు. 5.03 ఎకరాల విస్తీర్ణంలోని 16వ నెంబరు ప్లాటును రూ.147.75 కోట్లకు గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ అనే సంస్థ కొనుగోలు చేసింది. ఈ రెండు ప్లాట్ల విక్రయం ద్వారా హెచ్ఎండీఏకు రూ. 1,353 కోట్లు సమకూరాయి. సోమవారం కోకాపేటలో రెండు ప్లాట్ల విక్రయంతో హెచ్ఎండీఏకు రూ.1,357 కోట్ల ఆదాయం వచ్చిన విషయం విదితమే. ఇప్పటి వరకు కోకాపేట భూముల అమ్మకంతో హెచ్ఎండీఏకు రూ. 2,710 కోట్లు సమకూరాయి. డిసెంబరు 3, 5 తేదీల్లో కోకాపేటలో 2, మూసాపేటలో 15 ఎకరాల స్థలాల్ని వేలం వేయనున్నారు.



మళ్లీ పెరుగుతున్న చలి తీవ్రత

- ఆదిలాబాద్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- హైదరాబాద్‌ను వణికిస్తున్న చలిగాలులు

హైదరాబాద్ సిటీ/ఆదిలాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిన్నా మొన్నటి వరకు కాస్త తగ్గినట్లు అనిపించిన చలి తీవ్రత మళ్లీ పెరుగుతోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో చలి ప్రభావం అధికంగా ఉంటోంది. ఆదిలాబాద్ జిల్లా సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 13.2 డిగ్రీలుగా నమోదైంది. అత్యల్పంగా సాత్నాల మండలంలో 12.3 డిగ్రీలుగా రికార్డైంది. సోనాల (12.4), బేల (12.5), గాదిగూడ (12.7), బోథ్ (12.9) ప్రాంతాల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మరోవైపు, హైదరాబాద్ నగరంలోనూ చలి గాలులు వణికిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలతో శివారు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి రాంచంద్రాపురం, పటాన్‌చెరు ప్రాంతాల్లో 14.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సికింద్రాబాద్ (15.3), కుత్బుల్లాపూర్ (15.7), మాల్కాజిగిరి (15.9), రాజేంద్రనగర్, అల్వాల్ ప్రాంతాల్లో (16.3) కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

పేరు సరిపోలలేదని పరీక్ష నిరాకరణ

- ట్రాన్స్‌జెండర్‌కు ఆర్ఆర్‌బీ అధికారుల షాక్

హసన్‌పర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్‌బీ నిర్వహించిన ఉద్యోగ పరీక్షకు హాజరైన ఓ ట్రాన్స్‌జెండర్ అభ్యర్థికి అధికారులు షాకిచ్చారు. అన్ని అధికారిక ప్రక్రియలు పూర్తిచేసి, పరీక్ష హాల్‌కు చేరుకున్నప్పటికీ.. ధ్రువీకరణ పత్రాలలో పేరు సరిపోలడం లేదనే సాంకేతిక కారణాన్ని చూపుతూ ఆమెను పరీక్ష రాయడానికి తిరస్కరించారు. ఈ ఘటన శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా శంభునిపేటకు చెందిన అజయ్ సింగ్ అలియాస్ అక్షయ. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ట్రాన్స్‌జెండర్‌గా మారి పేరు మార్చుకుంది. అనంతరం ఇంటర్, డిగ్రీ పూర్తి చేసింది. ఈ క్రమంలోనే పదో తరగతి మెమోలో ఉన్న భూక్య అజయ్‌సింగ్ పేరుతోనే ట్రాన్స్‌జెండర్‌గా ఉద్యోగ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. అదే పేరుతో ఆర్ఆర్‌బీ హాల్ టికెట్ జారీ చేసింది. అదే హాల్‌టికెట్‌తో పరీక్ష రాసేందుకు కేంద్రానికి చేరుకుంది. ఎస్ఎస్‌సీ మెమోలో పేరు అజయ్ సింగ్ అని ఉండగా.. ఆధార్, పాన్‌కార్డులో మాత్రం అక్షయగా ఉందంటూ పరీక్ష హాల్ నుంచి బయటకు పంపించారు. దీంతో అక్షయ బోరున విలపిస్తూ నిరాశతో ఇంటి దారి పట్టింది. ధ్రువీకరణ పత్రాల్లో పేర్లు సరిపోలక పరీక్షకు నిరాకరించడం పట్ల ట్రాన్స్‌జెండర్ యాక్టివిస్ట్ రేఖ ఆవేదన వ్యక్తం చేశారు.



భూక్య అక్షయ అలియాస్ అజయ్‌సింగ్

జనవరి 1న అంతా లొంగిపోతాం

ఆయుధాలు కూడా అప్పగిస్తాం.. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి

- మూడు రాష్ట్రాల స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ పేరిట లేఖ
- ఆపై గంటల్లోనే లొంగిపోయిన అనంత్
- మహారాష్ట్రలో అనంత్ సహా 15 మంది లొంగిపోయినట్లు వార్తలు
- ఛత్తీస్‌గఢ్‌లో మరో 10 మంది



లొంగిపోయిన అనంత్ బృందం

చర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల ఏరివేత అంశంలో కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తున్న వేళ.. వారి నుంచి కీలక ప్రకటన విడుదలైంది. ఒక్కొక్కరుగా కాకుండా మావోయిస్టులమంతా ఒకేసారి.. 2026 జనవరి 1న ఆయుధాలు వదిలి లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్(ఎంఎంసీ) స్పెషల్ జోనల్ కమిటీ ప్రకటించింది. అయితే, అందుకు జనవరి 1 దాకా కాల్పుల విరమణ పాటించాలని షరతు పెట్టింది. అలాగే, తమ భద్రతకు, పునరావాస ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు ఆయా రాష్ట్రాలు తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ పేరిట శుక్రవారం ఓ లేఖ విడుదలైంది. అయితే ఈ లేఖ విడుదలైన కొద్ది గంటల్లోనే అనంత్ సహా 15 మంది మావోయిస్టులు మహారాష్ట్రలోని గొండియా జిల్లా సరిహద్దుల్లో లొంగిపోయారు. కాగా, అనంత్ రాసిన లేఖలో, "మూడు రాష్ట్రాల సీఎంలకు ఈ లేఖ రాస్తున్నాం. జనవరి 1న సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించుకుని, ఆయుధాలు వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలుస్తాం. అప్పటిదాకా మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించి.. కూంబింగ్‌లు నిలిపివేయాలి. ఎక్కడా అరెస్టులు, ఎన్‌కౌంటర్లు వంటి వాటికి పాల్పడవద్దు. కూంబింగ్‌లు జరిగితే అందరినీ కలవడం కష్టం. మేమే పెద్ద సంఖ్యలో లొంగిపోతాం. సతీశ్‌దాదా, సోనూ దాదాలు సీఎంల సమక్షంలో లొంగిపోయినట్లు మేం కూడా ఆయుధాలతో సహా వచ్చి మాకు భరోసానిచ్చే ప్రభు త్వం వద్ద లొంగిపోతాం. మా లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. ఇంకా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల నుంచి స్పందన రాలేదు. వారు కూడా స్పందించాలి. మేం లొంగుబాటు ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎలాంటి ఘటనలకు పాల్పడబోం. మా సహచరులందరికీ ఆడియో ద్వారా ఈ విషయం తెలియజేశాం. మావోయిస్టులు అందరూ లొంగిపోవడానికి బావొఫెంగ్ యొక్క ఫ్రీక్వెన్సీ నంబరును 435.715 జారీ చేస్తున్నాం. జనవరి 1లోపు ఉదయం 11 నుంచి 11:15 గంటల మధ్య ఒకరితో ఒకరు కనెక్టయి చర్చించాలి" అని పేర్కొన్నారు. కాగా, జనవరి 1న లొంగిపోతామంటూ శుక్రవారం లేఖ రాసిన మావోయిస్టు పార్టీ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్.. ఆ తరువాత కొద్ది గంటల వ్యవధిలోనే లొంగిపోయారు. తనతో సహా 15 మంది అనుచరుల బృందంతో మహారాష్ట్రలోని గొండియా జిల్లా సరిహద్దుల్లో లొంగిపోయినట్లు వార్తలు వచ్చాయి. వారి బృందంతో కూడిన ఓ ఫొటో కూడా విడుదలైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ జర్నలిస్టు ద్వారా అనంత్ బృందం లొంగిపోయినట్లు సమాచారం. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో శుక్రవారం మరో 10 మంది మావోయిస్టులు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ సమక్షంలో లొంగిపోయారు. వారిలో దర్బా డివిజన్ ఇన్‌చార్జ్ చైతూ అలియాస్ శ్యామ్ ఉన్నారు. 2013లో సల్వా జుడుం నేత మహేంద్రకర్మను హత్య చేసిన ఘటనలో చైతూ ప్రధాన నిందితుడు.

దేవా లొంగిపో.. తల్లి అభ్యర్థన

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో.. ఆయన తర్వాత ఆ స్థాయి నాయకుడు బర్సె దేవా అని తెలుస్తోంది. దేవా పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో దేవా గురించి తెలుసుకోవడానికి తెలంగాణ మీడియా శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని పోయో పార గ్రామానికి వెళ్లింది. హిడ్మా, దేవా తల్లులు ఇద్దరూ అక్కాచెల్లెళ్లని గ్రామస్తులు తెలిపారు. దేవా చిన్నతనంలోనే మావోయిస్టు పార్టీలోకి వెళ్లారని ఆయన తల్లి సింఫే చెప్పారు. దేవాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, పిల్లలు సుకుమా జిల్లాలో చదువుకుంటుండగా, భార్య గ్రామంలోనే ఉంటున్నారని తెలిపారు. దేవా లొంగిపోవాలని ఆమె కోరారు.

పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టు షాక్

- టీడీపీ నాయకుల జంట హత్యల కేసులో మధ్యంతర రక్షణ రద్దు చేసిన న్యాయస్థానం
- ముందస్తు బెయిల్ పొందే అర్హత లేదని వ్యాఖ్య



న్యూఢిల్లీ, గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం నాయకుల జంట హత్యల కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఇద్దరికి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేసింది. సెక్షన్ 161 కింద నమోదు చేసిన డాక్యుమెంట్లు నిందితుల వద్దకు చేరడంపై అసహనం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ పొందే అర్హతే పిన్నెల్లి సోదరులకు లేదంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఏపీలో పోలీసులు నిందితులకు సహకరిస్తున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఏడాది మే 24వ తేదీన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల జంట హత్యలు రాష్ట్రంలో అప్పట్లో కలకలం సృష్టించాయి. ఈ కేసులో ఏ1 గా జవిశెట్టి శ్రీను, ఏ2గా తోట వెంకట్రావు, ఏ3గా తోట గురవయ్య, ఏ4గా నాగరాజు, ఏ5గా తోట వెంకటేశ్వర్లు, ఏ6గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ7గా పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని చేర్చారు. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పిన్నెల్లి సోదరులు హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం నిరాకరించింది. హైకోర్టు తీర్పును ఈ ఏడాది సెప్టెంబరు 1న పిన్నెల్లి సోదరులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అన్నదమ్ములిద్దరికీ సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. తాజాగా శుక్రవారం దాన్ని రద్దు చేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పుట్టిన రోజున పెళ్లి చేసుకుందాం



వెంకటేశ్ కథానాయకుడిగా ఇంటిల్లిపాదిని అలరించిన చిత్రం 'పెళ్లి చేసుకుందాం'. ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమైంది. సాయిలక్ష్మి ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత వరప్రసాద్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ 'వెంకటేశ్ నటించిన ఆణిముత్యాల్లాంటి చిత్రాల్లో 'పెళ్లి చేసుకుందాం' ఒకటి. ఆయన పుట్టిన రోజు సందర్భంగా డిసెంబర్ 13న రీ రిలీజ్ చేస్తున్నాం. వెంకటేశ్ అభిమానులతో పాటు సినీ ప్రేమికులు మరోసారి మా చిత్రాన్ని ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు. ఈ చిత్రంలో సౌందర్య, లైలా కథానాయికలు. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో సి. వెంకట్రాజు-శివరాజు సంయుక్తంగా నిర్మించారు.



అభిమానులంతా ఆంధ్ర కింగ్సే

ఉపేంద్ర

"ఆంధ్ర కింగ్ తాలూకా' కథ విన్నప్పుడు థ్రిల్‌గా అనిపించింది. కానీ, టైటిల్ ఆంధ్ర కింగ్ అని చెప్పినప్పుడు కాస్త టెన్షన్ పడ్డాను. నేను ఆంధ్ర కింగ్ ఎలా అవుతాను అని అనిపించింది. కానీ, ఇప్పుడనిపిస్తోంది ఇక్కడున్న అభిమానులే అసలైన ఆంధ్ర కింగ్స్ అని. నేను కింగ్ లాగా ఫీలవుతున్నానంటే అది మీ గొప్పతనం. సినిమాని ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు కన్నడ నటుడు ఉపేంద్ర. రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్ బాబు తెరకెక్కించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా'లో ఆయన కీలక పాత్ర పోషించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా మేకర్స్ విలేకరుల సమావేశం నిర్వహించారు. దర్శకుడు మహేశ్ బాబు మాట్లాడుతూ' ఒక మంచి బృందంతో ప్రయాణం చేస్తున్నప్పుడు ఒక్కోసారి అద్భుతం జరుగుతుంది. అలాంటి అద్భుతమే ఈ 'ఆంధ్ర కింగ్ తాలూకా" అని అన్నారు. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'సినిమా గురించి ప్రతి ఒక్కరూ చాలా పాజిటివ్‌గా మాట్లాడుతున్నారు. ఇది చాలా లాంగ్ రన్ ఉన్న సినిమా. కచ్చితంగా మూడు వారాలు ఆడుతుందనే నమ్మకముంది' అని చెప్పారు.

మహాశివుని సాక్షిగా... అఖండ విజయం తథ్యం



- నందమూరి బాలకృష్ణ


'అఖండ 2: తాండవం' చిత్రంలో ప్రేక్షకులు మహాశివుని శక్తిని, రుద్రతాండవ విన్యాసాన్ని, సనాతన ధర్మ పరాక్రమాన్ని చూస్తారు. ఆ త్రినేత్రుడి వీక్షణ దృష్టి నాలో నిక్షిప్తమై, ఆయన త్రిశూలం నా ఆయుధానికి శక్తి శూలమై ఎలా నిలిచిందో వెండి తెరపై చూస్తారు. మహాశివుని సాక్షిగా... అఖండ విజయం తథ్యం' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించిన చిత్రమిది. డిసెంబర్ 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. బాలకృష్ణ మాట్లాడుతూ 'సనాతన ధర్మం, మన మూలాల గురించి ఈ చిత్రంలో చెప్పబోతున్నాం. ఇటీవల యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ గారికి ట్రైలర్ చూపించగా, సనాతన ధర్మం గొప్పతనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారని ప్రశంసించారు. హిందీ వెర్షన్‌లోనూ నా పాత్రకు స్వయంగా డబ్బింగ్ చెప్పాను' అని తెలిపారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ "అఖండ' చిత్రం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అందుకే తాండవం చేస్తే పరమేశ్వరుడే కనిపించాలనే కసితో ఈ సీక్వెల్ చేశాం. శత్రువులు దేశాన్ని నాశనం చేయాలని చూస్తే మన సైన్యం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా చూపించబోతున్నాం' అని పేర్కొన్నారు.

ఆది పినిశెట్టి మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి బోయపాటి గారు చెబుతున్నప్పుడు 'నేను బాలయ్య గారి పక్కన సరిపోతానా?' అని అనుకున్నాను. ఆయనతో మళ్లీ మళ్లీ పనిచేయాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో బాలయ్య గారి ఎనర్జీ మరోసారి ప్రేక్షకులను అమితంగా అలరిస్తుంది' అని చెప్పారు.


గోపీ ఆచంట మాట్లాడుతూ 'కెమెరా ముందు బాలయ్య బాబు తాండవం, కెమెరా వెనుక డైరెక్టర్ బోయపాటి గారి తాండవం... థియేటర్లలో ప్రేక్షకుల తాండవం ఖాయం' అని అన్నారు. తమన్ మాట్లాడుతూ 'ఈ సినిమాకు సంగీతం నేను అందించలేదు. ఆ శివుడే నాతో చేయించుకున్నాడు. డిసెంబర్ 5న బాక్సులు పగిలిపోయి, స్పీకర్లు పేలిపోయాయని ఎవరూ ఫిర్యాదు చేయకూడదు. ముందే సర్వీస్ చేయించి పెట్టుకోండి' అని సరదాగా స్పందించారు. ఈ చిత్రంతో మరోసారి బాలయ్య బాబు నట విశ్వరూపాన్ని ప్రేక్షకలోకం చూస్తుందని సంయుక్త చెప్పారు.

వంద జన్మలైనా రజనీగానే పుట్టాలి

● ఇఫీ ముగింపు వేడుకల్లో సూపర్‌స్టార్‌కు ఘన సత్కారం



'నేను సినిమాల్లోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయ్యాయంటే నాకే ఆశ్చర్యంగా ఉంది. నాకు ఈ 50 ఏళ్లు కేవలం పదీ, పదిహేను ఏళ్లలా గడిచిపోయాయి. సినిమా అంటే నాకున్న విపరీతమైన ప్రేమ వల్లే సమయం ఇంత వేగంగా గడిచిపోయిందేమో. నాకు మరో వంద జన్మలు ఉన్నా మళ్లీ రజనీకాంత్ గానే పుట్టించమని ఆ దేవుణ్ణి కోరుకుంటాను' అని హీరో రజనీకాంత్ అన్నారు. 56వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (ఇఫీ) ముగింపు వేడుకలు శుక్రవారం రాత్రి గోవాలో అట్టహాసంగా జరిగాయి. భారతీయ సినిమాకు 50 ఏళ్లుగా అసమాన సేవలు అందిస్తున్న రజనీకాంత్‌ను ఈ వేదికపై ఘనంగా సత్కరించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ రజనీకాంత్‌కు శాలువా కప్పి, ప్రత్యేక జ్ఞాపికను అందించి గౌరవించారు.



వియత్నాం చిత్రానికి స్వర్ణ మయూరం

అలాగే ఇఫీ పురస్కారాల విజేతల జాబితాను ప్రకటించి, అవార్డులను అందజేశారు. వియత్నాంకు చెందిన 'స్కిన్ ఆఫ్ యూత్' చిత్రం ఉత్తమ చిత్రంగా ఎంపికై ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ పురస్కారం దక్కించుకుంది. ఉత్తమ నటుడి పురస్కారం ఉబెయ్‌మార్ రియోస్ ('స్పానిష్ చిత్రం - ఏ పోయెట్)కు దక్కింది. ఉత్తమ నటిగా 'జరా సోఫియా ఓస్టాన్ (స్లొవేనియన్ ఫిల్మ్ - లిటిల్ ట్రబుల్ గర్ల్స్), ఉత్తమ దర్శకుడుగా సంతోష్ దవాఖర్ (మరాఠీ చిత్రం - 'గోంధాల్) ఎంపికయ్యారు. ఉత్తమ భారతీయ తొలి చిత్ర దర్శకుడి పురస్కారం కరణ్ సింగ్ త్యాగి (కేసరి ఛాప్టర్ 2)ని వరించింది. హిందీ సిరీస్ బందీశ్ బాండిట్స్ 2 ఉత్తమ వెబ్‌సిరీస్‌గా నిలిచింది.



పతాక సన్నివేశాలే ప్రత్యేకాకర్షణగా

"పతంగ్' సినిమా క్లైమాక్స్ కోసం ఎంతో ఖర్చు పెట్టారు. ఓ స్టేడియాన్ని తీసుకుని, పతంగుల పోటీ పెట్టి పతాక సన్నివేశాలను ఎంతో భారీగా చిత్రీకరించారు. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది. కొత్తతరం అంతా కలసి తీసిన ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధించాలి' అని నిర్మాత డి.సురేశ్ బాబు ఆకాంక్షించారు. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రధారులుగా ప్రణీత్ ప్రత్తిపాటి తెరకెక్కించిన చిత్రం 'పతంగ్'. విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. డి.సురేశ్ బాబు సమర్పణలో డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో 'ఎమోషనల్ డ్రామా' అంటూ సాగే పాటను సురేశ్ బాబు ఆవిష్కరించారు. నాని బండ్రెడ్డి మాట్లాడుతూ 'నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా. అందరికీ నచ్చుతుందనే నమ్మకముంది' అని అన్నారు.



మరో కప్‌నకు రో-కో సై

రాబోయే వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా.. లేదా అనే విషయమై కొనసాగుతున్న సందిగ్ధానికి దాదాపు తెరపడినట్టే. ఇప్పటికే టీ20లు, టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పిన రో-కో 2027లో జరిగే వన్డే ప్రపంచ కప్‌లో ఆడే విషయమై ఎంతో కాలంగా పుకార్లు వెల్లువెత్తుతున్నాయి. పైగా గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తదుపరి వన్డే వరల్డ్ కప్‌నకు యువ జట్టును రూపొందించే ప్రయత్నంలో ఉన్నారని, ఈ క్రమంలో రో-కో ద్వయం కెరీర్ ఇక ముగిసినట్టేనని విస్తృతంగా చర్చలు జరిగాయి. కానీ దక్షిణాఫ్రికాతో వైట్‌వాష్ దెబ్బకు పరిస్థితి మొత్తం మారిపోయింది. ఇప్పుడు గౌతీ, అగార్కర్‌ల పదవులకే ప్రమాదం వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో రోహిత్, విరాట్ స్థానాలపై కఠిన నిర్ణయం తీసుకొనే అవకాశాల్లేవని అంటున్నారు. పైగా..ఆస్ట్రేలియాలో జరిగిన గత వన్డే సిరీస్‌లో రో-కో ద్వయం సత్తా చాటింది. దక్షిణాఫ్రికాతో ఆడే వన్డే సిరీస్‌తో పాటు.. వన్డే వరల్డ్ కప్ వరకూ జరగబోయే సిరీస్‌ల వరకూ ఫిట్‌నెస్ కాపాడుకోవడంతోపాటు మంచి స్కోర్లు చేయగలిగితే మెగా టోర్నమెంట్‌లో రోహిత్, కోహ్లీలను తప్పక చూడగలుగుతాం.

వారికి ఆ సత్తా ఉంది: మోర్కెల్

రోహిత్, కోహ్లీలకు రాబోయే వన్డే ప్రపంచ కప్‌లో ఆడే సత్తా ఉందని భారత జట్టు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. ఆపార అనుభవజ్ఞులైన వారు అత్యున్నతస్థాయిలో టోర్నీలలో ఎన్నోసార్లు సత్తా చాటారని గుర్తు చేశాడు.

అగార్కర్‌పైనా అసంతృప్తి?



గంభీర్, అగార్కర్‌ల హయాంలో టెస్ట్‌ల్లో భారత జట్టు నిలకడ ప్రశ్నార్థకమైంది. జట్టు ఎంపికలో వీరిద్దరు అనుసరిస్తున్న విధానాలను మాజీ ఆటగాళ్లు విమర్శిస్తున్నారు. ఇంకా.. రంజీట్రోఫీ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా తిలకించకపోవడంపై అగార్కర్‌ను తప్పుబడుతున్నారు. భారత జట్టు ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లను చూడడంతో బిజీగా ఉండే అగార్కర్‌కు దేశవాళీ పోటీలకు హాజరయ్యే తీరిక లేదంటూ సెటైర్లు వేస్తున్నారు. అలాంటి అగార్కర్..అంతర్జాతీయ పోటీలు లేనప్పుడు రంజీట్రోఫీలో ఆడాలని జాతీయ జట్టు క్రికెటర్లను ఆదేశించే హక్కు ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు. మొత్తంగా సఫారీల చేతిలో ఘోర పరాభవం తర్వాత విమర్శల దాడి పెరగడంతో..సెలెక్టర్లతో మాట్లాడాలని బీసీసీఐ పెద్దలు భావిస్తున్నారని సమాచారం.

బీసీసీఐ గరం..గరం

దక్షిణాఫ్రికాతో కోల్‌కతాలో జరిగిన తొలి టెస్ట్ పిచ్‌పై గంభీర్ ప్రశంసల వర్షం కురిపించడం బీసీసీఐ పెద్దలను ఆగ్రహానికి గురిచేసిందని సమాచారం. ఈడెన్‌గార్డెన్స్ నల్లమట్టి వికెట్‌పై క్రికెట్ పండితులు కూడా పెదవి విరిచారు. ఈ తరుణంలో పిచ్‌పై గంభీర్ వ్యాఖ్యలు బీసీసీఐకి కూడా రుచించలేదట. విపరీతంగా టర్న్ అయిన వికెట్‌పై భారత జట్టు నాలుగో ఇన్నింగ్స్‌లో 93 పరుగులకే కుప్పకూలింది.

టీ20 ప్రపంచ కప్ తర్వాత..?

పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొంటున్న కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. అయితే వారిద్దరి పదవులకు ప్రస్తుతానికి ఢోకా లేదని తెలిసింది. వచ్చే ఫిబ్రవరి-మార్చి నెలల్లో టీ20 వరల్డ్ కప్ జరగనుంది. అందులో టీమిండియా కనబరచే ప్రదర్శనను బట్టి అగార్కర్, గంభీర్‌ల భవితవ్యంపై నిర్ణయం తీసుకోవాలని బీసీసీఐ భావిస్తోందని సమాచారం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మెస్సీ ఈవెంట్ టిక్కెట్ల విక్రయం షురూ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ హైదరాబాద్ ఈవెంట్ టిక్కెట్ల విక్రయం ప్రారంభమైంది. వచ్చే నెల 13వ తేదీన ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ ఈవెంట్‌కు సంబంధించి డిస్ట్రిక్ జొమాటో యాప్, వెబ్‌సైట్‌లో గురువారం టిక్కెట్ల అమ్మకాలు మొదలయ్యాయి. ఉప్పల్ స్టేడియంలో సెలబ్రెటీ ఫుట్‌బాల్ మ్యాచ్, మెస్సీకి సన్మానం, సంగీత విభావరి నిర్వహించనున్నారు. టిక్కెట్ల ధరల విషయానికొస్తే రూ.1750 నుంచి రూ.30 వేల శ్రేణి వరకు ఉన్నాయి. రూ.2 వేలు, 3,250, 5 వేలు, 7 వేలు, 8 వేలు, 13,500 రకాల టిక్కెట్లను ప్రస్తుతం అమ్మకానికి ఉంచారు. ఇందులో రూ.30 వేల శ్రేణి టిక్కెట్లకు హాస్పిటాలిటీ సదుపాయం ఉంది.

హైదరాబాద్ పరాజయం

సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

జాధవ్‌పూర్: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్‌లో గెలుపొందిన హైదరాబాద్ రెండో మ్యాచ్‌లో నిరాశపరిచింది. ఎలీట్ గ్రూప్-బిలో భాగంగా శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో మహారాష్ట్ర చేతిలో ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 191 పరుగులు చేసింది. కెప్టెన్ మిలింద్ (35 నాటౌట్) టాప్ స్కోరర్ కాగా.. తనయ్ త్యాగరాజన్ (32), రాహుల్ బుద్ధి (31), ప్రజ్ఞయ్ రెడ్డి (26) ఫర్వాలేదనిపించారు. భారీస్కోరు ఛేదనలో ఓపెనింగ్ జోడీ పృథ్వీ షా (66), అర్షిన్ కులకర్ణి (89 నాటౌట్) వేగంగా పరుగులు రాబట్టడంతో ముంబై 18.4 ఓవర్లలోనే 192/2 స్కోరు చేసి గెలిచింది. ఇక, ఎలీట్ గ్రూప్-ఎలో లఖ్‌నవూ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 66 పరుగుల తేడాతో ఒడిశాను ఓడించింది.

నిక్కీకి ఆస్ట్రేలియన్ ఓపెన్ బెర్త్

చెంగ్డూ (చైనా): భారత టెన్నిస్ ఆటగాడు నిక్కీ పూనాచ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాలో చోటు దక్కించుకున్నాడు. ఆసియా పసిఫిక్ వైల్డ్‌కార్డ్ ప్లేఆఫ్ ఈవెంట్‌లో థాయ్‌లాండ్ ఆటగాడు ప్రూచ్యా ఇసారోతో కలిసి నికీ పురుషుల డబుల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఫైనల్లో నిక్కీ జంట 6-4, 6-3తో జపాన్ జోడీ సెయిటా కుసుహర/కత్సుకి నకగవను ఓడించింది. దీంతో వచ్చే జనవరిలో జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నేరుగా డబుల్స్ మెయిన్ డ్రాలో ఆడేందుకు నిక్కీ అర్హత సాధించాడు. తమిళనాడుకు చెందిన 30 ఏళ్ల నిక్కీ గ్రాండ్‌స్లామ్‌లో తలపడడం ఇదే తొలిసారి.



ఆయుష్‌కు పగ్గాలు

- భారత జట్టులో వైభవ్ సూర్యవంశీ
- అండర్-19 ఆసియా కప్



న్యూఢిల్లీ: ఆయుష్ మాత్రే అండర్-19 ఆసియా కప్‌లో పాల్గొనే యువ భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వచ్చేనెల 12 నుంచి దుబాయ్ వేదికగా 50 ఓవర్ల ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీకి 15 మంది సభ్యులతో భారత జట్టును శుక్రవారం ప్రకటించారు. టీనేజ్ సంచలనం, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి కూడా జట్టులో చోటు కల్పించారు. ఆయుష్ ఇటీవల ఆస్ట్రేలియాతో సిరీస్‌లో భారత జట్టును ముందుండి నడిపించాడు. ఇక, విహాన్ మల్హోత్రాను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వేదాంత్, అభిగ్యాన్ (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), గోహిల్, కనిష్క్, ఖిలాన్ పటేల్, నమన్ పుష్పక్, దీపేశ్, హెనిల్ పటేల్, కిషన్, ఉధవ్ మోహన్, ఆరోన్ జార్జ్. స్టాండ్‌బై: రాహుల్, హేమ్‌చందేశన్, కిషోర్, ఆదిత్య రావత్.

భారత్-శ్రీలంక టీ20 సిరీస్
విశాఖలో రెండు మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: భారత్-శ్రీలంక మహిళల జట్లు ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనున్నాయి. డిసెంబరు 21 నుంచి 30 వరకు ఈ సిరీస్ జరగనుంది. 21, 23 తేదీల్లో జరిగే తొలి రెండు మ్యాచ్‌లకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. 26, 28, 30 తేదీలలో చివరి మూడు టీ20లు తిరువనంతపురంలో జరగనున్నాయి.

భారత మహిళల బాక్సింగ్ కోచ్‌గా శాంటియాగో



న్యూఢిల్లీ: గతంలో భారత పురుషుల బాక్సింగ్‌కు హై పెర్‌ఫార్మెన్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన 50 ఏళ్ల శాంటియాగో నివా ఇప్పుడు మహిళల జట్టుకు చీఫ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. అర్జెంటీనాకు చెందిన శాంటియాగో 2017 నుంచి 2022 వరకు భారత పురుషుల జట్టుతో కలిసి పని చేశాడు. అతని హయాంలో 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు రెండు పతకాలు సాధించారు.

సెమీస్‌కు తన్వి, శ్రీకాంత్

- గాయత్రి జోడీ కూడా



లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు తన్వీ శర్మ, ఉన్నతి హుడా, కిడాంబి శ్రీకాంత్ సింగిల్స్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. తన్వి 21-13, 21-19తో లో సిన్ యాన్ (హాంకాంగ్)పై, ఉన్నతి 21-15, 13-21, 21-16తో భారత్‌కే చెందిన రక్షితపై నెగ్గారు. పురుషుల క్వార్టర్‌ఫైనల్స్‌లో శ్రీకాంత్ 21-14, 11-4తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి, భారత షట్లర్ ప్రియాన్షు రజావత్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. శ్రీకాంత్ సెమీస్‌లో మరో భారత షట్లర్ మిథున్ మంజునాథ్‌తో తలపడనున్నాడు. మంజునాథ్ 21-18, 21-13తో సహచర షట్లర్ మన్‌రాజ్ సింగ్‌ను ఓడించాడు. మహిళల డబుల్స్‌లో టాప్‌సీడ్ గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-15, 21-16తో టర్కీ ద్వయం బెన్‌గిసు ఎర్సెటిన్/నాజ్‌లికాన్ ఇన్సిపై గెలిచి సెమీస్ చేరింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో హరిహరన్/ట్రీసా జాలీ జంట 21-18, 21-14తో ఆస్ట్రేలియా ద్వయం అండికా/నొజొమినును ఓడించి సెమీస్‌లో అడుగుపెట్టింది.

కుర్రాళ్ల ఘన బోణీ

చిలీపై భారత్ గెలుపు ● జూ. హాకీ ప్రపంచ కప్



మధురై: ఎఫ్ఐహెచ్ పురుషుల జూనియర్ హాకీ ప్రపంచ కప్‌లో ఆతిథ్య భారత్ తనదైన స్టయిల్లో బోణీ చేసింది. శుక్రవారం మొదలైన ఈ టోర్నీలో ఫేవరెట్ భారత్ 7-0 తేడాతో చిలీని చిత్తుచేసింది. గ్రూప్-బిలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్ ఆరంభం నుంచే అద్భుత జోరు చూపిన భారత ఆటగాళ్లు.. ఆద్యంతం ప్రత్యర్థిని దీటుగా కట్టడి చేశారు. చిలీకి ఒక్క గోల్‌కు కూడా అవకాశమివ్వకుండా చెలరేగారు. రోషన్ కుజుర్ (16వ, 21వ నిమిషాల్లో), దిల్‌రాజ్ సింగ్ (25వ, 34వ) చెరో రెండు గోల్స్‌తో విజృంభించగా.. అజీత్ యాదవ్ (35వ), అన్మోల్ ఎక్కా (48వ), కెప్టెన్ రోహిత్ (60వ) తలో గోల్ చేశారు. భారత్ తన రెండో మ్యాచ్‌ను శనివారం ఒమన్‌తో ఆడనుంది. ఇక, మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జర్మనీ 4-0తో దక్షిణాఫ్రికాపై గెలిచింది. అంతకుముందు జరిగిన టోర్నీ ప్రారంభ మ్యాచ్ పూల్-ఎలో ఐర్లాండ్ 4-3తో కెనడాపై విజయం సాధించింది. ఓ దశలో 1-4తో వెనుకంజలో నిలిచినా, ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకొన్న కెనడా.. రెండు గోల్స్ చేసి ప్రత్యర్థి ఆధిక్యాన్ని కొంతైనా తగ్గించింది. పూల్-డిలో స్పెయిన్ 8-0తో ఈజిప్టుపై, బెల్జియం 12-1తో నమీబియాపై గెలుపొందాయి.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,28,460 ▲	1,17,750 ▲	1,83,000 ▲
విజయవాడ	1,30,500 ▲	1,20,500 ▼	1,68,800 ▲
విశాఖపట్నం	1,30,680 ▲	1,17,100 ▼	1,83,000 ▲
రాజమండ్రి	1,28,450 ▲	1,17,750 ▲	1,67,000 ▲
ప్రొద్దుటూరు	1,25,900 ▲	1,15,830 ▲	1,68,000 ▲
ముంబై	1,26,591 ▲	1,15,957 ▲	1,64,359 ▲

రోజుకి రెండు స్టోర్లు తెరుస్తాం

అపోలో ఫార్మసీ సీఈఓ జయకుమార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రాబోయే ఐదేళ్ల కాలంలో ప్రతి రోజూ రెండు కొత్త స్టోర్లు ప్రారంభించడం, కస్టమర్ల సంఖ్యను 10 కోట్లకు పెంచుకోవడం తమ లక్ష్యమని అపోలో ఫార్మసీ సీఈఓ పి.జయకుమార్ ప్రకటించారు. శుక్రవారం యూపీలోని అయోధ్యలో కొత్త స్టోర్‌ను ప్రారంభించడంతో అపోలో ఫార్మసీ నెట్‌వర్క్ 7,000 స్టోర్ల మైలురాయిని దాటిందన్నారు. అత్యున్నత నాణ్యత గల ఔషధాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచడం తమ లక్ష్యమన్నారు. అపోలో ఫార్మసీ ప్రస్తుతం 19,000 పిన్‌కోడ్‌లకు ఔషధాలు సరఫరా చేస్తోంది. రోజూ 10 లక్షల ఆర్డర్లకు సరఫరా విస్తరించగలిగినట్టు అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభన కామినేని చెప్పారు.

భళా భారత్..



6 త్రైమాసికాల గరిష్ఠానికి దేశ జీడీపీ వృద్ధి రేటు

ఆర్థికం.. అద్భుతం!

- సెప్టెంబరు త్రైమాసికంలో 8.2 శాతంగా నమోదు
- అమెరికా సుంకాల నేపథ్యంలోనూ అంచనాలను మించిన ఆర్థిక ప్రగతి
- తయారీ, సేవల రంగాల జోరు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు నేపథ్యంలోనూ భారత ప్రగతి చక్రం అంచనాలను మించిన పరుగుతో అందరినీ అబ్బుర పరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో జీడీపీ వృద్ధి రేటు ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి ఎగబాకింది. జీఎస్‌టీ రేట్ల తగ్గుదలతో వినియోగం భారీగా పుంజుకోవచ్చన్న అంచనాలతో దేశంలో వస్తు తయారీ జోరందుకోవడంతో పాటు సేవల రంగమూ అద్భుత పనితీరును కనబరచడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. ఈ క్యూ2లో ప్రస్తుత ధరల ఆధారిత లేదా నామినల్ జీడీపీ 8.7 శాతానికి చేరుకుంది. అమెరికా మనపై సుంకాల భారాన్ని ఈ ఆగస్టులో 50 శాతానికి పెంచిన తరుణంలోనూ ఈ స్థాయి వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (క్యూ1)లో వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదు కాగా.. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో 5.6 శాతంగా ఉంది. కాగా, గత గరిష్ఠమైన 8.4 శాతం వృద్ధి రేటు 2023-24 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికం (క్యూ4)లో నమోదైంది.

శరవేగ భారత్

ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ మరోసారి తన అగ్ర కిరీటాన్ని నిలబెట్టుకుంది. ఈ జూలై-సెప్టెంబరు కాలానికి చైనా జీడీపీ వృద్ధి రేటు 4.8 శాతానికి పరిమితమైంది. చైనాను మించిన వృద్ధిని సాధిస్తుండటంతో పాటు భారత్ ప్రపంచ ఆర్థిక వృద్ధికీ ప్రధాన చోదకంగా మారింది.

స్థిర ధరల ఆధారిత జీడీపీ లేదా వాస్తవ జీడీపీ

	2025-26 (రూ.లక్షల కోట్లు)	2024-25 (రూ.లక్షల కోట్లు)	వృద్ధి (%)
జూలై-సెప్టెంబరు	48.63	44.94	8.2
ఏప్రిల్-సెప్టెంబరు	96.52	89.35	8.0

ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ లేదా నామినల్ జీడీపీ

	2025-26 (రూ.లక్షల కోట్లు)	2024-25 (రూ.లక్షల కోట్లు)	వృద్ధి (%)
జూలై-సెప్టెంబరు	85.25	78.40	8.7
ఏప్రిల్-సెప్టెంబరు	171.30	157.48	8.8

క్యూ2లో వాస్తవ స్థూల విలువ జోడింపు (జీవీఏ)

రంగం	వృద్ధి (%)
వ్యవసాయం సంబంధిత రంగాలు	3.5
మైనింగ్ అండ్ క్వారీయింగ్	-0.04
మాన్యుఫాక్చరింగ్	9.1
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవలు	4.4
నిర్మాణం	7.2
వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్	7.4
ఆర్థిక సేవలు, రియల్టీ, వృత్తి నైపుణ్య సేవలు	10.2
ప్రజా పాలన, రక్షణ, ఇతర సేవలు	9.7

ప్రథమార్ధం వృద్ధి రేటు 8 శాతం

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి (ఏప్రిల్-సెప్టెంబరు) జీడీపీ వృద్ధి రేటు 8 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వృద్ధి రేటు 6.1 శాతంగా ఉంది. ఈ ప్రథమార్ధం ట్రెండ్‌ను బట్టి చూస్తే, పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు ఆర్థిక సర్వే నివేదికలో అంచనా వేసిన 6.3-6.8 శాతాన్ని మించిపోయే అవకాశాలున్నాయి.

సంస్కరణలు కొనసాగిస్తాం

"క్యూ2లో 8.2 శాతం వృద్ధి రేటు చాలా ప్రోత్సాహకరంగా ఉంది. వృద్ధి సానుకూల విధానాలు, సంస్కరణల ప్రభావాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. ప్రజల కష్టాన్ని, వ్యాపారతత్పరతకూ ప్రతిబింబమిది. మా ప్రభుత్వం సంస్కరణలను కొనసాగించడంతో పాటు ప్రజల జీవనాన్ని మరింత సులభతరం చేసే దిశగా కృషి చేస్తుంది. - నరేంద్ర మోదీ, ప్రధాని

ఆర్థికం జోరుకు నిదర్శనం

తాజా వృద్ధి గణాంకాలు బలమైన ఆర్థిక వృద్ధితో పాటు ఆర్థిక వ్యవస్థ జోరును కనబరుస్తున్నాయి. ఆర్థిక స్థిరీకరణ, లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ పెట్టుబడులు, పలు సంస్కరణలు దేశంలో పారిశ్రామికోత్పత్తిని పెంచడంతో పాటు వ్యాపార నిర్వహణను సులభతరం చేశాయి.
- నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

4 లక్షల కోట్ల డాలర్లకు ఎకానమీ

క్యూ2లో అంచనాలను మించిన వృద్ధి నమోదైన నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 7 శాతం లేదా ఆపై స్థాయికి చేరవచ్చు. ప్రస్తుత వృద్ధి ట్రెండ్‌ను బట్టి చూస్తే, భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం ఈ ఆర్థిక సంవత్సరంలోనే 4 లక్షల కోట్ల డాలర్లు దాటిపోవచ్చు. ఈ మార్చి నాటికే భారత ఎకానమీ 3.9 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంది."
- వీ అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు

ద్రవ్య లోటు రూ.8.25 లక్షల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరుతో ముగిసిన 7 నెలల్లో కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు రూ.8,25,144 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సర లక్ష్యంలో 52.6 శాతానికి సమానమిది. గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-అక్టోబరు కాలానికి ద్రవ్య లోటు బడ్జెట్ అంచనాలో 46.5 శాతంగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు రూ.15.69 లక్షల కోట్లు లేదా జీడీపీలో 4.4%గా నమోదు కావచ్చని ఈసారి బడ్జెట్లో కేంద్రం అంచనా వేసింది.

వజ్రాభరణాలకూ హాల్‌మార్కింగ్

పరిశీలిస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ: మన దేశంలో నయా సంపన్నులకు వజ్రాల మీద ఎనలేని ప్రేమ. అయితే ప్రస్తుత మార్కెట్లో ఏవి సహజ వజ్రాలో, ఏవి ల్యాబ్స్‌లో అభివృద్ధి చేసిన వజ్రాలో తెలుసుకోవడం అందరికీ సాధ్యం కాదు. నగల వ్యాపారులకు మాత్రమే ప్రస్తుతం ఇది సాధ్యం. సామాన్యులకైతే వీటి మధ్య తేడాను కనిపెట్టడం దాదాపు అసాధ్యం. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు చౌకగా వచ్చే ల్యాబ్ డైమండ్స్‌నే.. సహజ వజ్రాలుగా చెబుతూ భారీగా దండుకుంటున్నారు. దీనికి తెరదించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏవి సహజ వజ్రాలు, ఏవి ల్యాబ్ డైమండ్స్ లేదా వాటితో చేసిన నగలో కొనుగోలుదారులే స్వయంగా తెలుసుకునేలా ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయాలని యోచిస్తోంది. కేంద్ర వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిధి ఖరే ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో ఈ విషయం వెల్లడించారు. ఈ మార్గదర్శకాలు బంగారం, వెండి లేదా వాటితో తయారు చేసిన నగల స్వచ్ఛతను తెలుసుకునేందుకు వినియోగిస్తున్న 'హాల్‌మార్క్' ప్రామాణికాల తరహాలోనే ఉంటాయని ఆమె చెప్పారు.

పసిడి ధరల నిర్ణేతలమవుతాం: వచ్చే పదేళ్లలో అంతర్జాతీయ పసిడి మార్కెట్లో ధరల నిర్ణేతగా భారత్ మారుతుందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యుజీసీ) ఇండియా సీఈఓ సచిన్ జైన్ తెలిపారు. దేశీయ పసిడి ఉత్పత్తి పెద్దగా లేకపోవడంతో ప్రస్తుతం మన దేశానికి పసిడి ధరల నిర్ణయంలో ఎలాంటి పాత్ర లేదన్నారు. అయితే వచ్చే పదేళ్లలో దేశీయ పసిడి గిరాకీలో 20 శాతం దేశీయంగా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నందున ధరల నిర్ణయంలోనూ మన దేశం నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతుందన్నారు.

లాభాల స్వీకరణతో మార్కెట్లు డౌన్

- సెన్సెక్స్ 14 పాయింట్లు పతనం

ముంబై: గురువారం ఇంట్రాడేలో జీవితకాల గరిష్ఠ స్థాయిలకు దూసుకుపోయిన ఈక్విటీ మార్కెట్ సూచీ లు వారాంతపు రోజైన శుక్రవారం నాడు నీరసపడ్డాయి. జీడీపీ గణాంకాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దూరంగా ఉండడం మార్కెట్‌ను కుంగదీసింది. శుక్రవారం రెండు రోజుల ర్యాలీకి తెర దించిన సెన్సెక్స్ 13.71 పాయింట్ల నష్టంతో 85,706.67 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 392 పాయింట్ల మేరకు పెరిగి 85,969.89 గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. మరోవైపు నిఫ్టీ 12.60 పాయింట్లు నష్టపోయి 26,202.95 వద్ద ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పాల్పడ్డారు. దీనికి తోడు విదేశీ నిధుల తరలింపు, ప్రపంచ మార్కెట్లలో ఊగిసలాట ధోరణి సూచీల కదలికలను ప్రభావితం చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 474.75 పాయింట్లు, నిఫ్టీ 134.8 పాయింట్లు లాభపడ్డాయి.

డిసెంబరు 3న మీషో ఇష్యూ: ఈ-కామర్స్ కంపెనీ మీషో తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) డిసెంబరు 3వ తేదీన మార్కెట్ తలుపు తట్టనుంది. షేరు ధర శ్రేణిని రూ.105-111గా కంపెనీ నిర్ణయించింది. 5వ తేదీన ఇష్యూ ముగుస్తుంది. ఇష్యూలో భాగంగా రూ.4,250 కోట్ల విలువ గల తాజా షేర్లు మార్కెట్లో విడుదల చేయనున్నారు. 10.55 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్ బాటలో విక్రయిస్తారు.

డిజిటల్ బ్యాంకింగ్‌కు ఆర్‌బీఐ మార్గదర్శకాలు

జనవరి 1 నుంచి అమలు

ముంబై: బ్యాంకులు అందించే డిజిటల్ బ్యాంకింగ్ సేవలకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం ఏడు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. తన నియంత్రణ పరిధిలోకి వచ్చే వాణిజ్య బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, లోకల్ ఏరియా బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, పట్టణ, గ్రామీణ సహకార బ్యాంకులు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందించాలి. బ్యాంకులు ఖాతాదారులకు అందించే డిజిటల్ బ్యాంకింగ్ సేవల విధి విధానాలు ఈ మార్గదర్శకాలకు లోబడి ఉంటాయి. బ్యాంకులు ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా తమ డిజిటల్ బ్యాంకింగ్ సేవల సమగ్ర విధి విధానాలను రూపొందించుకోవాలని ఆర్‌బీఐ కోరింది. ఖాతాదారులకు భద్రత, పారదర్శకతతో కూడిన డిజిటల్ బ్యాంకింగ్ సేవల కోసం ఆర్‌బీఐ ఈ మార్గదర్శకాలు జారీ చేసిందని భావిస్తున్నారు.

- గ్లోబల్ మ్యాథ్స్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ భాంజూ.. అమెరికాలో తొలి ఫిజికల్ లెర్నింగ్ సెంటర్‌ను ప్రారంభించింది. టెక్సాస్‌లోని మెకెన్నీలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. భాంజూ ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తోంది. తాజాగా ఈ రీజియన్‌లో స్టెమ్ విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ప్రారంభించింది.
- హైదరాబాద్‌లో నిర్వహించిన క్యూతః కాంక్లేవ్ 2025లో 400 కంపెనీలకు చెందిన 850 మంది నిపుణులు పాల్గొన్నారని క్వాలీజీల్ వెల్లడించింది. ఈ సదస్సులో పాల్గొన్న వారిలో సీఎక్స్‌ఓలు, ఇంజనీరింగ్ ప్రముఖులు, క్వాలిటీ ఇన్నోవేటర్స్ ఉన్నట్లు తెలిపింది. 'బియాండ్ అష్యూరెన్స్: ఇంజనీరింగ్ ట్రస్ట్ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఏఐ' థీమ్‌తో ఈ సదస్సును నిర్వహించారు.
- అమృతాంజన్ హెల్త్‌కేర్ లిమిటెడ్.. మార్కెట్లో ఎంతో ప్రాచుర్యం పొందిన పసుపు రంగులో ఉన్న బామ్‌ను మళ్లీ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 130 ఏళ్లకు పైగా ప్రజలతో మమేకమైన ఈ బ్రాండ్‌ను మార్కెట్లోకి తిరిగి తీసుకురావటం ఎంతో సంతోషాన్నిస్తోందని కంపెనీ తెలిపింది.
- శివ్ నాడార్ విశ్వవిద్యాలయం.. ఇంటర్‌డిసిప్లినరీ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ (ఐహెచ్‌సీ)లో తొలిసారిగా బీఏ (రీసెర్చ్) కోర్సును ప్రారంభించింది. నేచురల్ సైన్స్, సోషల్ సైన్సెస్, బిజినెస్, ఏఐ, కమ్యూనికేషన్స్ కరిక్యులమ్‌తో ఈ కోర్సును రూపొందించింది.
- లండన్‌కు చెందిన టెక్ కంపెనీ నథింగ్.. భారత మార్కెట్లోకి ఫోన్ (3ఏ) లైట్‌ను విడుదల చేసింది. 6.77 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 50 ఎంపీ కెమెరా, మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ప్రో చిప్‌సెట్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 8జీబీ ప్లస్ 128 జీబీ మెమరీతో కూడిన ఈ ఫోన్ ధర రూ.20,999. డిసెంబరు 5 నుంచి ఈ ఫోన్ మార్కెట్లో అందుబాటులో ఉండనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	640
వరంగల్	632	గోదావరి	620
చిత్తూరు	663	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	108
వరంగల్	100	గుంటూరు	111
కరీంనగర్	100	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	102
కర్నూలు	100	నెల్లూరు	107
విశాఖపట్నం	105	అనంతపురం	107
గోదావరి	108		

కేసీఆర్ దీక్ష ఓ నాటకం



- నిమ్స్ ఆస్పత్రిలో ఫ్లూయిడ్స్ తీసుకున్నారు
- తెలంగాణ వచ్చింది సోనియా చలవ వల్లే
- దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ కొత్త డ్రామా
- స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీ గల్లంతు ఖాయం
- కోమటిరెడ్డిపై కైలాష్ వ్యాఖ్యలు మూడేళ్ల కిందటివి
- అప్పట్లోనే క్షమాపణలు చెప్పారు: మహేశ్ గౌడ్
- జ్యోతిరావు పూలేకు టీపీసీసీ చీఫ్ నివాళి

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉనికి కోల్పోతున్న బీఆర్ఎస్ పార్టీ.. దీక్షా దివస్ పేరుతో కొత్త డ్రామాకు తెరలేపిందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ దీక్ష వల్ల రాలేదని, సోనియాగాంధీ చలవ వల్లే వచ్చిందని పేర్కొన్నారు. 2009లో కేసీఆర్ చేపట్టిన దీక్ష పూర్తిగా నాటకమని వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ బయటికి వస్తే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందని, బీఆర్ఎస్ శకం ముగిసిన విషయాన్ని ఆయన స్వయంగా అర్థం చేసుకున్నారని అన్నారు. రాష్ట్రం కోసం దీక్ష చేస్తున్నట్లు ప్రకటించిన కేసీఆర్.. నిమ్స్ ఆస్పత్రిలో ఫ్లూయిడ్స్ తీసుకున్నారని, ఇందుకు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. నిజమైన దీక్ష అంటే మణిపూర్ ఐరన్ లేడీ ఇరోమ్ షర్మిలదని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు చిత్త శుద్ధి ఉంటే.. ముందుగా ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులకు నివాళులర్పించాలని సూచించారు. సోనియాగాంధీ లేకుంటే తెలంగాణ వచ్చేదే కాదని స్వయంగా కేసీఆర్ అంగీకరించారని గుర్తు చేశారు. ఉస్మానియా వర్సిటీ విద్యార్థులు ఉద్యమానికి ఊపిరిగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాపాడింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ చాణక్యమేనని తెలిపారు.

స్థానిక ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గల్లంతే..

లోక్‌సభ ఎన్నికలు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గల్లంతవుతుందని మహేశ్‌గౌడ్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ కట్టుబడే ఉందన్నారు. ఈ అంశంలో బీసీ ప్రజానీకం ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్‌ల ప్రజా ప్రతినిధులను నిలదీయాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఉద్దేశించి నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కైలాష్ నేత మాట్లాడిన వీడియో మూడేళ్ల కిందటిదని, ఆ వ్యాఖ్యలపై అప్పుడే ఆయన బహిరంగ క్షమాపణలు కూడా చెప్పారని తెలిపారు. ఇక టీపీసీసీ డాక్టర్స్ సెల్ ప్రతినిధులు ఒక్కొక్కరు ఒక్కో రోజు గాంధీభవన్‌లో వైద్య సేవలు అందించాలని మహేశ్‌గౌడ్ కోరారు. డాక్టర్స్ సెల్ వైస్ చైర్మన్, జనరల్ సెక్రటరీతోపాటు ఐదు జిల్లాలకు చైర్మన్లను ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. కాగా, శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ నివాళి అర్పించారు.

అభినవ గోబెల్స్ కేటీఆర్: మేడిపల్లి సత్యం

కేసీఆర్ అనే నియంత పెంపకంలో కేటీఆర్ అభినవ గోబెల్స్‌లా తయారయ్యారని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. శుక్రవారం సీఎల్పీ మీడియా హాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికల్లోనూ చిత్తవుతున్నా కేటీఆర్‌లో మార్పు రావడంలేదన్నారు. పారిశ్రామిక భూముల బదలాయింపు పూర్తి పారదర్శకంగా జరుగుతుంటే.. కేటీఆర్, హరీశ్‌రావుకు మాత్రం అందులో రూ.లక్షల కోట్ల కుంభకోణాలు కనిపిస్తున్నాయని విమర్శించారు.

కేంద్రీకృత సైబర్ సెల్స్ ఏర్పాటు చేయాలి

- మ్యూల్ ఖాతాలను అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకోవాలి
- ప్రతి బ్యాంకు సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలి
- సైబర్ నేరాల కట్టడికి బ్యాంకులు సహకరించాలి
- బ్యాంకర్ల సమన్వయ సమావేశంలో సీపీ అవినాశ్ మహంతి

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయని, బ్యాంకు ఖాతాల నుంచే వందల కోట్లను సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ సీపీ ఆఫీస్ ఆడిటోరియంలో సైబరాబాద్ పోలీసులు, సైబరాబాద్ పరిధిలోని బ్యాంకర్లతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇవాళ సైబర్ నేరం ప్రభావం దోపిడీ లేదా స్నాచింగ్ వంటి సంప్రదాయ నేరాలకన్నా ఎక్కువగా ఉందని చెప్పారు. బాధితులు నష్టపోయిన డబ్బులు తిరిగిపొందేందుకు బలమైన వ్యవస్థల కోసం బ్యాంకర్ల సహకరించాలని కోరారు. సైబర్ ఫిర్యాదులను వేగంగా నిర్వహించడానికి కేంద్రీకృత సైబర్ సెల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి బ్యాంకు సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పెట్టుబడి పెట్టండంటూ వచ్చే ఆఫర్‌లను గుడ్డిగా నమ్మొద్దని, వాటిని పక్కాగా ధ్రువీకరించుకున్నాకే ముందుకు వెళ్లాలని సూచించారు. సైబర్ నేరాల దర్యాప్తులో భాగంగా అవసరమైన బ్యాంకు అధికారులు ఖాతా స్టేట్‌మెంట్‌లు, కేవైసీ పత్రాలను కోరుతూ అధికారిక మెయిల్స్ చేసినప్పుడు, స్పందించడంలో బ్యాంకులు ఆలస్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా స్తంభింపజేశాక ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకూడదని పేర్కొన్నారు. సైబర్ నేరాలు గణనీయంగా పెరగడానికి మ్యూల్ ఖాతాలు ప్రధాన కారణంగా మారుతున్నాయని. మ్యూల్ ఖాతాల పెరుగుదలను అరికట్టడానికి బ్యాంకర్లు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడటానికి, ఆర్థిక భద్రతను బలోపేతం చేయడానికి, సైబర్ నేరాల దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించడానికి బ్యాంకులు, సైబరాబాద్ పోలీసుల మధ్య మెరుగైన సహకారం అవసరమని పేర్కొన్నారు. సైబర్ నేరాల విచారణలో బ్యాంకులు పూర్తిస్థాయిలో సహకరిస్తే సైబర్ నేరాల తీవ్రతను తగ్గించవచ్చన్నారు. ప్రతి బ్యాంకు ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని నొక్కి చెప్పారు.

ఆసియా పవర్ ఇండెక్స్‌లో భారత్ ముందంజ

న్యూఢిల్లీ, నవంబరు 28 : ఆసియా పవర్ ఇండెక్స్(సూచిక)-2025లో భారత్ ముందంజ వేసింది. ఇందులో మేజర్ పవర్(ప్రధాన శక్తి) స్థాయికి చేరినట్లు ఆస్ట్రేలియాకు చెందిన లోవీ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి, సైనిక సామర్థ్యం ఆధారంగా ఈమేరకు నిర్ణయించారు. అయితే చైనాతో పోల్చినప్పుడు భారత్ ఆకాంక్షలకు వాస్తవ స్థితికి ఇంకా చాలా వ్యత్యాసముందని ఆ సంస్థ ప్రకటించింది. ఆ యా దేశాల వనరులు, వాటి సామర్థ్యాల ఆధారంగా ఈ సూచికలో వాటి ర్యాంకును ప్రకటిస్తారు. గత ఏడాది భారత్‌ను 38.1 స్కోర్‌తో మధ్య స్థాయి శక్తిగా ప్రకటించారు. ఈ ఏడాది ఆ స్కోర్ 40కి చేరడంతో ప్రధాన శక్తిగా గుర్తింపు వచ్చింది. కాగా ప్రపంచ వ్యాప్తంగా ఈ సూచికలో భారత్ మూడో స్థానంలో ఉండడం విశేషం. 80.5 పాయింట్లతో అమెరికా మొదటి స్థానంలో ఉంది.

హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష

- మరో నలుగురికి యావజ్జీవం
- కింది కోర్టు తీర్పును ఖరారు చేసిన హైకోర్టు

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోర్టులో తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన వ్యక్తిని హతమార్చిన ఒకరికి ఉరిశిక్ష, మరో నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేస్తున్నట్లు మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రకటించింది. తిరునల్వేలి జిల్లా చెట్టికుళంలో పాత కక్షల కారణంగా 2016లో పెరుమాళ్ అనే వ్యక్తిని అదేప్రాంతానికి చెందిన సెల్వరాజ్ (43) వర్గీయులు హత్య చేసేందుకు యత్నించారు. ఈ వ్యవహారంపై తిరునల్వేలి న్యాయస్థానంలో విచారణ జరగ్గా, సెల్వరాజ్ వర్గీయులకు వ్యతిరేకంగా అదే గ్రామానికి చెందిన వైకుంఠం అనే వ్యక్తి సాక్ష్యం చెప్పాడు. దీంతో కక్ష పెంచుకున్న సెల్వరాజ్ బృందం.. 2022 మార్చి 10వ తేదీన వైకుంఠంను హతమార్చారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేశారు. విచారణ జరిపిన తిరునల్వేలి న్యాయస్థానం.. సెల్వరాజ్‌కు ఉరిశిక్ష, నలుగురికి యావజ్జీవ కారాగారశిక్ష, మరో నలుగురికి 2 నెలల జైలుశిక్ష విధించింది. అంతేగాక తలా రూ.5 వేలు జరిమానా కూడా విధించింది. కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ నిందితులు మద్రాస్ హైకోర్టులో అప్పీలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వేల్‌మురుగన్, జస్టిస్ విక్టోరియా గౌరి నేతృత్వంలోని ధర్మాసనం.. శుక్రవారం తీర్పు వెలువరించింది. కింది కోర్టు విధించిన శిక్ష, జరిమానాలను ఖరారు చేస్తూ, అప్పీలు పిటిషన్లు కొట్టివేసింది.

ఏసీబీ వలలో పెద్దవంగర తహసీల్దార్

- 15వేలు లంచం తీసుకుంటూ దొరికిన తహసీల్దార్ డ్రైవర్



ఏసీబీకి దొరికిన తహసీల్దార్ వీరగంటి మహేందర్, డ్రైవర్ గౌతమ్

పెద్దవంగర, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర తహసీల్దార్ వీరంగటి మహేందర్ తరఫున ఆయన డ్రైవర్ ఓ రైతు నుంచి రూ. 15 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. దీంతో అతడితో పాటు తహసీల్దార్‌నూ ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దవంగర మండలంలోని పడమటితండాకు చెందిన భూక్య స్వామి ఇటీవల మరణించాడు. అతడి పేరుమీద గంట్లకుంట గ్రామ శివారులో సర్వేనెంబర్లు 212/2, 226/5, 227/5లో 3.09 ఎకరాలు భూమి ఉంది. వారసత్వ భూమిని అతని కుమారుడు భూక్య బాలు పేరు మీద మ్యుటేషన్ చేయడం కోసం తహసీల్దార్ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న బాధిత రైతు బాలు, అతడి కుటుంబసభ్యులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. తహసీల్దార్ తరఫున ఆయన డ్రైవర్ గౌతమ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల నుంచి లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

ఎయిర్‌హోస్టెస్‌పై ప్రయాణికుడి అసభ్య ప్రవర్తన

- నిందితునిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో ఎయిర్‌హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో శనివారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో నిందితునిపై కేసు నమోదైంది. దుబాయ్‌లో విమానం టేకాఫ్ తీసుకున్న తర్వాత భారత్‌కు చెందిన బినియమ్ నాజర్ అనే ప్రయాణికుడికి టీ ఇవ్వడానికి వెళ్లిన సమయంలో.. తన చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు పైలెట్‌కు సమాచారం అందించారు. విమానం శంషాబాద్‌లో ల్యాండ్ కాగానే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కనకయ్య తెలిపారు.

తలసరి 'విద్యుత్'లో తెలంగాణకు నాలుగో స్థానం

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వార్షిక తలసరి విద్యుత్ వినియోగంలో 2,508 యూనిట్లతో తెలంగాణ దేశంలో నాలుగో స్థానంలో ఉంది. 9,135 యూనిట్లతో డామన్‌డయ్యూ, దాద్రానగర్‌లు అగ్రస్థానంలో ఉండగా.. 3,745 యూనిట్లతో గోవా, 2,573 యూనిట్లతో పంజాబ్ రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను.. కేంద్ర విద్యుత్ అథారిటీ(సీఈఏ) శుక్రవారం విడుదల చేసిన నివేదికలో ఈ గణాంకాలు వెల్లడించింది. జాతీయ తలసరి విద్యుత్ వినియోగం 1,400 యూనిట్లుగానే ఉండటం గమనార్హం. రాష్ట్రంలో జెన్‌కో/సింగరేణి థర్మల్ కేంద్రాల్లో విద్యుతుత్పాదన కూడా జాతీయస్థాయి కన్నా ఎక్కువగా ఉంది. వ్యవసాయ విద్యుత్ వినియోగంలో 35.68 శాతం వాటాతో తెలంగాణ నాలుగో స్థానంలో ఉండగా.. కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

తెలంగాణ 'హెల్త్ ఫస్ట్' వ్యూహం

విజన్-2047 డాక్యుమెంటులో ఆరోగ్యానికి ప్రాధాన్యం.. పీహెచ్‌సీల్లో 2047 నాటికి వంద శాతం డాక్టర్లు

- వృద్ధుల కోసం హెల్తీఏజింగ్ తెలంగాణ మిషన్
- డాక్యుమెంటుకు వైద్యశాఖ రూపకల్పన
- దీనిపై రేపు సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'హెల్త్ ఫస్ట్' వ్యూహానికి రూపకల్పన చేస్తోంది. ప్రజల ఆరోగ్యం బాగుంటేనే వారి ఉత్పాదకత పెరిగి అభివృద్ధి సాధ్యమవుతుందనే ఆలోచనతో రూపొందించిన 'హెల్త్ డెవలప్‌మెంట్ ఫస్ట్' అజెండాలో పలు లక్ష్యాలను నిర్దేశించుకుంది. విజన్ -2047 డాక్యుమెంట్ ద్వారా ఆర్థిక వృద్ధితో పాటు మానవ సమగ్ర అభివృద్ధిని ప్రధాన వ్యూహంగా మార్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఆరోగ్యం, విద్య, ఆదాయాన్ని ఒకే కొలమానంగా తీసుకునే మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ)లో 2047 నాటికి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని రేవంత్ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు ఇతర అధికారులతో సమావేశాలు నిర్వహించి నివేదికను రూపొందించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహిస్తారని అధికారవర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, క్రిష్టినా జడ్ చోంగ్తుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించాయి.

2047 నాటికి పీహెచ్‌సీల్లో 100 శాతం డాక్టర్లు

గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పీహెచ్‌సీ)ల్లో ప్రస్తుతం 42.8 శాతం మంది వైద్యులు ఉండగా, వచ్చే ఐదేళ్లలో దాన్ని 60 శాతానికి, 2047 నాటికి వందశాతానికి తీసుకెళ్లాలని వైద్యఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ప్రతి పదివేల మంది జనాభాకు డాక్టర్, నర్సుల నిష్పత్తి పది వరకు ఉండగా, దాన్ని 2047 నాటికి 44కు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ప్రస్తుతం గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్‌డీపీ)లో వైద్య రంగం వాటా 1 శాతం ఉండగా, దానిని 5 శాతానికి పెంచాలని నిర్ణయించారు. పిల్లలు, యుక్త వయస్సు బాలికలు, మహిళల్లో రక్తహీనత, పోషకాహార లోపం నివారణకు ప్రస్తుత చేపడుతున్న కార్యక్రమాలను మరింత బలోపేతం చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు వైద్యం పెడుతున్న ఖర్చులో 37 శాతం ప్రైవేటు రంగంలోకి వెళ్తోందని, దానిని 2047 నాటికి 6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వృద్ధుల కోసం సిల్వర్ సిటీ జోన్స్

రాష్ట్రంలో 2036 నాటికి 60 ఏళ్ల వయస్సు పైబడిన జనాభా 17% దాటే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో వృద్ధుల సంరక్షణ కోసం నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య బీమా, వృద్ధాప్య, మానసిక ఆరోగ్య సహాయం వంటి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. 'హెల్తీ ఏజింగ్ తెలంగాణ మిషన్'లో భాగంగా వృద్ధుల కోసం సిల్వర్ సిటీ జోన్స్, యాక్టివ్ ఏజింగ్ హబ్స్, మెంటార్‌షిప్, సెకండ్ లైఫ్ కెరీర్స్ వంటి కార్యక్రమాల ద్వారా గౌరవప్రదమైన వృద్ధాప్య జీవనానికి ఒక సమగ్ర వ్యవస్థను నిర్మించనున్నారు. అంటువ్యాధుల పర్యవేక్షణ, స్క్రీనింగ్ కోసం డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించాలని నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తేవటం, ఇ-ఆరోగ్యం, బస్తీ దవాఖానాల ద్వారా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందించడంపై దృష్టి సారించనున్నారు.

విజన్- 2047లో ఆరోగ్య శాఖ లక్ష్యాలు

అంశం (ప్రస్తుతం)	2025 (దార్శనికత)	2047
పిల్లల్లో వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోవటం	33.1%	15%లోపు
ఎత్తుకు తగ్గ బరువు లేకపోవటం	21.7%	19%లోపు
వయస్సుకు తగ్గ బరువు లేకపోవటం	31.8%	11%లోపు
పిల్లల్లో రక్తహీనత సమస్య	70%	15%లోపు
పురుషుల్లో రక్తహీనత సమస్య	15.3%	8%లోపు
మహిళల్లో ఎనీమియా	57.6%	15%లోపు
ఊబకాయం (15-64 వయస్సు)	30-32%	20%లోపు
మాతృ మరణాలు (ప్రతి లక్షకు)	59	6
ప్రైవేటులో సిజేరియన్లు	81.5	15%లోపు
ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీ సెక్షన్	44.5	15%లోపు
ఎన్‌సీడీ స్క్రీనింగ్ రేటు	75%	100%
ప్రైమరీ కేర్ 30 నిమిషాల్లో యాక్సెస్	80%	100%
సార్వత్రిక ఆరోగ్య బీమా కవరేజ్	60.8%	100%
పీహెచ్‌సీలు	60%	100%
ప్రతి 10 వేల మందికి డాక్టర్లు, నర్సులు	10	44

డేంజర్‌జోన్‌లో హిమాలయాలు!

- కొత్త భూకంప మ్యాప్‌ను విడుదల చేసిన భారత్
- ప్రమాదకర జోన్లలో 61% భూభాగం

డెహ్రాడూన్, నవంబరు 28: టిబెట్ పీఠభూమి కింద భారత టెక్టోనిక్ ప్లేట్ రెండుగా చీలిపోతోందని, దీనివల్ల భవిష్యత్తులో హిమాలయ ప్రాంతంలో భారీ భూకంపాలు సంభవించే ప్రమాదం ఉందని ఇటీవల శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పూర్తిగా నవీకరించిన కొత్త జోన్లతో కూడిన భూకంప మ్యాప్‌ను భారత్ విడుదల చేసింది. హిమాలయ పర్వత శ్రేణి మొత్తం అత్యంత ప్రమాదకరమైన జోన్-6లో ఉన్నట్లు ఈ మ్యాప్‌లో చూపించింది. భారత్‌లోని 61 శాతం భూభాగం ఇప్పుడు సాధారణ నుంచి అధిక ప్రమాదకర జోన్లలో ఉందని ఈ మ్యాప్ సూచిస్తోంది. కొత్త మ్యాప్ భవిష్యత్తులో భూకంపాల సంభావ్యతను మరింత కచ్చితంగా అంచనా వేయడానికి ఉపయోగపడనుంది. వాడియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ డైరెక్టర్, నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ మాజీ డైరెక్టర్ వినీత్ గెహలోత్ మాట్లాడుతూ.. కొత్త మ్యాప్ హిమాలయ బెల్ట్‌కు ఎంతో ముఖ్యమైన ఏకరూపత తీసుకొచ్చిందని అన్నారు. ఈ ప్రాంతం గతంలో కూడా టెక్టోనిక్ ముప్పును ఎదుర్కొన్నప్పటికీ.. దాన్ని జోన్-4, జోన్-5లుగా విభజించారని తెలిపారు. అయితే గత మ్యాప్ నష్టాన్ని తక్కువగా అంచనా వేసిందని అన్నారు. సవరించిన భూకంప డిజైన్ కోడ్‌లో భాగంగా.. కొత్త జోన్లను గుర్తించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్).. అంతర్జాతీయంగా ఆమోదించిన సంభావ్య భూకంప ప్రమాద అంచనా (పీఎస్‌హెచ్‌ఏ) పద్ధతులను ఉపయోగించి ఈ మ్యాప్‌ను రూపొందించింది. భవిష్యత్తులో సంభవించే భూకంపాల గురించి కొత్త జోన్లతో కూడిన మ్యాప్ స్పష్టమైన అవగాహన కల్పిస్తుందని బీఐఎస్ పేర్కొంది. కాబట్టి భారత్‌లో చేపట్టే కొత్త నిర్మాణాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు 2016 మ్యాప్‌నకు బదులుగా 2025 మ్యాప్‌ను పరిశీలించాలని సూచించింది. భారత జనాభాలో ఇప్పుడు నాలుగింట మూడొంతుల మంది భూకంపాలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారని తెలిపింది.

రాష్ట్రాల అధికారాలను హరించేలా విత్తన బిల్లు

- విత్తన బిల్లు-2025 ముసాయిదాపై రాష్ట్ర మంత్రి తుమ్మల
- నకిలీ విత్తనాల నియంత్రణ, సర్టిఫికేషన్ అధికారాలు రాష్ట్రాలకు ఉండాలని వ్యాఖ్య



హైదరాబాద్, రాజేంద్రనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విత్తన బిల్లు- 2025 ముసాయిదా రాష్ట్రాల అధికారాలను హరించేలా ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. నకిలీ విత్తనాల నియంత్రణ, సర్టిఫికేషన్‌పై అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలన్నారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన బిల్లుపై శుక్రవారం జరిగిన సదస్సులో మంత్రి తుమ్మల ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యవసాయం పూర్తి బాధ్యత రాష్ట్రాలదే అయినప్పటికీ, ప్రతిపాదిత చట్టంలో అధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి కట్టబెట్టడం ఆందోళనకరమని తుమ్మల అన్నారు. విత్తనాల రిజిస్ట్రేషన్ నుంచి లైసెన్సింగ్ వరకు, మార్కెట్ నియంత్రణ నుంచి నాణ్యత పర్యవేక్షణ వరకు అన్నింటినీ కేంద్రం తన చేతుల్లోకి తీసుకోవాలనే ధోరణి కనిపిస్తున్నదని తెలిపారు. విత్తనాల నాణ్యతపై ప్రత్యక్ష పర్యవేక్షణ చేసే సామర్థ్యం రాష్ట్ర యంత్రాంగానికే ఉందని, అందువల్ల విత్తన సర్టిఫికేషన్ అధికారం రాష్ట్రాలకే ఉండాలని స్పష్టం చేశారు. విత్తన కంపెనీల కోసం విత్తనోత్పత్తి చేసేటప్పుడు రైతులకు నష్టం వాటిల్లితే పరిహారం ఇచ్చేలా చట్టం చేయాలన్నారు. విదేశీ విత్తనాలను పరీక్షించి దేశీయంగా సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాతే రైతులకు విక్రయించేలా ముసాయిదాలో మార్పులు చేయాలని తుమ్మల డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాల నియంత్రణ, విత్తనాల సర్టిఫికేషన్ అధికారాలు రాష్ట్రానికే ఉండాలని అన్నారు. ఈ ముసాయిదా చట్టంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శాసనసభలో చర్చిస్తామని, పార్లమెంట్‌లోనూ వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ సదస్సులో పాల్గొన్న వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా విత్తన చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామని, అందరి అభిప్రాయాలతో డిసెంబరు తొలి వారంలో కేంద్రానికి లేఖలు పంపుతామని చెప్పారు. ఇక, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా కేంద్ర ఒక మోడల్ చట్టాన్ని తీసుకురావాలని, రాష్ట్రాలు తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చట్టం రూపొందించుకునే అవకాశం ఉండాలని వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జానయ్య అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11,12 తేదీల్లో నిర్వహించనున్న మెగా రైతు మేళా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్లాన్‌తో 'మత్తు' వదిలించారు

(మొదటిపేజీ తరువాయి)



గుర్తించారు. ఆ పార్శిల్‌ను ఢిల్లీ నుంచి పంపిన నైజీరియన్‌ను గుర్తించి, నాలుగు నెలల క్రితం ఆపరేషన్ ప్రారంభించారు. సుమారు 15 రోజులు పూర్తిగా ఢిల్లీలోనే మకాం వేశారు. డ్రగ్స్ ముఠా అడ్డాల్లో మఫ్టీలో తిరుగుతూ వివరాలన్నీ సేకరించారు. గురువారం అక్కడి పోలీసులతో కలసి సంయుక్త ఆపరేషన్ చేపట్టి.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేశారు. శుక్రవారం న్యూఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఈగిల్ బృందం ఎస్పీ సీతారాం, ఢిల్లీ క్రైం బ్రాంచ్ జాయింట్ కమిషనర్ సురేంద్రకుమార్ ఈ ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. ఢిల్లీ, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా 'ఆపరేషన్ ఈగిల్ ఫోర్స్' చేపట్టినట్టు తెలిపారు. మెహ్రౌలీ, సంత్‌ఘర్, నిలోథి, ప్రతాప్ ఎన్‌క్లేవ్, గ్రేటర్ నోయిడా, మునిర్కా తదితర 18 ప్రాంతాల్లో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో తెలంగాణ నుంచి 180 మంది పోలీసులు పాల్గొన్నారని చెప్పారు. గ్రేటర్ నోయిడాలో డ్రగ్స్ ముఠా ఆర్థిక వ్యవహారాలు చూసే కీలక వ్యక్తి బద్రుద్దీన్‌ను అరెస్టు చేశామని, ఆయన భార్య కూడా ఈ దందాలో పాలుపంచుకుంటున్నట్టు గుర్తించామని తెలిపారు. తెలంగాణ పోలీసులు ఏడుగురిని, ఢిల్లీ పోలీసులు ముగ్గురిని కలిపి మొత్తం కలిపి 10 మంది కీలక సూత్రధారులను, మరో 30 మంది నైజీరియన్లను అరెస్టు చేశామని తెలిపారు. కాగా, డ్రగ్స్‌ను అరికట్టడంలో తెలంగాణ ఈగిల్ బృందం కృషిని సురేంద్రకుమార్ అభినందించారు.

హైదరాబాద్‌లో 11 మందికి డ్రగ్స్

కాగా, ఆపరేషన్ ఈగిల్ ఫోర్స్‌లో 5,340 ఎక్స్‌టసీ పిల్స్, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథామ్‌ఫిటమిన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఈగిల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఈ డ్రగ్స్ విలువ రూ.3.5 కోట్లు ఉంటుందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా 2 వేల మందికిపైగా వినియోగదారులు, పెడ్లర్లకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు గుర్తించామన్నారు. 16 కార్టెల్స్ ద్వారా ఈ మత్తుమందుల రవాణా జరిగిందని.. డబ్బు స్వీకరించేందుకు 59 మ్యూల్ ఖాతాలను వినియోగించారని, మొత్తం 107 బ్యాంకు ఖాతాల్లో డ్రగ్స్ కొనుగోళ్లకు సంబంధించిన డబ్బు జమైందని వివరించారు. మత్తుమందులు కావాల్సినవారు నైజీరియన్లు సూచించిన బ్యాంకు ఖాతాలకు డబ్బు పంపించి.. ఆ స్క్రీన్‌షాట్‌ను వాట్సా‌ప్‌లో పంపాక, ఢిల్లీ నుంచి కొరియర్ కంపెనీల ద్వారా పార్శిళ్లలో డ్రగ్స్ పంపుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన 11 మంది డ్రగ్స్ వినియోగదారులు ఉన్నట్టు ఇప్పటివరకు గుర్తించామని తెలిపారు.

మేడారానికి జాతీయ హోదాపై మీనమేషాలు

2 నెలల్లో జాతర.. నిధులివ్వని కేంద్రం.. పలు రాష్ట్రాల నుంచి కోటిన్నరకు పైగా భక్తులు

- నేటికీ ప్రత్యేక రైళ్లను ప్రకటించని రైల్వేశాఖ
- వేడుకను ప్రతిష్ఠాత్మంగా తీసుకున్న రాష్ట్ర సర్కారు



వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి: ఆసియాలోనే అతిపెద్దదైన మేడారం గిరిజన జాతరకు జాతీయ హోదా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ఏటా కోటిన్నరకు పైగా భక్తులు వనదేవతలను దర్శించుకుంటారు. మరో రెండు నెలల్లో ఈ మహా వేడుక ప్రారంభం కానున్నప్పటికీ.. మేడారం అభివృద్ధికి, సౌకర్యాల కల్పనకు నిధుల కేటాయింపులపై కేంద్రం దృష్టి పెట్టనేలేదు. గత మూడేళ్లుగా నామమాత్రపు నిధులు మాత్రమే విదిలిస్తోంది. నేటికీ ప్రత్యేక రైళ్ల ఏర్పాటుపై రైల్వే శాఖ ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతర అభివృద్ధిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వచ్చే జనవరి 28 నుంచి 31 వరకు జరిగే ఈ పండగకు రూ.251కోట్లు కేటాయించింది. సమ్మక్క, సారలమ్మల గద్దెల ఆధునికీకరణతో పాటు ప్రాకారం విస్తరణ, రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

నామమాత్రంగా కేంద్ర సాయం

2020లో తెలంగాణకు చెందిన నలుగురు బీజేపీ ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు కేంద్ర మంత్రులను కలిసి జాతరకు జాతీయ హోదాతో పాటు నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. దీంతో కేంద్రం గిరిజన సంక్షేమశాఖ నుంచి రూ.6.10కోట్లు కేటాయించింది. 2022లో రూ.2.50కోట్లు, 2024లో రూ.3కోట్లు మాత్రమే ఇచ్చి కేంద్రం చేతులు దులుపుకొంది. కనీసం కేంద్రం ప్రసాద్ స్కీం ద్వారానైనా రూ.50కోట్లు కేటాయించాలని భక్తులు కోరుతున్నారు.

23 ఏళ్లుగా హోదాపై డిమాండ్

మేడారం మహాజాతరను 1996లో అప్పటి తెదేపా ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించింది. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల రద్దీ పెరగడంతో మేడారం రోడ్లను విస్తరించారు. 2002 నుంచి జాతరకు జాతీయ హోదా ఇవ్వాలనే డిమాండ్ ఊపందుకుంది. 2018లో మేడారానికి జాతీయ హోదా ఇచ్చేందుకు అన్ని రకాల దస్త్రాలను గిరిజన సంక్షేమశాఖ కేంద్రానికి సమర్పించింది. అప్పటి నుంచి మేడారం మహాజాతరకు జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రం తేల్చడం లేదు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చొరవ తీసుకోవాల్సి ఉంది.

జాతర రైళ్లు కూత పెట్టేనా..?

తెలంగాణ, ఏపీలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్‌ల నుంచి భక్తులు వస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం వీరికోసం సరైన ఏర్పాట్లు చేయటం లేదు. రైళ్ల పొడిగింపుతో పాటు జాతరకు ప్రత్యేక రైళ్లను నడిపించాల్సి ఉంది. 2014 నుంచి 2024 వరకు ఆరుసార్లు మాత్రమే రైల్వేశాఖ పదహారు ప్రత్యేక రైళ్లను నడిపింది. కాగజ్‌నగర్ - కాజీపేట, వరంగల్ - సికింద్రాబాద్, ఖమ్మం - వరంగల్ - కాగజ్‌నగర్ మధ్య ప్యాసింజర్ రైళ్లను భక్తులకు అందుబాటులో ఉంచింది. వీటితో ఢిల్లీ, పుణె, ముంబయి, చెన్నై, బెంగళూరు లాంటి మెగా సిటీల నుంచి రైళ్లు వరంగల్, కాజీపేట వరకు నడిపించాలని భక్తులు కోరుతున్నారు. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ఆర్టీసీ బస్సుల్లో, ప్రవేటు వాహనాల్లో జాతరకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక రైళ్లపై ఎలాంటి ప్రకటన చేయలేదు. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు చొరవ తీసుకుని నిధుల విడుదల, జాతీయహోదాపై కేంద్రంతో ప్రకటన చేయించాలని కోరుతున్నారు.



హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రైళ్లు

- నిధులు మంజూరు, త్వరలో పనుల ప్రారంభం
- రూ.36 కోట్లతో హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో పనులు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైటెక్‌సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రైళ్లను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. దీనికి అవసరమైన నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రూ.720 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండగా, నాంపల్లి స్టేషన్ అభివృద్ధికి రూ.350 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. తెలంగాణలో ఒకేసారి 40 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో గ్రేటర్ హైదరాబాద్‌లో 4 టెర్మినల్స్ ఉన్నాయన్నారు. రూ.26 కోట్ల వ్యయంతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి, రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతో కలిసి పరిశీలించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో తొలి ఫేజ్ అభివృద్ధి పనులు పూర్తవుతాయని, అనంతరం రూ.10 కోట్లతో రెండో ఫేజ్ పనులు ప్రారంభిస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. సంక్రాంతి సందర్భంగా హైటెక్ సిటీలో 16 రైళ్లకు స్టాప్స్ ఉంటాయన్నారు. ఇక్కడ నుంచి విశాఖ పట్నం, షిర్డి, ముంబై, మచిలీపట్నం, కాకినాడ, నర్సాపురం వెళ్లే రైళ్లు ఆగుతాయన్నారు. దసరా, దీపావళి సమయంలో దూర ప్రాంతాలకు వెళ్లే కొన్ని రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ సదుపాయం కల్పించామన్నారు.

డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్ అడిగితే డేటా ఇచ్చారు

- హైకోర్టు జడ్జి అసంతృప్తి

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల జీవో 46తోపాటు ప్రత్యేకంగా వివిధ గ్రామాల్లో రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను ఖరారు చేస్తూ జారీచేసిన జీవో 46కు ఆధారమైన డెడికేటెడ్ కమిషన్ నివేదికను సమర్పించాలని ధర్మాసనం మధ్యాహ్నం ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. దీంతో సాయంత్రం ప్రభుత్వ న్యాయవాదులు కమిషన్ నివేదిక వివరాలను హైకోర్టుకు సమర్పించారు. అయితే అది కమిషన్ రిపోర్ట్ కాదని, అందులో కేవలం డేటా మాత్రమే ఉందని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కమిషన్ తాజా నివేదిక, కవరింగ్ లెటర్ వంటివి ఏవీ లేవని కేవలం డేటా వల్ల ఏం అర్థమవుతుందని పేర్కొంది. మరోవైపు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయినందున అందులో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. ఈ మేరకు కౌంటర్‌లు దాఖలు చేయాలని పేర్కొంటూ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను డిసెంబర్ 29కి వాయిదా వేసింది. ప్రస్తుత రిజర్వేషన్ల జీవో 46 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 9, 17లతోపాటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డీ, 243ఎఫ్‌లకు విరుద్ధంగా ఉందని దానిని కొట్టేయాలని పిటిషన్ దాఖలైంది.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను సన్మానిస్తున్న తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ సునీల్‌గౌడ్, తదితరులు

సీజేఐకి తెలంగాణ బార్ కౌన్సిల్ సన్మానం

హైదరాబాద్, న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్‌ను తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ సునీల్‌గౌడ్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు విజారత్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 6నెలలుగా జీతాల్లేవ్!

- కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితి
- వేతనాల కోసం ఎదురుచూస్తున్న 600 మంది

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గడిచిన ఆరు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతాల్లోని కార్యాలయాల్లో సుమారు 600 మందికి పైగా సిబ్బంది (గార్డెనింగ్, పారిశుద్ధ్యం, వాచ్‌మెన్ తదితర విధులు) వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని అంచనా. నెలల తరబడి జీతాలు అందకపోవడంతో, సిబ్బంది తమ రోజువారీ కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఇతర ఖర్చుల కోసం ప్రతి నెల అప్పులు చేసి నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం తమ ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని, బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేడుకుంటున్నారు.

సర్వే సమస్యలపై సర్కారు దృష్టి

- 411 రోవర్ల కొనుగోలుకు ఆమోదం

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భూములకు సంబంధించి సర్వే సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డుల విభాగాలు దృష్టి సారించాయి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులతోపాటు, సర్వే పనుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలను పరిష్కరించే దిశగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 8.50లక్షల దరఖాస్తులు వచ్చాయి. సర్వే సమస్యలు తప్ప మిగిలినవి ఎంతో కొంత మేర పరిష్కరిస్తున్నారు. సర్వే విభాగాన్ని సాంకేతికంగా బలోపేతం చేసేదిశగా చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. 411 రోవర్లను కొనుగోలుకు ఆమోదం తెలిపింది. జిల్లాకు 10 చొప్పున అవసరాన్ని బట్టి ఈ పరికరాలను సరఫరా చేయడం కోసం ఏజెన్సీని ఎంపిక చేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే లైసెన్స్ సర్వేయర్లను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం.. మండలానికి నలుగురు నుంచి ఆరుగురిని నియమించి వారి ద్వారా సర్వే సమస్యలను పరిష్కరించేందుకు సన్నద్ధమవుతోంది. అయితే లైసెన్స్ సర్వేయర్ల ద్వారా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందా? అనే సందేహాలను కొంతమంది రెవెన్యూ అధికారులు లేవనెత్తుతున్నారు. రెండు దశాబ్దాలుగా లైసెన్స్ సర్వేయర్ల వ్యవస్థ ఉన్నప్పటికీ ప్రజల విశ్వాసాన్ని పొందడంలో ఆ వ్యవస్థ విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. వీరి స్థానంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి శాశ్వత ప్రాతిపదికన ఒకరు లేదా ఇద్దరు సర్వేయర్లను నియమిస్తే భూ సమస్యలకు సత్వర పరిష్కారం దొరికేదనే వాదన కూడా ఉంది. సులభతర వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తెలంగాణ ముందు వరసలో ఉండాలంటే..వివాదరహితమైన భూ రికార్డుల కోసం రాష్ట్రంలో రీ సర్వేకు ప్రాధాన్యం ఇవ్వాలనే వాదనలు ఉన్నాయి. ఈ మేరకు సర్వే వ్యవస్థను బలోపేతం చేసి.. సర్వేయర్లకు సరైన శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని రెవెన్యూ నిపుణులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.


పర్యావరణ హితంగా గ్లోబల్ సమ్మిట్

ముమ్మర ఏర్పాట్లు.. వృత్తాకార డిజైన్‌లో వేదిక... 5 వేల సీటింగ్ కెపాసిటీతో హాళ్లు

- ప్రధాన వేదిక వద్ద 2,500 మంది కూర్చునేందుకు ఏర్పాట్లు
- కట్టుదిట్టమైన భద్రత.. పాస్ లేకుంటే నో ఎంట్రీ
- 3 హెలీప్యాడ్‌లు, 1000 అద్దె బస్సులు ఏర్పాటు
- అతిథుల కోసం ప్రముఖ హోటళ్లలో వెయ్యి రూములు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో వచ్చేనెల 8 నుంచి 11 వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్- 2025 పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు సమయం దగ్గరపడుతుండడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వేలాది మంది హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని పర్యవరణ హితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, అవసరమైన చోట సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడాలని అధికారులను ఆదేశించింది. ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశ, విదేశాల నుంచి దాదాపు 1,300 ప్రముఖ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరు కానుండడంతో అందరినీ ఆకర్షించే విధంగా అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సమ్మిట్ పనులను ఇటీవల పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి.. దావోస్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, దేనికి వెనకాడావద్దని అధికారులను ఆదేశించారు. దీంతో పనులు ఊపందుకున్నాయి. ప్రతిరోజు వెయ్యి మంది కార్మికులతో అధికారులు సమ్మిట్ పనులు నిర్వహిస్తున్నారు. టీజీఐఐసీ, ఫ్యూచర్ సిటీ ఎండీ శశాంక, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు నిత్యం ఇక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టే భారీ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రజెంటేషన్లు డిసెంబర్ 8, 9 తేదీల్లో ఇవ్వనుంది. పెట్టుబడుదారులతో అవగాహన ఒప్పందాలు చేసుకోవడంతో పాటు భూముల కేటాయింపులు కూడా చేయనుంది. రైజింగ్ తెలంగాణ విజన్ 2047 డాక్యుమెంట్‌తో పాటు ఫ్యూచర్ సిటీకి సంబంధించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయనుంది. వివిధ రంగాలకు సంబంధించి పెట్టుబడులను ఆకర్షించేందుకు కొత్త పాలసీలను విడుదల చేయనుంది. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలతో డిసెంబరు 10, 11వ తేదిల్లో సదస్సులు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన నమూనా చిత్రం

వృత్తాకార డిజైన్‌లో..

గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేసే అతిథులను ఆకట్టుకునేలా దాదాపు 100 ఎకరాల్లో ప్రధాన ప్రాంగణంతో పాటు ఇతర ప్రాంగణాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రాంగణం మొత్తాన్ని వృత్తాకర డిజైన్‌లో తీర్చిదిద్దుతున్నారు. ప్రాంగణం మొత్తాన్ని 32 భాగాలుగా విభజించి 5 నుంచి 6 వేల మంది కూర్చునే విధంగా సీట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన ప్రాంగణంలో 2,500 సీట్లు అమరుస్తున్నారు. కార్యాక్రమానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. పాస్ లేకుండా ఎవరినీ కూడా లోపలికి వెళ్లనివ్వరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రధాన ప్రాంగణం పక్కనే అదే సైజులో డైనింగ్ హాల్, సీఎం లాంజ్ పక్కనే వీవీఐపీ లాంజ్ ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రీనరీ పనులన్నీ హెచ్‌ఎండీఏకి అప్పగించారు.

మూడు హెలీప్యాడ్‌లు

ఈ సదస్సుకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రముఖులు హాజరుకానున్నందున వీరి కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని ప్రముఖ హోటళ్లలో సుమారు వెయ్యి గదులు బుక్ చేస్తున్నారు. అతిథులను ఈ ప్రాంగణానికి తీసుకువచ్చేందుకు వేయి అద్దె బస్సులు, మూడు హెలీ పాడ్ లు, మూడు హెలీకాప్టర్లు సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్ 3 దాదాపు ఏర్పాట్లు పూర్తిచేసి 4, 5వ తేదీల్లో ట్రయిల్ రన్ కూడా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నారు. హెలిప్యాడ్ నుంచి ప్రధాన ప్రాంగణానికి సుమారు కిలోమీటర్ దూరం ఉండడంతో ఇక్కడ కూడా ఆరు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలను ఫ్యూచర్‌సిటీ అథారిటీ కమిషన్ కార్యాలయంతో పాటు స్కిల్ యునివర్సిటీ భవన నిర్మాణాలు, అమెజాన్ డాటా కేంద్రాల పరిశీలనకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ఉజ్వల తెలంగాణలో మీరూ..

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు 3వేల మంది ప్రముఖులను ప్రభుత్వం ఈ సదస్సుకు ఆహ్వానిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, టెక్నాలజీ రంగ ప్రముఖులు ఈ జాబితాలో ఉన్నారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ట్రంప్ మీడియా, టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజవంశీకులు, వివిధ కంపెనీల అంతర్జాతీయ స్థాయి సీఈవోలు సదస్సుకు హాజరు కానున్నారు. ఆహ్వాన లేఖలను ప్రభుత్వం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరిట పంపిస్తోంది. "వికసిత్ భారత్-2047 జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మా ప్రజా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్‌ను తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, అన్ని వర్గాల సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. ఈ లక్ష్యాలను, మా ప్రభుత్వ సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబరు 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'ను నిర్వహిస్తున్నాం. తప్పకుండా తరలి రండి" అనే సందేశంతో ప్రముఖులకు ఈ ఆహ్వానం పంపించారు. ప్రభుత్వ ఆహ్వానం అందుకున్న ప్రముఖుల్లో కొందరు.. సదస్సుకు హాజరవుతున్నట్లు ప్రకటించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజవంశానికి చెందిన షేక్ తారిఖ్ అల్ ఖాసిమీ, రాస్ అల్ ఖైమా, డాయిచ్ బోర్స్ గ్రూప్ హెడ్ లుడ్విగ్ హెయిన్జెల్మాన్, ఎనిషన్ వ్యవస్థాపక భాగస్వామి డబ్ల్యూ విన్‌స్టన్, మాండల్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సీఈవో బెనెట్ నియోతో పాటు పలు టెక్ కంపెనీల సీఈవోలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ ఫౌండర్లు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. తెలంగాణ ప్రగతి, సంక్షేమాన్ని, అన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ వేదికను అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించటంతోపాటు గ్లోబల్ ఇన్నోవేషన్ దిశగా తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటి చెప్పాలని సంకల్పించింది. శుక్రవారం సదస్సు లోగోను విడుదల చేసింది.

లియోనెల్ మెస్సీ రాకతో ముగింపు..

రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబరు 9న తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. 13న ప్రపంచ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలవనుంది. ఈ మేరకు హైదరాబాద్‌కు తన రాకను మెస్సీ 'ఎక్స్'లో ధ్రువీకరించారు. హైదరాబాద్‌తో సహా నాలుగు నగరాల్లో ఆయన పర్యటన ఉండనుంది. 13న మెస్సీ కోల్‌కతాలో దిగుతారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ చేరుకుంటారు. అనంతరం 14న ముంబైలో పర్యటిస్తాడు. 15న న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమవుతారు. భారత్‌కు తన రాకను వివరిస్తూ, "నాపై భారత్ చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు. కొద్ది వారాల్లో భారత సందర్శనకు వస్తున్నా. త్వరలో మీ అందరినీ కలుస్తా" అని మెస్సీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆయన పోస్టకి సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. "మీరు హైదరాబాద్‌కు వస్తుండడం మా అందరికీ ఉత్తేజం కలిగిస్తోంది. మా ప్రాంతంలోని ప్రతి ఒక్క ఫుట్‌బాల్ అభిమానికీ మిమ్మల్ని చూడాలనేది ఒక కల. మీకు ఆతిథ్యం ఇచ్చేందుకు హైదరాబాద్ సిద్ధంగా ఉంది" అని 'ఎక్స్'లో తెలిపారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పల్స్ టు ప్లానెట్ పుస్తకాన్ని అందజేస్తున్న పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి

సీఎంను కలిసిన పద్మభూషణ్ శ్రీనాథ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారంనాడు ఆయన నివాసంలో పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మభూషణ్ ప్రొఫెసర్ కె. శ్రీనాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు తాను రచించిన 'పల్స్ టు ప్లానెట్' అనే పుస్తకాన్ని శ్రీనాథ్‌రెడ్డి బహూకరించారు.

2న టీపీసీసీ కార్యవర్గం భేటీ

- ప్రజాపాలన వారోత్సవాల్లో పార్టీ భాగస్వామ్యంపై చర్చ
- సీఎంతో టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ భేటీలో నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన వారోత్సవాల నిర్వహణలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు భాగస్వామ్యం కల్పించే అంశంపై చర్చించేందుకు గాంధీభవన్‌లో డిసెంబరు 2న టీపీసీసీ కార్యవర్గం భేటీ కానుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కార్యవర్గ సభ్యులు, నూతనంగా నియమితులైన జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు తదితరులు పాల్గొననున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో శుక్రవారం ఆయన నివాసంలో మహేష్‌గౌడ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ప్రజాపాలన వారోత్సవాలను విజయవంతం చేయడం తదితర అంశాలపై ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా డిసెంబరు 2న గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి.. జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులను ఆహ్వానించాలని, ఆ సమావేశంలో ప్రజాపాలన వారోత్సవాలను విజయవంతం చేసే అంశంపై దిశానిర్దేశం చేయాలని నిర్ణయించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల నియామకంపైనా చర్చించారు. వివాదాలను పరిష్కరించి.. కార్యవర్గం భేటీ నాటికి ఆ కమిటీల అధ్యక్షుల నియామకాన్ని పూర్తి చేయాలనుకున్నారు.

దేవరయంజాల్ ఆలయ భూ రికార్డులు ఇవ్వకపోవడంపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం దేవరయంజాల్‌లోని శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందిన దాదాపు 1500 ఎకరాలకు పైగా భూములకు సంబంధించిన రికార్డులను ఇవ్వాలని ఆదేశించినా ఎండోమెంట్ కమిషనర్ అసంపూర్ణంగా వివరాలు ఇవ్వడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సదరు భూములు ప్రభుత్వానివని పేర్కొంటూ వాటిని నిషేధిత జాబితాలో పెట్టడంపై హైకోర్టులో 54 పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం తాజాగా మరోసారి విచారణ చేపట్టింది. వచ్చే వారం రికార్డులు సమర్పించాలని పేర్కొంటూ విచారణ వాయిదా వేసింది.

కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ రాజీనామా!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ఘటనల వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించే సమస్యే లేదని స్పష్టం చేశారు. ఉన్నత స్థాయి సంస్థల్లో పని చేసే వారు సమర్థంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కాగా, పీజీ పరీక్షల మూల్యాంకనానికి సంబంధించి కాళోజీ వర్సిటీలో జరిగిన అవినీతి బాగోతంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు రాష్ట్ర గవర్నర్‌తో పాటు జాతీయ విద్యా మండలి(ఎన్ఎంసీ) ఛైర్మన్‌కు లేఖలు రాసిన సంగతి తెలిసిందే.

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర

రాహుల్‌గాంధీ కుటుంబానిది

లక్ష్మణ్.. ఏం చేశారని ఎంపీ పదవి తీసుకున్నారు?.. కాంగ్రెస్ చేసిన అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధం

- మోదీ పాలనపై చర్చకు మీరు సిద్ధమా?
- ఎఫ్‌సీఐతో నెహ్రూ.. పేదల ఆకలి తీర్చిండు
- ఇందిర పాలనలో బ్యాంకుల జాతీయం
- భూములను పేదలకు పంచి పెట్టారు
- 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన రాజీవ్
- 12 ఏళ్లలో మోదీ, షా ఏం చేశారు?
- దొంగ ఓట్లతోనే కదా మీరు గెలిచింది
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): "దేశం కోసం ఆస్తులతోపాటు ప్రాణాలనూ త్యాగం చేసిన చరిత్ర రాహుల్ గాంధీ కుటుంబానికి ఉందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. రాహుల్ కుటుంబానికి మూడు ఎంపీ పదవులు అవసరమా? అంటూ బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ.. దేశం కోసం ఏం చేశావని ఎంపీ సహా ఇతర పదవులను తీసుకున్నావు? అని లక్ష్మణ్‌ను ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ కుటుంబం ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని, మోదీ 11 ఏళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు లక్ష్మణ్ సహా బీజేపీ నేతలు సిద్ధమా? అని సవాల్ విసిరారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి రావడం.. రాకపోవడం అనేది వేరే విషయమని, కానీ చరిత్రను ఎవరూ కాదనలేరన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశానికి తొలి ప్రధానిగా ఉన్న నెహ్రూ.. ఎఫ్‌సీఐ ఏర్పాటు చేసి కరువు కాలంలోనూ పేదలకు బియ్యం అందించే ఏర్పాటు చేశారన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు పెత్తందారుల భూమిని పేదలకు పంచారని, బ్యాంకులను జాతీయం చేశారని కొనియాడారు. బాలానగర్‌లో ఐడీపీఎల్‌సహా అనేక సంస్థలను ఏర్పాటు చేసింది కాంగ్రెస్సేనని గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ ప్రధాని అయ్యాక యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని, దేశంలో ఐటీ రంగ అభివృద్ధికి బీజం వేశారని చెప్పారు. పీవీ నర్సింహారావును ప్రధానిని చేసిందీ కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడా నెహ్రూ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారని, కాంగ్రెస్ నాయకుడైన ఆయనను.. బీజేపీ నేతలు తమ వాడని చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. సోనియా, రాహుల్‌కు ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా.. రెండు సార్లూ మన్మోహన్ సింగ్‌నే ప్రధానిని చేశారని గుర్తుచేశారు. ఉపాధి హామీ వంటి అద్భుత పథకాన్ని అమలు చేసిన ఘనత సోనియాదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ హయాంలో కాదా? అని నిలదీశారు. గాంధీ కుటుంబం గురించి లక్ష్మణ్.. తన అమ్మా నాన్నను అడిగినా.. వాళ్లు దేవుళ్ల లాంటి వారనే చెబుతారని వ్యాఖ్యానించారు. 12 ఏళ్ల పాలనలో మోదీ, అమిత్‌షా దేశానికి ఏం చేశారు? తెలంగాణలో ఒక్క పెద్ద కంపెనీనైనా ఏర్పాటు చేశారా? మోదీ ద్వారా ఇక్కడి బీజేపీ నేతలు ఏం తెచ్చారు? అని ప్రశ్నించారు. దొంగ ఓట్లతోనే రెండు సార్లు బీజేపీ అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. ఈ మేరకు రాహుల్ చెప్పింది నిజమని స్పష్టం చేశారు. హైడ్రాలో బీఆర్ఎస్ అనుకూల అధికారులు ఉన్నారేమో చెక్ చేసుకోవాలంటూ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశానని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సంగారెడ్డి డీసీసీ అధ్యక్ష పదవి నిర్మలనే వద్దనుకున్నారని, మంత్రి దామోదర ఏది నిర్ణయిస్తే అదే ఫైనల్ అని చెప్పారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో సంగారెడ్డిని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. తాను అలిగేంత బలహీనమైన నేతను కాదన్నారు. రాజకీయాల్లో ఆ పదమే తనకు నచ్చదని, ఇంత కంటే బుద్ధి తక్కువ పని ఇంకోటి లేదన్నారు. రాజకీయాల్లో అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఉండవన్నారు.



సీటుకు మూట.. ఇది సరికొత్త వ్యాపార ప్రజాస్వామ్య సూత్రం

» బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'ఓటరుకు నోటు, సీటుకు మూట.. ఎన్నికలు వద్దు.. పదవులకు వేలం పాటలే ముద్దు.. ఇది సరికొత్త పెట్టుబడిదారీ వ్యాపార ప్రజాస్వామ్య సూత్రంగా మారింది' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తెలంగాణ పల్లెల్లో ఇప్పుడు ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికలు కాదు వ్యాపార.. వేలం పాటలే నడుస్తున్నాయన్నారు. సర్పంచ్ పోస్టులు అభ్యర్థులతో కాదు.. బిడ్డర్లతోనే నియమించబడుతున్నాయని పేర్కొన్నారు. రూకగ్రీవాలు శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని పోస్టు పెడుతూ.. ప్రస్తుత పరిస్థితిపై ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇలాపోతే ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కూడా ఏకగ్రీవాలవుతాయని, అదే జరిగితే.. ఓటర్లకు.. ప్రభుత్వానికీ, ఎన్నికల సంఘానికి ఎన్నికల నిర్వహణ భారమే ఉండదని, వేల కోట్ల ప్రజాధనం ఖర్చుకాకుండా ఆదా అవుతుందని వ్యాఖ్యానించారు. ప్రచారం లేదు.. ర్యాలీలు ఉండవు.. ఓటింగ్ కోసం చాంతాడంత లైన్లలో నిలబడే ఇబ్బందీ ఉండదని పేర్కొన్నారు. ఈవీఎంలు, పోలింగ్ బూత్‌లు, ఎన్నికల సిబ్బంది, పోలీసులు, సెక్యూరిటీ ఏవీ అవసరం లేకుండా ఆన్‌లైన్ వేలంతోనే పని అయిపోతుందని, ఎవరు ఎక్కువ బిడ్ వేస్తారో.. వారే గెలుస్తారన్నారు.

మజ్లిస్ కోసమే జీహెచ్ఎంసీ విస్తరణ

» ఇప్పటికే కార్పొరేషన్‌లో నిధుల కొరత

» విలీనంతో పల్లెలకు నష్టం: రాంచందర్‌రావు



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో ఒక ప్రాంతాన్ని మజ్లిస్ పార్టీకి ధారాదత్తం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం మునిసిపాలిటీల విలీనాన్ని తెరపైకి తెచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. మజ్లిస్ నేతల ఒత్తిళ్ల మేరకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. తక్షణం దీనిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాగే తుగ్లక్ పని చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. జీహెచ్ఎంసీలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం పూర్తిగా అశాస్త్రీయమని అన్నారు. జీహెచ్ఎంసీలోని బీజేపీ కార్పొరేటర్లు, ఎమ్మెల్సీలతో శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు సమావేశం నిర్వహించారు. 20 మునిసిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల విలీన పర్యవసానాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "ఏడాది కిందటే కొన్ని గ్రామాలను సంబంధిత మునిసిపాలిటీల్లో కలిపారు. ఇప్పుడు వాటిని జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకువచ్చారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంత వాసులపై పన్నుల భారం పెరుగుతుంది" అని అన్నారు.

పొరపాట్లను సరిదిద్దాలి

» బీసీ రిజర్వేషన్ల ఖరారుపై తెలంగాణ బీసీ కమిషన్

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారులో జరిగిన పొరపాట్లను ఉన్నత స్థాయి కమిటీ వేసి సరిదిద్దాలని, ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ బీసీ కమిషన్ సూచించింది. లేనిపక్షంలో బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 22.78% రిజర్వేషన్లు లభించగా, ఇప్పుడు 21.39 శాతానికి తగ్గడంపై కమిషన్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన ఇంటింటి సర్వేలో బీసీల జనాభా 56.33% ఉందని తేలినట్లు గుర్తుచేసింది. కాగా, మహాత్మా జ్యోతిబాఫూలే 135వ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీసీ కమిషన్ ప్రతినిధులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

25 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1302 మంది సిబ్బంది కొరత


» తక్షణమే నియామకాలు చేపట్టాలి: ఎఫ్‌జీజీ

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని 25 కొత్త ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1302 మంది వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఉందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ఆందోళన వ్యక్తం చేసింది. సిబ్బంది కొరత వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి తెలిపారు. ఇప్పటికైనా 1302 మంది వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిని వెంటనే నియమించి మెరుగైన వైద్య సేవలందించాలని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని లేఖ ద్వారా కోరారు. 25 ఆస్పత్రులకు గాను కేవలం మూడు ఆస్పత్రుల్లో అరకొర సిబ్బంది పని చేస్తుండగా, మిగతా 22 ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో నియామకాలు జరగలేదని వివరించారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీ: జాజుల

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో చట్టపరంగా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని మోసం చేసిన కాంగ్రెస్.. పార్టీ పరంగా ఇస్తామన్న 42% రిజర్వేషన్లు సైతం వట్టి బూటకమని తేలిపోయిందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఈ నెల 30న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్ బీసీల రాజకీయ యుద్ధభేరి' సభ సన్నాహక సమావేశం శుక్రవారం బీసీ జేఏసీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జాజుల మాట్లాడుతూ.. బీసీలకు జనరల్ స్థానాల్లో పార్టీ పరంగా 42 నుంచి 60% వరకు అవకాశం కల్పిస్తామన్న కాంగ్రెస్, బీజేపీలు.. ఆచరణలో అమలు చేయడానికి కనీస కసరత్తు కూడా చేయడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు బీసీలను మోసం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.

బీసీలపై రేవంత్ మొసలి కన్నీరు: లక్ష్మణ్



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు 42% మంత్రి పదవులు, బీసీ సబ్-ప్లాన్‌కు చట్టబద్ధత ఇవ్వడానికి ఏ కోర్టు అడ్డుపడిందో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బూటకపు హామీలిచ్చారని విమర్శించారు. మహాత్మా జ్యోతిబాఫూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు మోసమని తేలిపోయిందని ఆరోపించారు.

సీఎంను నిలదీయకుండా బీఆర్ఎస్‌పై నిందలా?

» కవిత ఆత్మవిమర్శ చేసుకోవాలి: ప్రశాంత్‌రెడ్డి


హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు కాళేశ్వరం నీళ్లు రాలేదని కవిత అవాస్తవాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. పనుల విషయంలో అలసత్వం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, సీఎం రేవంత్ రెడ్డిని నిలదీయాల్సింది పోయి గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడం ఎంతవరకు సబబని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనం కోసం తమపై నిందలు వేస్తున్నారో కవిత ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవం ప్రాజెక్టును దాదాపు రూ.1,900 కోట్లతో బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేసి, ఆ ప్రాజెక్టులోకి కింది ప్రాంతం నుంచి రివర్స్ పంపింగ్ చేసి వరద కాలువ ద్వారా నీళ్లు తెచ్చామని గుర్తు చేశారు.

ఎన్నికల ప్రక్రియను ఆపలేం

» బీసీల్లో కేటగిరీల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయకపోవడంపై పిటిషన్

» జీవో 46పై స్టేకు హైకోర్టు నిరాకరణ

» రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం నిర్దేశించిన ఎన్నికల ప్రక్రియను అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ల జీవో 46పై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఒక్కసారి ఎన్నికల ప్రక్రియ మొదలై నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత అందులో జోక్యం చేసుకోలేమని, సుప్రీంకోర్టు కూడా ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికలను అడ్డుకోరాదని చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. దీంతో మొత్తం రిజర్వేషన్లు 50% లోపు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా జీవోకు అడ్డంకులు తొలగినట్లయింది. బీసీల్లో ఏ, బీ, సీ, డీ కేటగిరీల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయకపోవడం చెల్లదని, బీసీలకు మొత్తంగా రిజర్వేషన్లు ఇస్తూ జారీచేసిన జీవోను కొట్టేయాలని, అలాగే మొత్తం రిజర్వేషన్లు 50% దాటకూడదని నిర్దేశిస్తున్న పంచాయతీరాజ్ చట్టం-2018 సెక్షన్ 285ఏకు రాజ్యాంగ బద్ధత లేదని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మడివాల మచదేవ రజకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. లక్ష్మయ్య తదితరులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది మలుగారి సుదర్శన్ వాదనలు వినిపిస్తూ ప్రస్తుత రిజర్వేషన్లను ఏ ప్రాతిపదికన ఖరారు చేశారో సదరు డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్‌ను ప్రభుత్వం బయటపెట్టడం లేదన్నారు. ఏ లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చారో తెలుసుకునే హక్కు బీసీ వర్గాలకు ఉందని తెలిపారు. బీసీలకు గంపగుత్తగా రిజర్వేషన్లు ప్రకటించడం వల్ల బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాలకు అన్యాయం జరుగుతుందని, బీసీల్లో అత్యధికంగా ఉన్న కాపు, ముదిరాజ్, యాదవ, గౌడ తదితర కులాలకు మాత్రమే రిజర్వేషన్ ఫలితాలు దక్కుతాయని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం రిజర్వేషన్ల జీవోపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఈ మేరకు బీసీల్లో సబ్ కేటగిరీ రిజర్వేషన్ల అంశంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ప్రభుత్వానికి ఆరు వారాలు, దానికి ప్రత్యుత్తరం ఇవ్వడానికి పిటిషనర్‌కు రెండు వారాల గడువు కేటాయిస్తూ విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. మరోవైపు డెడికేటెడ్ కమిషన్ నివేదికను అందజేయాలన్న పిటిషనర్ న్యాయవాది విజ్ఞప్తిని పరిశీలించిన ధర్మాసనం.. కౌంటర్లు వేసే సందర్భంగా ప్రభుత్వం కమిషన్ రిపోర్ట్‌ను అందజేయకపోతే అప్పుడు కమిషన్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశిస్తామని తెలిపింది.

సర్పంచ్‌గిరి.. వేలం వెర్రి!

(మొదటిపేజీ తరువాయి)

పోటాపోటీగా ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేయడం కంటే గ్రామాభివృద్ధి కోసం వేలం పాట నిర్వహించి పదవిని ఏకగ్రీవం చేసుకుంటే తప్పేంటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గద్వాల జిల్లాలో మొదటిరోజు నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం కాగా.. రెండోరోజు 12 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. గట్టు మండలం మిట్టదొడ్డిలో ఒక వ్యక్తి రూ.90 లక్షలకు పదవిని పాడుకొని సర్పంచ్ సాబ్ అయ్యాడు. పెంచికలపాడులో సర్పంచ్ ఉపసర్పంచ్ పదవులకు కలిపి రూ.40.5 లక్షలొచ్చాయి. ఆరగిద్దలో రూ.31 లక్షలు, తుమ్మలపల్లిలో రూ.30 లక్షలు, ముచ్చోనిపల్లిలో రూ.16 లక్షలు, తారాపురంలో రూ.16 లక్షలకు ఆశావహులు పదవులు కొట్టేశారు. గద్వాల మండలం వీరాపురం గ్రామ సర్పంచ్ పదవి రూ.50 లక్షలు పలికింది. ఇదే మండలంలోని కుర్వపల్లిలో 45 లక్షలు, ఈడిగోనిపల్లిలో 10 లక్షలు, పుటాన్‌పల్లిలో 15 లక్షలకు సర్పంచు పదవులను ఏకగ్రీవం చేశారు. కేటీదొడ్డి మండలం సుల్తానాపురంలో రూ.8లక్షలు, ధరూర్ మండలంలోని కొత్తపాలెంలో 26.50 లక్షలకు పదవులను అభ్యర్థులు దక్కించుకున్నారు. రెండోవిడత నోటిఫికేషన్ రాకముందే అయిజ మండలం ఈడిగోనిపల్లి సర్పంచ్ పదవిని రూ.7.50 లక్షలకు ఒకరు దక్కించుకోగా కిష్టాపురం గ్రామ సర్పంచ్ పదవి రూ.10.5 లక్షలు పలికింది. మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామ స్మశాన వాటిక కోసం రెండు ఎకరాల స్థలం ఇచ్చినందుకు ఓ వ్యక్తికి సర్పంచ్ పదవిని కట్టబెట్టారు. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాలను రద్దు చేయాలని నిఘా వేదిక, స్థానిక ప్రభుత్వాల సాధికారిక వేదిక డిమాండ్ చేశాయి. బలవంతపు ఏకగ్రీవాలను హైకోర్టులో సవాలు చేస్తామని స్పష్టం చేశాయి. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్ యాదయ్య గౌడ్‌తో కలిసి సంఘాల రాష్ట్ర కన్వీనర్లు వీవీ రావు, బండారు రామ్మోహన్ మాట్లాడారు. తాజా మాజీ సర్పంచ్‌లు ఎన్నో అప్పులు చేసి ఊర్లలో అభివృద్ధి పనులు చేశారని.. వారికి రావాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆలయాల నిర్మాణానికి ఓకే అని..

సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే బృందం ఊర్లో రామమందిరం కట్టించాలి! ఇదీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని దాసరిగూడెం ప్రజలు పెట్టిన షరతు. శుక్రవారం గ్రామ ప్రజలంతా సమావేశమై ఈ మేరకు తీర్మానం చేశారు. ఊర్లో 836 మంది ఓటర్లున్నారు. 8 వార్డులున్నాయి. ఆలయ నిర్మాణం హామీతో పాటు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేస్తామనే హామీ ఇవ్వడంతో సర్పంచ్‌గా ఉప్పుల వెంకటరెడ్డి, ఉపసర్పంచ్‌గా పోలగోని జ్యోతిశ్రీను బాబును, వార్డుసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం చేశారు.

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగ్గూడెం గ్రామస్తులూ ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. సర్పంచ్ పదవికి వేలం పాట నిర్వహించి.. వచ్చిన డబ్బుతో ఊర్లో ఆంజనేయ స్వామి ఆలయం కట్టుకుందామని నిర్ణయించారు. పార్టీలకతీతంగా నేతలు, ప్రజలు సమావేశమై వేలం పాట నిర్వహించారు.



నామినేషన్ ఫీజు వెయ్యి రూపాయలను రూపాయి నాణేల రూపంలో చెల్లిస్తున్న సర్పంచ్ అభ్యర్థి మహేందర్

భూక్యా సైదమ్మ రూ.20 లక్షలకు పాడుకొని సర్పంచ్ పదవిని గెలుచుకుంది. ఈ డబ్బంతా నామినేషన్ వేసే సమయంలోనే గ్రామపెద్దలకు అప్పజెప్పాలనే అంగీకారం కుదిరింది.

రూపాయి సిక్కలతో నామినేషన్

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా జంగిలి మహేందర్ నామినేషన్ కింద కట్టిన 1000 రూపాయలను లెక్కించేందుకు సిబ్బంది కొంత శ్రమపడ్డారు. ఎందుకో తెలుసా? ఆ రూ.వెయ్యిని అతడు పూర్తిగా రూపాయి సిక్కలతో చెల్లించారు. గత ఎన్నికల్లో మహేందర్ వార్డు మెంబరుగా పోటీ చేసి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు.

బరిలో మాజీ మహిళా మావోయిస్టు

సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామ సర్పంచ్‌గా ఓ మాజీ మహిళా మావోయిస్టు నామినేషన్ వేశారు. ఆమే నేరళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్క! దాదాపు రెండు దశాబ్దాలు ఆమె మావోయిస్టు పార్టీలో జ్యోతి కొనసాగారు. దండకారణ్య ప్రాంతంలో దళ నాయకురాలిగా పని చేసిన ఆమె 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు జనజీవన స్రవంతిలో కలిశారు. కొన్నాళ్లకు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

జోరుగా నామినేషన్లు

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడత ఎన్నికలు జరిగే 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకుగాను రెండురోజుల్లో 8198 నామినే షన్లు దాఖలయ్యాయి. తొలిరోజు 3297రాగా.. శుక్రవారం 4901 నామినేషన్లు దాఖలయ్యాయి. వచ్చే నెల 11న జరిగే తొలి విడత ఎన్నికల కోసం నామినేషన్ల స్వీకరణకు శనివారం చివరిరోజు. కాగా తొలివిడత ఎన్నికలు జరిగే 37,440 వార్డు సభ్యుల స్థానాలకుగాను శుక్రవారం వరకు 11,502 మంది నామినేషన్లు దాఖలయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

సర్పంచ్‌గా చెరో రెండున్నరేళ్లు

» వికారాబాద్ జిల్లా సిద్ధన్నమడుగులో నిర్ణయం

పెద్దేముల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం సిద్ధన్నమడుగు తండా గ్రామస్థులు తమ సర్పంచ్‌గా 'ఇద్దరిని' ఏకగ్రీవం చేశారు. ఈ ఇద్దరు చెరో రెండున్నరేళ్లు సర్పంచ్‌గా ఉంటారు. గ్రామంలో 537మంది ఓటర్లు ఉన్నారు. తమ పంచాయతీ పాలకవర్గాన్ని ఎన్నుకునేందుకు ఓటింగ్‌కు వెళ్లకూడదని వాళ్లంతా భావించారు. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు సమావేశం అయ్యారు. రాథోడ్ విజయ్, హీరాసింగ్ చౌహాన్.. ఈ ఇద్దరూ సర్పంచ్ పదవికి అర్హులని వారు నిర్ణయించుకున్నారు. అయితే, ఇద్దరూ చెరో రెండున్నరేళ్ల పాటు సర్పంచ్‌లా ఉండేలా తీర్మానం చేశారు. వీరిలో ముందుగా రాథోడ్ విజయ్ రెండున్నర సంవత్సరాల పాటు, తర్వాత హీరాసింగ్ చౌహాన్ రెండున్నర సంవత్సరాల పాటు పదవిలో ఉండేలా నిర్ణయించారు. ఈ నిర్ణయం ప్రకారం ప్రస్తుతం విజయ్ ఏకగ్రీవంగా సర్పంచ్ అవుతారు. రెండున్నరేళ్ల తర్వాత ఆయన రాజీనామా చేస్తారు. మళ్లీ ఎన్నిక పెట్టినప్పుడు హీరాసింగ్‌ను ఏకగ్రీవం చేస్తారు. వార్డు సభ్యుల స్థానాలను కూడా గ్రామస్థులు ఏకగ్రీవం చేశారు.

గిరిజన ఓటరు ఒక్కరూ లేరు.. అయినా ఎస్టీలకు రిజర్వ్!

అమ్రాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆ ఐదు గ్రామాల్లో ఒక్క గిరిజన ఓటరు కూడా లేరు.. అయినా సర్పంచ్ పదవులను ఎస్టీలకు రిజర్వ్ చేయడంతో అక్కడి ఎన్నికల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని 5 గ్రామ పంచాయతీలను ఏజెన్సీ ప్రాంతంగా గుర్తించడంతో ఆ గ్రామాల సర్పంచ్ పదవులను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. అయితే ఆ గ్రామాల్లో ఒక్క గిరిజన ఓటరు కూడా లేరు. గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కూడా గిరిజన ఓటర్లు లేక ఎవరూ పోటీ చేయకపోవడంతో ఎన్నికలే నిర్వహించలేదు. మండలంలోని బీకే లక్ష్మాపూర్‌లో 618 ఓట్లు, వంగురోనిపల్లి 621, కుమ్మరోనిపల్లి 1,169, కల్ములోనిపల్లి 556, ప్రశాంత్‌నగర్ 438 ఓట్లు ఉన్నాయి. కానీ, ఇది ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఒక్క గిరిజన ఓటరు లేకున్నా సర్పంచ్ పదవులను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. దీంతో సర్పంచ్ పదవులను ఇతర సామాజిక వర్గాలకు కేటాయించి ఎన్నికలు నిర్వహించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

మద్యం వ్యాపారులకు ఎన్నికల కిక్కు

- ఒకటి నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం
- అదే నెలలో పంచాయతీ ఎన్నికలు
- జనవరిలో మేడారం మహాజాతర..
- 500 కోట్లకు పైగా అదనపు వ్యాపారం!
- ఈ ఏడాదే పరిషత్, మున్సిపాలిటీ ఎన్నికలూ !
- కొత్త షాపుల ఓనర్లకు డబుల్ ధమాకా

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం దుకాణాల యజమానులకు పంచాయతీ ఎన్నికలు కిక్కు ఇవ్వనున్నాయి. డిసెంబరు ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 2,620 కొత్త మద్యం దుకాణాలు ప్రారంభం కానుండగా సరిగ్గా ఇదే నెలలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ సీజన్‌లో భారీ లాభాలు ఆర్జించేందుకు మద్యం షాపుల యజమానులు సిద్ధమవుతున్నారు. సాధారణంగా మద్యం షాపులు ప్రారంభించిన వెంటనే వ్యాపారం స్థిరపడటానికి కొంత సమయం పడుతుంది. కానీ, ఇప్పుడు పంచాయతీ ఎన్నికల వేడి మొదలు కావడంతో, ప్రారంభం నుంచే భారీ విక్రయాలను చూడబోతున్నాయి. అయితే, ఈ విక్రయాల జోరు కేవలం ఎన్నికలకే పరిమితం కాకుండా, జనవరిలోనూ కొనసాగే అవకాశముందని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. నూతన సంవత్సర వేడుకలతో పాటు జనవరి 28 నుంచి 31వరకు మేడారం మహాజాతర సందర్భంగా వచ్చే అదనపు ఆదాయాలు భారీ లాభాలను అందించనున్నాయి. వచ్చే ఏడాదిలోనే పరిషత్, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల ఎన్నికలు కూడా జరిగే అవకాశం ఉంది. కొత్త పాలసీ కారణంగా లైసెన్స్ ఫీజులు పెరిగినప్పటికీ, ఎన్నికల సమయంలో వచ్చే అదనపు ఆదాయం, వారి పెట్టుబడి ఖర్చులను వేగంగా తిరిగి పొందడానికి సహాయపడుతుందని ఆశిస్తున్నారు.

'ఆరంభమే అదుర్స్'!

సాధారణంగా ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు మద్యం పంపిణీ చేయడం అనేది ఆనవాయితీ. ఎన్నికలు సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలు మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా. లాటరీ ద్వారా లైసెన్స్‌లు దక్కించుకున్న వ్యాపారులు డిసెంబరు ఒకటో తేదీ నుంచి దుకాణాలను ప్రారంభించనున్నారు. దీంతో మొదటి 15 రోజుల్లోనే దాదాపు రూ.500 కోట్లకు పైగా అదనపు వ్యాపారం జరిగే అవకాశం ఉంటుందని అబ్కారీ శాఖ వర్గాలు లెక్కలు కడుతున్నాయి. మరోవైపు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఎక్సైజ్ ఉన్నతాధికారులతో ఇటీవల సమీక్షా సమావేశం నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్)ను సమూలంగా అరికట్టాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు పటిష్ఠంగా పనిచేయడం ద్వారా.. కొత్త మద్యం షాపుల అమ్మకాలు కూడా పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి

» బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న కేంద్రం

» తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

» కామారెడ్డిలో రైల్వే ట్రాక్‌పై ఆందోళన

» కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు



కవితను అదుపులోకి తీసుకుంటున్న కామారెడ్డి పోలీసులు

కామారెడ్డి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్లు రాకుండా కేంద్రంలోని బీజేపీ అడ్డుపడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శుక్రవారం తన మద్దతుదారులతో కలిసి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వే ట్రాక్‌పై కవిత ఆందోళన చేపట్టారు. సుమారు అరగంటపాటు రైల్వే ట్రాక్‌పైనే నిరసన తెలిపారు. దీంతో ఆ సమయంలో ఆ ట్రాక్ గుండా వెళ్లాల్సిన దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తోపాటు మరో గూడ్స్ రైలును రైల్వే అధికారులు నిలిపివేశారు. కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరినా వినకపోవడంతో.. కవితతోపాటు నిరసనకారులను అరెస్ట్ చేసి దేవునిపల్లి పీఎస్‌కు తరలించారు. కవితను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. రైల్వేట్రాక్‌పై ఆందోళన చేయడం, రైలు నిలిచిపోవడానికి కారణమైన కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లనకు అడ్డుపడుతున్న బీజేపీకి ఢిల్లీ వరకు మెసేజ్ పంపించేందుకే రైలురోకో చేపట్టామన్నారు. కేంద్రం దిగొచ్చేదాకా ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. తమ పోరాటం వల్లే బీసీ రిజర్వేషన్లకు బిల్లులు తెచ్చారని, అవి కూడా రాష్ట్రపతి వద్ద ఆగిపోయాయన్నారు. ఆ తర్వాత రైల్‌రోకో చేస్తామని హెచ్చరిస్తే ఆర్డినెన్స్ తెచ్చారని, అది కూడా గవర్నర్ వద్దే ఆగిపోయిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీజేపీ, కాంగ్రెస్‌తో కొట్లాడుతూనే ఉంటామన్నారు.

రేవంత్‌రెడ్డి బీసీ ద్రోహి..

సీఎం రేవంత్‌రెడ్డిని బీసీ ద్రోహిగా తాము ఇప్పటికే ప్రకటించామని కవిత తెలిపారు. ఆయన ఇప్పటివరకూ ప్రధాని మోదీకి ఈ అంశంపై ఒక్క లేఖ కూడా రాయలేదని, అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లలేదని విమర్శించారు. ఇంత తొందరగా పంచాయతీ ఎన్నికల అవసరమేముందని ప్రశ్నించారు. తమిళనాడులో నాటి సీఎం జయలలిత 9 ఏళ్లు ఎన్నికలను ఆపి రిజర్వేషన్లు సాధించారని గుర్తుచేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుతో కామారెడ్డి, నిజామాబాద్‌లో ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాలేదన్నారు. ఒక్క సీజన్‌లో మాత్రమే హల్దీ వాగు ద్వారా నీళ్లు ఇచ్చారన్నారు.

కుటుంబం నుంచి దూరం చేశారు

తనను కుటుంబం నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయించారని విలేకరుల సమావేశంలో కవిత ఆరోపించారు. అందుకు బాధగా ఉందన్నారు. సస్పెండ్ చేయించిన వారు శునకానందం పొందవచ్చునని, కానీ మరో కుటుంబం అనుకునే తెలంగాణ కోసం తాను పనిచేస్తూనే ఉంటానని చెప్పారు. తాను జైల్లో ఉన్నప్పుడు తన పిల్లల కన్నా తన తల్లి ఆరోగ్యం గురించే ఎక్కువ బాధపడ్డానని తెలిపారు.

మోసంలో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ

» పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల్ని నిలదీయండి: హరీశ్



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసగించడంలో పోటాపోటీగా ప్రయత్నిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు.. నాణానికి బొమ్మ బొరుసు వంటివని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీతో పైకి కొట్టుకున్నట్లు కనిపిస్తున్న ఆ రెండు పార్టీలు రాష్ట్రంలో ఒక్కటిగా పని చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అవినీతి పాలనకు బీజేపీ రక్షణగా నిలుస్తోందని పేర్కొన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు తునికి గ్రామ కాంగ్రెస్, బీజేపీ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో హరీశ్.. వారికి గులాబీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఉత్తర భారత రాష్ట్రాల్లో పండించే గోధుమలకు తెలంగాణలో పండించే వరి ధాన్యం మద్దతు ధర కంటే రూ.216 ఎక్కువ ప్రకటించారని, దీనివల్ల రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్రం మీదుగా వెళ్లే గోదావరి నదీ పుష్కరాలకు ఏపీకి రూ.100 కోట్లు కేటాయించిన కేంద్రం.. 8 మంది ఎంపీలను గెలిపించిన తెలంగాణకు గుండు సున్నా మిగిల్చిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ ప్రజలకే బాకీ పడిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని బీఆర్ఎస్ శ్రేణులను హరీశ్ కోరారు.

పిల్లలకు పురుగుల్లేని అన్నం పెట్టండి

ప్రభుత్వ బడుల్లో చదివే పేదలకు సరైన అన్నం పెట్టని ఈ సీఎం వల్ల లాభమేమిటని హరీశ్ రావు ప్రశ్నించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకేనని హెచ్చరికలు జారీ చేసిన సీఎం.. ఇప్పటి వరకు కల్తీ ఆహారం పెట్టిన ఎంత మందిని జైలుకు పంపారో సమాధానమివ్వాలని శుక్రవారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేసుకుంటున్నట్లు ప్రచారం చేసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ముందు విద్యార్థులకు పురుగుల్లేని అన్నం పెట్టాలని డిమాండ్ చేశారు.

7 గ్రామాలు.. 16,666 ఎకరాలు

అమరావతిలో రెండో విడత భూసమీకరణకు ఏపీ క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి రెండో విడత భూసమీకరణకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి విడతలో 34వేల ఎకరాలు సేకరించిన సీఆర్‌డీఏ తాజాగా మరో 16,666.56 ఎకరాలు సేకరించేందుకు రంగం సిద్ధం చేసింది. దీంతో అమరావతి కోసం రైతుల నుంచి 50వేల ఎకరాలు సేకరించినట్లవుతుంది. మొదటి విడత భూసమీకరణలో 28,526 మంది రైతుల నుంచి 34,400 ఎకరాలు సేకరించారు. మొదటి దశలో సీఆర్‌డీఏకు ప్రభుత్వ భూమి సుమారు 16వేల ఎకరాలు అప్పగించారు. దీంతో మొత్తం ప్రభుత్వ భూమి, రైతుల దగ్గర నుంచి తీసుకున్న భూమితో కలిపి 74వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం చేపట్టనున్నారు. రెండో విడతకు సంబంధించి ఏడు గ్రామాల్లో రైతుల నుంచి భూమిని సమీకరించనున్నారు. దీనికి సంబంధించి సీఆర్‌డీఏ త్వరలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రాజధాని ప్రాంతంలో రైల్వేస్టేషన్, రైల్వే లైన్, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం మరోసారి భూసమీకరణకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.